ంధ్రపత్రిక సచి



5-10-'55

4 అణాలు

HRA PATRIKA ILLUSTRATED WEEKL



సూత్రయజ్ఞము

చిత్రకారుడు: ఎస్. నాగవెంకటచలం—మద్రాసు.

సంవత్సర చందా
రు 12-0-0
విడిప్రతిక 4 అ

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక


Founder K NAGESWARA RAO

సంపుటము 48
సంచిక 5
5-10-55


మన్మథ నిజ భాద్రపద బహుళ చతుర్థి బుధవారం

రెండేళ్ల ఆంధ్రరాష్ట్ర చరిత్రలో కొన్ని ప్రధాన ఘట్టాలు

(1-5 పేజీలు)



ఆంధ్రరాష్ట్ర ప్రారంభోత్సవంనాడు పండిట్ నెహ్రూ ఆంధ్రశాసనసభ్యులకు కర్తవ్యబోధ చేశారు.




1953 అక్టోబరు 1-వ తేదీని పండిట్ నెహ్రూ ఆంధ్రరాష్ట్రానికి కర్నూలులో ప్రారంభోత్సవం జరిపారు.



రాష్ట్ర ప్రారంభోత్సవం 1 అక్టో, 53



1954 జూలైలో గుంటూరులో ఆంధ్ర హైకోర్టు ప్రారంభోత్సవం జరిగింది.




1954 సెప్టెంబరులో తిరుపతి విశ్వవిద్యాలయం స్థాపించబడింది



1955 ఫిబ్రవరి - మార్చిలో రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ విజయం పొందింది.



బి. గోపాలరెడ్డిగారి
కొత్తమంత్రివర్గం
ప్రమాణస్వీకారం



ఆంధ్రదేశానికి విరివిగా విద్యుచ్ఛక్తి నివ్వగల మచ్ ఖండ్ ప్రాజెక్టు. 1955 ఆగస్టులో విద్యుచ్ఛక్తిసరఫరా ప్రారంభమైంది.



తుంగభద్ర ప్రాజెక్టు: ఈసంవత్సరమె హైదరాబాద్ వైశ
కాలువకు తుంగభద్ర నీరు ప్రవహించి



కృష్ణ రెగ్యులేటర్ బ్రిడ్జిపని చురుకుగా సాగిపోతోంది.

నాటిక:

సాలభంజిక ★ ఆరుద్ర

మహోపద్రవం తరవాత నిశ్శబ్దంలోంచి వస్నగా బృందగానం.


అగాధమైన గతమ్ములో
పల గాఢమైన తమస్సులు
తమస్సులందున కథలు దిగబడి
చేయుచుండు తపస్సులు.

ప్రశ్న ఏమిటి? ఏమంటున్నారూ?
జవాబు. వినబడలేదా అయితే వన్సుమోర్.
కొన్ని గొంతులు: వన్సుమోర్.
బృందగానం:

అగాధమైన గతమ్ములో
పల గాఢమైన తమస్సులు
తమస్సులందున కథలు దిగబడి
చేయుచుండు తపస్సులు.

ప్ర. అంటే అర్థం ఏమిటి?
జ బోధపడలేదా?
ప్ర. పడితే అడుగుతానా?
జ కథలు తపస్సు చేస్తున్నాయట.
ప్ర ఎక్కడ?
జ తమస్సులోనట.
ప్ర అంటే?
జ చీకటిలో. .
ప్ర ఏ చీకట్లో? రేచీకట్లోనా?
జ కాదు అగాధమైన గతమ్ములోపల గాఢమైన తమస్సులోనట
ప్ర అంటే?
జ అంటే 'ఏ' లోతైన పాతకాలంలో.
ప్ర పాతకాలం లోతా?
జ కాదా
ప్ర: అవును గాబోలు.
బృందగానం:

కటికచీకటి గనులలో
నిమీలితలగు కనులతో
కథలు తలకింద్రై
మునుపు వినవింద్రై
తమసునం దిటులున్నవి
తపసు చేయుచున్నవి.



ప్ర: ఎందుకు??
జ: విముక్తికోసం.
ప్ర: అంటే?
జ వినబడడంకోసం
విడివడడంకోసం
ప్ర: ఏమని తపస్సు చేస్తున్నాయి?
రెండు ఆడగొంతులు:

ఏడీ కవి లేడా
రాడా రవి రాడా
మా గొంతులు విడివడవా
లోకానికి వినబడవా
తరాల తరబడి
ఇలాగ దిగబడి
చీకటిలో కూరుకుపోయి
చలిగా వెలిగా చనిపోయి
బూడిదగుట్టలమయిపోయి
ఈడనె ఇటులనె ఉండాలా?
ఏడీ కవి లేడా?
రాడా కవి రాడా?

ప్ర కవెందుకూ?
జ కథ చెప్పడానికి
ప్ర. కథ చెప్పడానికయితే కవెందుకూ?
జ వాడైతే బాగా చెప్తాడు
ప్ర: ఆc ఏం చెప్తాడు వాడి మొఖం?
జ కవైతేనే బాగా చెప్తాడు కమ్మగా కల్లగల్లగా చెప్పగలవాడు వాడే
ప్ర. కాదు. ఎన్నికల ప్రచారం చేసే వాణ్ణి ఎవణ్ణైనా పిలిస్తే - ఎంత చేదునైనా తీపిగా చెప్తాడు. వాణ్ని పిలవకూడదూ?
జ పదవికి సంబంధించిన కథైతే అలాగే పిలుద్దాం.
ప్ర పదవికి సంబంధించిన కథ లేదా?
జ. లేకేం - మహోన్నత పదవి, మహేంద్ర సమానమైన పదవి - మాననీయమైన- ఎంతో ఎంతో ఎంతో ఎంతో గొప్ప పదవికి సంబంధించిన కథ ఉంది
ప్ర: తియ్యకూడదూ? దాన్ని పైకి తీయకూడదూ. ప్రచారం చేసేవాణ్ణి పిలవకూడదూ పదిమంది చెవులలో దాన్ని వేయకూడదూ.
జ. తీదాం - పిలుద్దాం - వేద్దాం.

కటిక చీకటిలో
కనలుచుండే కథను
కుములుచుండే కథను
తీద్దాం పైకి తీద్దాం
పదిమందికీ చాల ఉప
చరించేదాన్ని పదిమందికీ తాను
పచరించగలవాణ్ణి
పిలుద్దాం - వాణ్ణి పిలుద్దాం.

బృందగానం:

కదలిరావే కథా
కదలిరావే కథా
గతములో ని నిదర
వదలి రావే కథా
కదలిరావే కథా
దిక్కున్న చోటికే
పోగలవు
ముక్కోటి చెవులలో
పడగలవు
దిక్కులేని గతమ్ములోనం
మొక్కపోయిన బతుకులో
ఒక్క తెవు పడిఉంటివింకను
చక్కగా లోకాన మసలగ
కదలిరావే కథా
కదలిరావే కథా
మునిమాపు సమయాన
తన ముద్దు బిడ్డకి
మునిగోరు ముద్దలను
తినిపించు తల్లి
వినిపించడానికి
అనువైన విలువైన
ఆకారమును దాల్చి
కదలిరావే కథా
కదలిరావే కథా
మల్లెమందిరికింద
చల్ల వెన్నెలలో
పిల్లవాడికి తండ్రి
మెల్లగా చెప్పగా
అనువైన చనువైన
ఆకారమును దాల్చి
కదలిరావే కథా

కదలిరావే కథా
అగరువత్తుల మత్తు
పొగలోన చలిలోన
సగము కౌగిలి వేడి
పగలలో ఇరులలో
ప్రియురాలి చెవిలోన
ప్రియుని గుసగుసగా
అనువైన సొగసైన
ఆకారమును దాల్చి
కదలిరావే కథా
కదలిరావే కథా

వచ్చాను పోజరయ్యాను నాతో
తెచ్చాను నవ నవ వైచిత్రి
సాహసౌదార్యాది సద్గుణరాశి
ఇమ్మగా ఉన్నాయి
తొమ్మిది రసములు
కమ్మగా ఉన్నాయి
కల్పన సొగసులు
వచ్చాను నన్ను వినిపించండి

ప్ర: నీ పేరేమిటి?

కథ: ద్వాత్రింశతి సాలభంజిక కథలు.

జ: అట్టె అట్టె అలాగే ఉండు అప్పుడే చెప్పెయ్యకు కథ పచరించేవాడు రావాలి, రాని

ప్ర: ఏం కథ తనకథ చెప్పుకోకూడదూ?

జ: చెప్పుకొంటే రక్తి ఉండదు.

ప్ర: ఏం ఎందుకుండదు?

జ. కథ చెప్పడానికి టెక్నిక్ - శైలి, సప్పెన్సు కొసమెరుపు ఎన్నో అవసరం ప్రచారం చేసే ఆయన ఇవన్నీ విచారించాలి ముందర

ప్ర: ఇవన్నీ కథలో ఉన్నవేగా? ఏం కథా? ఏమంటావు?

కథ: అవేమిటో నాకు తెలియవు

జ: అందుకే పచరించే ఆయన రానీ

ప్ర: ఆయన్ని తొందరగా పిలవకూడదూ?

జ: వస్తారు తొందరపడకండి.

ప్ర: ఏం చేస్తున్నాడాయన? పెద్దగుర్రాలకు పళ్లు తోముతున్నాడా?

జ. అవును ఎన్నికల పందేల్లో పోటీచేసున్న హయరాజాల దంతధావన కానిస్తున్నారు

ప్ర: ఆయన్ని తొందరగా రమ్మనరాదో? కథవిన కుతూహలం కలుగుతోంది.

[రైలు హైలు సవ్వడి........ .. రైలు ఆగింది.]

జ. ఇదుగో ఇప్పుడే వచ్చేస్తారు
వారుగో వచ్చేశారు
దయచెయ్యండి స్వాగతం
విచ్చెయ్యండి సుస్వాగతం

పచరించే మనిషి: ఆఁ. ఏమిటండీ నావల్ల ఏం కావాలి?

ప్ర: ఇక్కడో కథ ఉంది దీన్ని మీరు ప్రచారంలోకి బహుళ ప్రచారంలోకి తీసుకురావాలి రాగలరా?

పచ: ఓ అది నాకు పోతపాలతో పెట్టిన విద్య ఈకథని జనులు ఏకగ్రీవంగా ఎన్నుకొంటే ఏమిటి వాళ్ళకి లాభం? ఏమనిస్తాం వాగ్దానం?

కథ: ఎవరు నాకథ విందురో
వారికెపుడూ కలుగును
శౌర్య ధైర్య పరాక్రమాదులు
సాహసౌదార్యాది గుణములు
ఎన్నియో ఇంకెన్నియో.

పచ: అబ్బబ్బ - అవన్నీ పాతప్రామిసులు
కొత్తవి కొన్ని సరికొత్తవి
కలుగుతాయని చెప్పవలె
దేశం సుభిక్షం అవుతుందని
అందరికీ అయిదెకరాల పొలం
అందరికీ అరచేతిలో కలం
ఇంట్లో ఒక రేడియో
వాకిట్లో కారూ
కుర్రాళ్ళకి చదువూ
పెళ్లానికి నగలూ
అమ్మాయికి పెళ్ళీ
అబ్బాయికి కట్నం
ఇత్యాది వాగ్దానాలు
ఇచ్చెయ్యాలి మనం

ప్ర: అన్నీ ఈకథలో సాధ్యమా?

పచ: అయ్యో అడ్డప్రశ్నలు వెయ్యకండి
నేను పచరించుతున్న కథ
ఎన్నదగ్గదయితే
ఎన్నో చెప్పెయ్యాలి
ఏవో చెప్పెయ్యాలి
కోరుతారు ప్రజలెపుడూ
గొంతెమ్మ కోర్కెలు
తీరుస్తామని అనేస్తే
తీరిపోతుంది మన అవసరం
సరే నిలబడుతున్న ఈ కథ పేరు.

కథ: నా పేరు ద్వాత్రింశతి సాలభంజికల కథలు

పచ: అంత పెద్ద పేరు
వింత పెద్ద పేరు
ఎలా నోరు తిరిగేను
కత్తిరించెయ్ కొంత

కథ: సాలభంజిక అంటేనో...

పచ: బాగానే ఉంది
సాలభి జింక
సాలభి జింక.

కథ: సాలభి జింక కాదు సాలభంజిక.

ప్ర: ఆగండి ఆగండి
అట్టె - అట్టె
నాదొక ప్రశ్న
ఆయా మాటకు
ఏమిటి అర్థం?

పచ: సాలభి జింక అంటే మాయలేడి అర్థం.

కథ. అదికాదండి అర్థం
అది అనర్థం
సాలభంజిక అంటే
పాంచాలిక.

పచ. పాంచాలిక పాంచాలిక
ఓహో - ద్రౌపతీ వస్త్రాపహరణం
అదా కథ మరి చెప్పరేం.

కథ: ఇది మరీ అనర్థం
పాంచాలిక అంటే-

పచ: పంచపాండవుల ఆలి
పాంచాలి అనేగా అర్థం.

కథ: కాదు కాదు
కాదు కాదు
పాంచాలిక అన్నా
సాలభంజిక అన్నా
బొమ్మ అని తాత్పర్యము.

పచ: సాలభిజింక అనేది ఏభాష?

కథ: సాలభిజింక కాదు సాలభంజిక.

పచ. అదే అదే. అదే భాష?

కథ: సంస్కృతం

ప్ర: తెలుగువాళ్లకా కథను చెపుతూ
సంస్కృతం పేరెందుకో?
తెలుగు పేరే పెట్టుకొంటే
తెలుస్తుందే తక్షణం

కథ: నాకథ సంస్కృత కథ

పచ: అలాగా? అయితే సరే సోదర సోదరీమణులారా సంస్కృతం ఉందే అది దేవభాష. అది మన భాషలకి తల్లిభాష మన భాషలోని మాటలన్నీ దానిలోంచే పుట్టాయి

ప్ర: అట్టె - అట్టె ఆగండి ఆగండి మాటలన్నీ పుట్టాయా? మాటలు కొన్ని పుట్టాయా? మాట అన్నమాట సంస్కృతం నుంచి పుట్టిందా? పుట్టింది అనేది దాని నుంచే పుట్టిందా?

పచ: లేదనుకోండి గాని దేవభాష చూడండీ సరే భాషగొడవ మన కెందుకు కథ ముందుకు సాగిద్దాం పచ ముందుకు కథ పేరేమిటి సాలభంజిక ఉరఫ్ సిరఫ్ బొమ్మ ఏమిటే బొమ్మ? ఎక్కడిదానివమ్మా?

కథ: విక్రమార్కుని సింహాపీఠిక
విక్రమార్కుని సింహాపీఠిక
మెట్లనుండే సాలభంజిక
మాట్లాడే పాంచాలిక

ప్ర: బొమ్మ మాట్లాడుతుందా?

జ: అవును

ప్ర: ఎందుకు మాట్లాడుతుంది?
ఎలా మాట్లాడుతుంది?
మనిషి తప్ప మరే జంతువూ
మాట్లాడలేదే
మరి బొమ్మెలా మాట్లాడగలదు?

జ: ఇది మామూలు బొమ్మ కాదు
దేవతాత్మగల బొమ్మ

★ సాలభంజిక ★

దేవేంద్ర దత్తమైన
సింహాసనస్థిత సాలభంజిక.

ప్ర: ఇది విక్రమార్కుని సింహాసనమన్నారూ మొదట, ఇప్పుడు దేవేంద్రుడిదంటారా?

జ: దేవేంద్రుడు విక్రమార్కుని కిచ్చాడు.

ప్ర: ఎందు కిచ్చాడు?
చేబదులైనా సులభంగాఎవరూఇవ్వరే
సింహాసనం, సింహాసనమే ఇచ్చేశాడా
బారెడు దేశానికి రాజు ఒక
జానెడు వలసరాజ్యంపై అధికారం
ససేమిరా వదులుకోనంటున్నాడే
ఇప్పుడు
ఎవరేనా ఎందుకు సింహాసనం
అధికారం దానధర్మం చేస్తారు?

పచ. ఈకథ చూస్తే చాలా బాగుంటేటట్టుంది
పదవీ పరిత్యాగం పశ్చాత్తాపం
అహింసాయుత సమరం అన్నీ
ఈ కథలో ఉంటేటట్టున్నవి
అనగనగా మనుష్యుల దేశానికి
దేవేంద్రుడు వ్యాపారంకోసం
చుట్టమైవచ్చి దెయ్యమై పట్టుకొని
కలుకొన్నాడట పట్టం అప్పుడు
విక్రమార్కుడనే ప్రజాహితైషి
ప్రగతిశీల నాయకుడు మంచివాడు
ప్రజలకోసం కత్తి పట్టి మీదకత్తి
దేవేంద్రుని దునుమాడి ప్రజలకొరకు
సాధించాడీ దేవ - గాడీ

కథ. అబ్బే - అదికాదండీ కథ
అలా ఏం జరగలేదు.

పచ. జరక్కపోతే నేం
జరిగిందంటే పోలా?

కథ: పోతుంది - కథ రూపం మారి
పోతుంది - ధ్వంసధూళి అయి
పోతుంది.

పచ: అబ్బే అదేం కాదు-బాగుంటుంది.

కథ: మీరు చెప్పినట్టూ జరగలేదే దేవేంద్రుడితో విక్రమార్కుడు ప్రజలకోసం...

ప్ర: విక్రమార్కుడు ప్రజాకంటకుడా?

జ: కాదు-కాదు-కాదు కాదు ప్రజారంజకుడు.

ప్ర: మరైతే పచరించే ఆయన చెప్పేటట్టు మార్చెయ్యకూడదూ?

బొల్లి (తెల్ల మచ్చలు)

సమస్త చర్మవ్యాధులకు పురాతన చికిత్స
క్యాటలాగు, సలహా ఉచితం.

జి. వి. రెడ్డి & కో., (రిజిష్టర్డు)
"భాస్కరాశ్రమం"
గోపాలపురం, తూర్పుగోదావరిజిల్లా.

జ. సంస్కృతం కథ ఇది
మార్చడానికి మనతరంకాదు
అసలు విక్రమార్కుడికి ఇంద్రుడు
సిసలైన సింహాసనం
ఎందుకిచ్చాడో తెలుసుకొని
ఆ తరవాత మార్పులు
అవసరమేమో చూద్దాం
కథా. నీకథ చెప్పు.

పచ: అవును
నీకథ ఏమో వివరించు
ఈ లోకానికి నే వినిపింతు.

కథ: ఇంద్ర లోకంలో అమందానందకర సమయంలో అమరాధిపుడి ఆస్థానంలో.

పచ: ఉండుండు - ఒక నాలుగు వర్ణనలిక్కడ పారెయ్.

కథ: వర్ణించాలంటే కవిగారిని పిలవాలి.

పచ: పిలవండైతే.

ప్ర: కవిందుకూ మధ్యని?
కానివ్వండవి మీరే.

పచ: ఆహా-ఎవరు చెయ్యవలసినవి వాళ్లే
చెయ్యాలి
కసువు ఊడ్చేవాడు కసువే ఊడ్చాలి
పశువులు కాచేవాడు పశువులే
కాయాలి
కవే కాని డబ్బులకి కవిత్వం చెప్పాలి
పిలవండి కవిని విమానంలో రమ్మని
నిలవేసి అడగండి
వర్ణించమని.

బృందగానం:

కవిగారూ కవిగారూ
కవిగారూ రండి
కమ్మనీ ఘుమ్మనే
కవిత చెప్పండి
ఎవ్వరూ చూడని లోకాలనుండి
ఏమిటో తెలియని సౌఖ్యాన్ని పిండి
లోకమంతా మీరు ఏకముగ నిండి
కవిగారూ తొందరగ కదిలిరారండి
॥కవి॥

మీకడుపు కాల్చుకొనిమాదినింపండి
మీచితిని పేర్చుకొని మాది ఆర్పండి
మీప్రాణ మొదిలేసి మాది నిలపండి
కవిగారు తొందరగ కదిలి రారండి.

[విమానం శబ్దం.........
...విమానం ఆగింది.]

పచ: కవిగారూ దయచేయండి
చూడండి నాలుగు వర్ణనలు
కావాలండి—కానివ్వండి.

కవి: దేనిమీద

పచ: ఇంద్రసభమీద.

కవి: మా యింట్లో బియ్యం లేవు.

పచ: అబ్బ-ఆ లేకపోవటం ఎప్పుడూ ఉండేదేగా వర్ణన కానిండి. దేవేంద్రుడూ అప్సరసలూ.

కవి: మా ఆవిడకి జ్వరంగా ఉంది.

పచ. ఇక నేం కవిత్వం రాయడానికి
సరైన అదను అన్నట్టు
కవిగారూ మీకు ఏకోశానా
ప్రస్తుతం సంతోషం లేదుకదా?

కవి. లేదు.

పచ: అసంతృప్తి హమేషా ఉందా?

కవి: ఉంది.

పచ అయితే మంచిది
మాకథలో పసందైన
కవిత్వం మీరు చెప్పగలరు
కూర్చోండి.

ప్ర. ఆయనకి అసంతృప్తిగా ఉంటే
అసలు కవిత్వం ఎలా వచ్చేను.

పచ: అదే అందులో కిటుకు
కథా! ఎక్కడదాకా చెప్పావు.

కథ: ఇంద్రసభలో దేవేంద్రుడు

పచ: ఆగాగు - కవిగారూ
ఇంద్రసభ వర్ణించండి.

కవి: అప్పుడు యింద్రుడేం చేస్తున్నాడు
అది చెపితే వర్ణిస్తా.

కథ నాట్యం చూస్తున్నాడు.

కవి ఓహో అయితే
'మహోత్సవ మండపమునందు
పేరోలగంబుండి
కుండలీదండ లాసక ప్రేరణీ ప్రేంకణ
సింధు కందుకథమాళి చేల మత్తల్లీ
హల్లీసకాది నృత్యంబు లవలో
కించుచు.....'

పచ: ఆహా - ఆహా -

ప్ర. ఏమండీ కవిగారూ దీనికి అర్థం ఏమిటి?

పచ: అనవసరం ప్రశ్నలు వెయ్యకండి
అర్థం ఉన్నదా లేదా అని అడక్కండి
కవిచెప్పింది కమ్మగా ఉంటేచాలు.

ప్ర: అబ్బే - అది కాదు. పెద్దపెద్ద మాటలు వాడుతున్నారే...వాటికి......

కవి: కుండలి, దండలాసకం, ప్రేరణి మొదలైనవి నాట్య విశేషాలు.

ప్ర. ఇది మీరే రాశారా?

కవి: నేను కాదు శ్రీనాథుడు.

ప్ర: అలా చెప్పండి—ఈ నాట్య విశేషాలన్ని మీకు తెలుసా?

పచ: అయ్యా-మీరిలా అడగడం బాగా లేదు. కవిగారూ - కానియ్యండి.

కవి: చౌపదంబులు, నవపదంబులు, దుమపదంబులు అనేవి, చారికా కరణాంగహార రేచకముల భ్రమరికావళుల నర్తన గతులు.

కథ: ఏమండోయి-నా కథ ఆగిపోయింది.

కవిగారు అనవసరంగా ఏదో పాఠం చెప్తున్నారు.

పద కవిగారూ కొంచెం ఆగండి
కానీవమ్మా - కథా

కథ ఇంద్రుడు నాట్యం చూస్తున్నాడు
రంభా ఊర్వశీ నాట్యం చేస్తున్నారు.

కవి: ఏ విధంగా చేస్తున్నారయ్యా అంటే...

పద కవిగారూ ఆగండి—
కథని సాగనివ్వండి.

కవి: రంభోర్వశుల నాట్యం
వర్ణించడ మసాధ్యం
తందిరినా దిరినా ధింధింనా తక
తధిమి తకిట తకఝుణం తగణం
తద్దిక్కిట తకనందిక్కిట తక
ధింధింతత్తాది తత్తాది
గిణగణాంకణ -

పద ఆగండి కవిగారూ
ఆగండి
కానివ్వమ్మ కథా.

కథ. రంభోర్వశులు నాట్యంచేస్తే ఎవరు నాట్యంలో చతురులో నిర్ణయించ ఇంద్రుడి శక్యం కాలేదు. అప్పుడు నారదుడు వచ్చి

కవి. ఏవిధంగా వచ్చేడయ్యా అంటే...

పద: కృష్ణంభజ రాధా...అని పాడుతూ వచ్చేడనుకొందాం - ఊఁ కానీ కథ.

కవి: కాదండి - ఇక్కడో వర్ణన

పద వద్దు - ఊఁ - ఏమైంది తరవాత.

కథ నారదుడొచ్చి
ఇంద్రుడా, ఇంద్రుడా
ఇది నీ తరమా
ఎవరిపై మక్కువో
వారిదే ఎక్కువని
చెప్పినావని నిన్ను
దెప్పుతారని నువ్వు
తప్పించుకొన్నావు
అని అంటే
ఇంద్రుడు - అచ్చే
నాకు తెలియదని
ఊరుకొన్నా అన్నాడు.

అంటే అప్పుడు నారదుడు రంభోర్వశుల నాట్యాన్ని విమర్శింపగలిగేది విక్రమార్కుడొక్కడే అతడే నిర్ణయించగలడు అని పలికినాడు

ప్ర. విక్రమార్కుడొచ్చి నిర్ణయించాడా.

జ అవును గాబోలు.

కవి విక్రమార్కుడు రాగానే
కుడికన్ను ఎక్కువో
డాకన్ను ఎక్కువో
చెప్పవయ్యా నీవు
విక్రమార్కా.
ఉభయ సంధ్యల్లోన
ఉదయసంధ్యా రనో
మలిసంజె చక్కనో
చెప్పవయ్యా నీవు
విక్రమార్కా.
ఘారమూ కంటెంటూ
తీరిని వివరించి
ముఖ్యమేదో చెప్ప
విక్రమార్కా.

ప్ర: ఆగండి ఆగండి కవిగారూ ఆ కాలంలో ఇంగ్లీషు లేదే. ఇంద్రసభలో ఇంగ్లీషులో సంభాషణా?

కవి: ఇంద్రసభలో తెలుగులో మాట్లాడొచ్చా ఏమి? కవిత్వానికి అడ్డు రాకండి ఏం చెపుతున్నానూ ఆఁ

తొలిసంజ చక్కనో
మలిసంజ ఎక్కువో
చెప్పవయ్యా నీవు
విక్రమార్కా.

పద: అందులోనే హింసావాదం ఎక్కువో అహింసావాదం ఎక్కువో, నవ స్వామ్యంకన్నా ప్రజాస్వామ్యం మంచో కాదో మొదలైన ప్రశ్నలు కూడా కలపండి.

కవి: కలపకూడదు.

పద. ఎందుకు కలపకూడదూ?

కవి: అది ప్రచారం అవుతుంది.

పద: ప్రచారం అయితేనేం కలపండి- కవిత్వం అంటే ఏమిటి? సందేశం, ప్రబోధం, ప్రచారం వగైరాలు.

కవి: తల్లి పుట్టింటి సంగతి
మేనమామకి చెప్పేసి
అల్లుడా, పొమ్మని
ఆదరమ్మున చెప్పాలింక నేను.

పద: ఏం-ఉపదేశం లేని కవిత్వం
ఉప్పులేని ఉప్మాలాంటిది.

కవి ఇది న్యూనోపమానం
నీచోపమానం.
చంద్రుడు లేని రాత్రి అనండి
నీళ్లు లేని నది అనండి

పద వప్పుకొన్నారా.
ఉపదేశం ఉండాలికదా
మరి ప్రచారం చెయ్యండి.

కవి. తప్ప
ఆకులందున అణిగిమణిగి
కవిత కోయిల పలకవలెనోయ్
పలుకులను విని దేశమందభి
మానముల్ మొలకెత్తవలెనోయ్ ..
అదీ సూత్రం.

కథ కవిగారి కవిత్వంతో ఈయనగారి ఆటంకంతో నాకథ కాస్తా ఆగిపోయింది. ఇంద్రసభలో కొచ్చిన విక్రమార్కు డలాగ నిలబడే ఉండిపోయాడు.

కవి: ఇంద్రుడు వేస్తున్న ప్రశ్నలు వింటున్నాడు. ఆ ప్రశ్నలు ఏమిటయ్యా అంటే...

బృందగానం :
తొలిసంజె చక్కనో
మలి సంజె ఎక్కువో
చెప్పవయ్యా నీవు
విక్రమార్కా...
చెట్టుముందో లేక
విత్తుముందో నీవు
చెప్పవయ్యా వేగ
విక్రమార్కా...
దినరాజు ఎక్కువో
రేరాజు ముఖ్యమో
నాగర్థములలో
ఏ ఒకటి పూర్వమో
చెప్పవయ్యా వేగ
చెప్పవయ్యా వేగ
చెప్పవయ్యా నీవు
విక్రమార్కా...
తొలిసంజ చక్కనో
మలిసంజ ఎక్కువో
రంభ నర్తనమో
ఊర్వశీలాస్యమో
సారస్యమెంచుమా
సాహసాంకా
చెప్పవయ్యా నీవు
విక్రమార్కా...

కథ అమ్మయ్య అసలు ప్రశ్న అంకిగేసుకడి అప్పుడు విక్రమార్కుడు రంభోర్వశుల నృత్యము పరీక్షించి అతి సూక్ష్మంగా అందలి తారతమ్యాలు దేవతలకి వివరించి చెప్పి ఊర్వశే జాణవని తేల్చాడు. ఇంద్రుడు విక్రమార్కుని బుద్ధిసూక్ష్మతకు మెచ్చుకొని అనర్ఘరత్నఖచితమై అమూల్యమగు స్వర్ణ సింహాసనమును బహుమానం చేశాడు. ఆ అద్భుత సింహాసనాన్ని విక్రమార్కుడు తన నగరానికి తీసుకుపోయి శుభముహూర్తాన దానిని అధిష్ఠించి ప్రజాపాలన చేశాడు


పద ఈ కథలో నీతేం లేదే
దీన్ని ఎలాగ ప్రచారం చెయ్యడం
ఎన్నదగ్గ కథగా దీన్ని ఎలా
మున్ననపాలు చేయడం
రంభవేంపు వన్నెలవిసనక్ర
ఊర్వసి ఉత్తమా యిల్లాలు
వీరిద్దరి పోటీలో
పతివ్రతే గెలిచిందని
ప్రకటిద్దాం.

★ సాలభంజిక ★

[దండోరా చప్పుడు]
ఇందుమూలంగా సమస్తమైన
వారికీ తెలియచేయడ మేమనగా...
ప్ర: ఆగండి, ఆగండి
అట్టే—అట్టే
ఈ కథ పేరేమిటి?
పచ: సాలభజింక.
కథ: సాలభజింక కాదండీ
పచ: అవునౌను—కాదుకదూ.
మరేమిటన్నారూ
మరచిపోయాను.
క్థ: సాలభంజిక లేక
స్వర్ణపాంచాలిక.

"ఎంతో పరిమళము! ఎంతో
పుష్ప సువాసనవంటి తాజాదనము!

అని కుచల కుమారి చెప్పుచున్నది



లక్స్ టాయ్‌లెట్ సబ్బులోని నిలవుండే క్రొత్త పరిమళము నాకు యిష్టము."

సినీమా తారలు చేయుచున్నట్లు చేయండి—ప్రపంచమందలి మిక్కిలి సొగసైన వనితలు చేయుచున్నట్లు చేయండి. శుద్ధమైన తెల్లని లక్స్ టాయ్‌లెట్ సబ్బుయొక్క సమృద్ధయిన పరిమళమగు నురగ మీ చర్మమునకు యింకా నూతన కాంతిని, మనోల్లాసకరమైన క్రొత్త సౌందర్యమును గలిగించును.

మీకు సౌందర్యమునిచ్చు ప్రతిదినో స్నానానికి పెద్ద సైజు బిళ్లను వుపయోగించండి.



లక్స్
టాయ్‌లెట్ సబ్బు

సినీమా తారలకు సౌందర్యమునిచ్చు సబ్బు

భారతదేశంలో తయారుచేయబడినది

LTS. 457-X52 TL

ప్ర: ఇప్పటికి సింహాసనం కథే చెప్పారు గాని జింక కథా, ద్రౌపదికథా చెప్పలేదే. అసలేం చెప్పకుండానే చాటింపు వేసి—

కథ: జింక లేదంటూ ఉంటే

సాలభంజిక అంటే బొమ్మ

ప్ర. మరా బొమ్మకథేం చెప్పండే.

కథ: అదీ ఉంది.

విక్రమార్కుడి సింహాసనానికి వరుసగా ముప్పయిరెండు బంగారుబొమ్మ లుండేవి.

ప్ర: ఇప్పుడు లేవా? ఉండేవి అంటున్నారు.

కథ: లేవు అవి ఎగిరిపోయాయి.

ప్ర: ఎక్కడికి?

కథ: కైలాసానికి.

ప్ర అదేమిటి?

కథ. అదే కథ.

ప్ర: ఎందు కెగిరిపోయాయి

ఏమిటా కథ?

కవి. అది నేను వర్ణించి చెప్పనా?

కామనలు తగ కొరదుబారే

కైలాసగిరి శిఖరాగ్రమందున

కోరికలు కొంకరులు బారే

శంకరుని గిరి సానువందున

పచ: అనవసరం వర్ణనలు చేయకండి

అసలు కథలోకి రండి.

కథ: పార్వతీదేవికి ముప్ఫయి ఇద్దరు

చెలికత్తె లుండేవారు.

కవి: వాళ్ళ అందం ఎలా ఉండేదంటే.

పచ. అబ్బ - అడ్డం రాకండి కవిగారూ. మిమ్మల్ని పిలిపించడం తప్పయింది. ఊఁ - చెప్పు.

కథ: ఒకనాడు శివుడు హిమాలయాల మీద పార్వతితో విహరిస్తున్నాడట.

కవి: అల్లసాని పెద్దన్నగారికన్నా ఆ గిరి వర్ణన చేస్తా వింటారా.

పచ: కవిగారూ - మీ రూరుకొంటారా లేకపోతే పంపించేయమన్నారా? థర్డు క్లాసు టిక్కెట్టుకొని కవిగార్ని తగిలెయ్యండి.

కవి: ఈ కథ అయ్యేదాకా నే వెళ్ళను.

పచ: బుద్ధిగా నోరుమూసుకు కూర్చుంటే సరేసరి. చెప్పమ్మా నీ కథ.

కథ: విహరించుతున్న శంకరుడు ఒక చోట కూర్చున్న పార్వతి చెలికత్తెలని చూశాడు. వాళ్ళమీద ఆయనకి అనురక్తి కలిగింది. అది గ్రహించి పార్వతి వాళ్ళని శపించింది.

ప్ర: మధ్యని వాళ్ళనా? వాళ్ళేం తప్పు చేశారు.

పచ: బాగుంది ఈ కథ చాలా ప్రయోజనకారిగా ఉంది. దాసీవాళ్ల సమస్యని ఇది పరిష్కరించుతుంది. ఆధునిక సంప్రదాయాన్ని తీసుకొందాం అయ్యగారూ అమ్మగారూ అందులో ఉంటారు. ఆ యింట్లో పనిమనిషి అందాల భరిణ. దాన్ని చూసి అయ్యగారు మక్కువపడతాడు. అది మట్టుకూ పతివ్రత అయితేనేం అమ్మగారు దాన్ని పన్లోంచి వెళ్ళగొడతారు పాపం దానిది. తిండిలేక ఎండకు ఎండి ఆకలికి మండి అలో లక్ష్మణా అంటూ అష్టకష్టాలూ పడుతుంది. ఆహా అమూల్యమైన నీతి కథ. అయ్యగారి మోహానికి అతి పేదపిల్ల బలి. దీన్ని ప్రజలకు నచ్చేటట్టు చెప్పడానికి ఇక శివుడూ పార్వతీ ఆమె చెలికత్తెలూ పనికొస్తారు పార్వతిని గయ్యాళి గంపలాగ చిత్రిద్దాం. పనివాళ్ళని రాసి రంపాన పెడుతుంది. ఒక్క నిముషం విశ్రాంతి ఇవ్వక పనివాళ్ళచేత ఇల్లు ఊడ్పిస్తుంది. బట్ట లుతికిస్తుంది. అంట్లు తోమిస్తుంది.

ప్ర: శివుడికి బట్ట లున్నాయా? పులితోలేగా.

పచ: అయితే మరీ మంచిది. పులితోలు ఉతకడం ఎంత కష్టం. ఎంతి కష్టం.

ప్ర: పార్వతీదేవిని పరమ గయ్యాళిగా చిత్రిస్తే ప్రజలు సహిస్తారా?

పచ: ప్రజలు స్వీకరించేటట్టు కథని సమర్పించే పూచీ నాది. పాపం పనివాళ్ళ కష్టాలు.

ప్ర: ఇంతకీ శాపం పొందిన చెలికత్తెలు ఏమయ్యారు. అసలు ఏమని శపించింది.

కథ: వాళ్ళని బంగారుబొమ్మలై ఇంద్రుని సింహాసనం మెట్లమీద పడిఉండమని శపించింది. వాళ్లు శాపాంతం వేడగా పార్వతి కరుణించి విక్రమార్కుని ఔదార్యాన్ని భోజుని ఎదుట వాళ్లు ఎప్పుడు కీర్తిస్తారో అప్పుడు శాపవిముక్తి అంది. వాళ్లు భోజుడికి కథలు చెప్పారు. ఆ చెప్పిన కథలే నేను.

ప్ర: చాలా ఉందే పేదరాశి పెద్దమ్మ- పెద్దమ్మకొడుకా కొడుకు చేతి గొడ్డలి అన్నట్టు విక్రమార్కుడి సింహాసనం—ఆ సింహాసనానికి బొమ్మలూ ఆ బొమ్మలు చెప్పిన కథా ఇంతో టుందా?

కథ: ఉంది.

ఒకనాడు భోజుడు...

కవి: "రాజన్. కనకధారాభిః త్వయి

సర్వత్రవర్షతి

అభాగ్యచ్ఛత్రసంపన్నే మయి

నాయాంతి బిందవః"

ప్ర: అదేమిటండీ - కవిగారూ శ్లోకాలు చదువుతూ శోకాలు తీస్తున్నారు

కవి: భోజరాజు ముఖం చూస్తే కవిత్వం వచ్చేదట. అతని పేరు వినగానే శ్లోకం జ్ఞాపకం వచ్చింది.

ప్ర: ఏమిటా శ్లోకానికి అర్థం.

కవి: ఓ రాజా, నీవు దేశమంతటా బంగారు వాన కురిపిస్తున్నా దౌర్భాగ్యమనే గొడుగును పట్టుకొన్న నామీద ఒక్క చుక్కకూడా పడలేదు...అన్నాడు ఒకడు భోజరాజుతో.

పచ: అవును. ధనస్వామ్య విధానంలో ధనవంతులు మరీ ధనవంతులవుతారు, నిరుపేదలు ఇంకా నిరుపేద లవుతారు అన్న సూక్తికి ఇది చక్కని ఉదాహరణ. కవిగారూ ఇప్పటికి పనికొచ్చే ముక్కొక్కటి చెప్పారు.

ప్ర: ఏం లాభం - పనికొచ్చేది సంస్కృతంలో బోధపడకుండా రాసిపెట్టారు.

కవి: పనికొచ్చేవన్నీ మనవాళ్లు సంస్కృతంలోనే తగలెట్టారు. అందుకే ఆ భారం మన కుర్రాళ్ళ పనిమెడలకి కట్టిపెట్టాలంటున్నారు కొందరు.

పచ: హియర్ - హియర్ - కవిగారూ, చూశారా - మీరూ రాజకీయాల్లో అడుగెడుతున్నారు రండి

ప్ర: ఇంతకీ సాలభంజిక కథ ఏమిటయింది?

కథ: నే నిక్కడే ఉన్నా. చెప్పమంటారా నా కథ.

పచ: కానీ.

కథ: విక్రమార్కుడు చనిపోయాక - అతడి మంత్రులతో అశరీరవాణి అన్నాదిల్లా: విక్రమార్కుని తరవాత ఈ సింహాసనాన్ని అధిష్ఠించదగలాడు లేడు.

అంచేత అంచేత అంచేత మీరు

అతిలోతుగా తవ్వి

సుక్షేత్రమందు

పాతి వేయుడు మీరు

భద్రముగ మీరు...

అని ఆకాశవాణి అంటే అలాగే చేశారు మంత్రులు. ఒకనాడు భోజరాజు....

కవి: ...భోజనం దేహి రాజేన్ద్ర

ఘృతసూప సమన్వితం

మాహిషంచ శరచ్చంద్ర

చంద్రికా ధవళందధి

పచ: భోజరాజు పేరెత్తేసరికల్లా శ్లోకం చదువుతారేం కవిగారూ ఇలాఅయితే ఈ కథ సాగదు.

ప్ర. ఈ శ్లోకానికి అర్థం ఏమిటి?

కవి: ఓ రాజా, నెయ్యి పప్పూ ఉన్న భోజనం శరత్కాలపు వెన్నెలలాంటి తెల్లని గేద పెరుగుతో...

ప్ర: ఆగండి-ఆగండి ఏం పెరుగుతో

కవి: తెల్లని గేద పెరుగుతో...


ప్ర: తెల్లకాకిలాగ తెల్లని గేద ఎక్కడుంటుందండీ.

కవి: గేదయొక్క తెల్లని పెరుగుతో అని అర్థం

పచ: ఏమిటి భోజరాజు పాలనలో తిండికి కూడా గతి లేదన్నమాట. ఎంత

(54-వ పేజీ చూడండి)





"ఆదెమ్మపిన్ని కాశీ వెడుతుందట" అన్నాడు జానకి రామయ్య, పెరుగన్నంలో క్రొత్తావకాయముక్క కొరుక్కుంటూ భార్య రాఘవమ్మతో.

'ఎప్పుడట' అంటూ ప్రశ్నార్థకం మూపు పెట్టిన రాఘవమ్మ తలలో ఆ క్షణాన ఒక మబ్బులేని మెరుపు మెరిసింది. కళ్ళజోడులోని ఆ చిన్నికళ్ళల్లో పాల చెంబులు తొణికినట్టు చిర్నవ్వులు చిందాయి. ముఖం పూచిన చెంగలువ కోనేరులా కలకలలాడింది. భార్యాముఖంలో చంద్రోదయం చూచి ముగ్ధుడైన జానకిరామయ్య 'ఏమిటో విశేషం?' అన్నాడు కుతూహలంతో. 'ఏముంది; ఎందుకైనా పెట్టి పుట్టాలి. తక్కువనోములు నోచి ఎక్కువ ఫలాలు రమ్మంటే ఎలా వస్తాయ్' - మనకిళ్లే వైకుంఠం కడుపే కైలాసం!' అంది మనస్సును మాటల్లోకి తర్జుమా చేసినట్లు.

బొడ్డు బాపిరాజు

అందుకే అంటారు 'ఆడది అబద్ధమాడితే గోడపెట్టినట్టుంటుం'దని. 'తీర్థయాత్రలు తీరనికోరికలై తన భార్యామణిలో కూడా తియ్యనికలలు కల్పిస్తున్నాయ్ కాబోలు' అనుకున్నాడు జానకిరామయ్య

రాఘవమ్మ ఆపూటనించే తన గాలి మేడకు పునాది ప్రారంభించింది. చేపకోసం గాలం విసిరింది: ఎక్కువమందిది 'ఎప్పటికయ్యేది ప్రస్తుతం' తత్వమే. రాఘవమ్మ స్వభావం అందుకు శుద్ధవ్యతిరేకం. ఆర్నెల్లకొక్కవలసినదానికి ముందుకు ముందుగానే పంచవర్ష ప్రణాళిక తయారుచేస్తుంది - దూరాలోచన అనండి దురాలోచన అనండి.

పిల్లాపిచ్చుకా లేకపోవడంవల్ల ఎప్పుడూ కురులు చెదరకుండా కుచ్చెళ్ళు నలగకుండా కంటికి నదరుగా కడిగిన ముత్యంలా వుంటుంది. మనస్సులో ఎన్ని పద్మవ్యూహాలున్నా మాటలుమాత్రం అరటిపండువొలిచి



తేనెలో ముంచి పంచదారచల్లి అరచేతిలో పెట్టినట్టుంటాయ్. అవిమాచే 'అసాధ్యురాలు; తలలు మార్చేరకం' అంటారు కొందరు మాటకత్తెలు. యాచకో యాచకశ్శత్రుః. ఆవిడ స్నేహితురాళ్లు మాత్రం దీన్ని పట్టించుకోరు. కూర్చున్నంతసేపూ కులాసాగా కాలక్షేపం చేయడమే వాళ్ళ పరమావధి. అందుకు తగినట్టుగానే వుంటుంది రాఘవమ్మకూడా. నిజానికి కుటుంబ ఖర్చులో రాఘవమ్మకు చాలా పొదుపు. ఒక్క అరటికాయతో మధ్యాహ్నం కూరా రాత్రికి వేపుడూ చేస్తుంది. ఆ పెనిమిటి కూడా వున్నదీ లేదనకుండా పొడీ పచ్చడితోనే సర్దుకుపోయేవాడు. ఇంట్లో వుంటూవున్న చెల్లెలి కొడుకూ ఆ గంతకు తగిన బొంతే. ఎంత పొదుపరైనా రాఘవమ్మ నలుగురు స్నేహితులు కలుసుకున్నప్పుడు ఏ దిబ్బరొట్టో వుప్పుడుపిండో చేసి పెట్టకుండా మానేది కాదు. అందుకనే డబ్బూ దస్కాని కట్లావున్నా డాబూ దర్పంలో జయించుకొస్తూ వుంది రాఘవమ్మ.

రాఘవమ్మ ఎంత క్రొత్తవాళ్ళతోనైనా మూడు మాటల్లో స్నేహం కలిపేది. ఎవ్వడు కనిపించినా ఆపేక్షగా పలుకరించేది. కష్టం వచ్చినా సుఖం వచ్చినా కాడి భుజాన వేసుకొనే దాపులనుకున్న వాళ్ళ యిళ్ళల్లో. 'ఇవ్వన్నీ ప్రాపకం సంపాదించుకోవడానికి పడే పాట్లులే!' అంటుంది లోకం. పోనిద్దురూ; వెధవలోకం దీనికి శుద్ధీబుద్ధీ లేదు.

మాన్యాలుకు కుంటుర్లు తెల్పు తిరగడంతో పెద్దరికం తెచ్చుకుని ఎదుటివార్ని 'అమ్మాయ్!' అనో 'కోడలమ్మా!' అనో అంటూ వాళ్లచేత 'ఏమండీ పిన్నిగారూ' అనీ 'ఎందుకండీ అత్తయ్యగారూ' అనీ పిలిపించుకోవడం ఆవిడకొక సరదా. తను చదువుకోకపోయినా తండ్రీతో పుట్టినవాళ్లు లాయర్లవడంనుంచి 'మాది ప్లీడరు కుటుంబం' అని చెప్పుకుంటుంది గొప్పకు. ఆ మాటకొస్తే ఎవరి పుట్టింటి గొప్ప లెవరు చెప్పుకోరు? రాఘవమ్మది శ్రుతపాండిత్యమైనా మాటల మధ్య టంకప్పాదుల్లాంటి వేదాంతపు పోపులు పెడుతూ 'ఘటికురాలే' అనిపించుకుంటుంది తేలిగ్గా.

ఒకప్పుడు రాఘవమ్మకు రామకోటి సన్నాహాలన్నా సప్తాహాలన్నా పురాణ కాలక్షేపాలన్నా నోములన్నా వ్రతాలన్నా దేవతలూ దెయ్యాలన్నా మాంచి శ్రద్ధాభక్తు లుండేవి. ఏ పూజలూ ఏ దేవుళ్లూ అనుగ్రహించి వేలెడంత నలుసు నిచ్చిన పాపాన పోలేదు. ఇప్పుడు దేవుళ్ళను నమ్మినా నమ్మకపోయినా నమ్మినట్టు నాటకమాడడంలో లోటుచెయ్యదు.

ఇంత టీకా టిప్పణం చేసినా రాఘవమ్మ మాత్రం అన్వయం కుదరని పద్యం మట్టుకవును.

* * *

రాఘవమ్మ వెళ్లేటప్పటికి ఆదెమ్మ పిన్నిగారింట్లో మహిళామండలివారి అత్యవసర మధ్యాహ్న సమావేశం జరుగుతూ వుంది. ఆదెమ్మ పిన్ని (అందరూ ఆడా మగా అల్లాగే పిలుస్తారు. ఆ సంగతి చెప్పాలంటే అదొక ఉపాఖ్యానం) కాశీ ప్రయాణం చర్చిస్తున్నారు. కైలాసంలో సీటు దొరకడానికి కాశీలో చావాలని కాపురం వుంటున్న చుట్టాల సంగతి చెప్పారు కొందరు. 'కవుడీబాయిని చూడకుండా వస్తే కాశీయాత్ర ఫలితం కాస్తా తీసుకుంటుందట' అన్నారు కొందరు టప్రత్యయంవాళ్లు. 'మంచి మంచి జరీబుటా చీర్లు దొరుకుతాయి' అందో కావిడె.

★ అదెమ్మ పిన్నిగేదె ★

వాళ్ళమ్మాయి ఆడబిడ్డ భర్తది బట్టలకొట్టవడంవల్ల వచ్చిన విజ్ఞానంతో. ఏకగ్రీవంగా మాత్రం 'ఎంత పుణ్యాత్మురాలు కాకపోతే అదెమ్మపిన్ని కిటువంటి అదృష్టం పడుతుం'దన్నారు.

కథ కద్దు వచ్చినా అదెమ్మ పిన్ని జీవిత చరిత్రలో హైలైట్స్ తెలుసుకోవడం అవసరం కాదనుకుంటా.

అదెమ్మపిన్ని ఓ శుభముహూర్తాన క్రొత్తకోడలుగా కాలు పెట్టిందీ పల్లెటూర్లో. అటు పుట్టింటివారూ ఇటు అత్తింటివారూ ఐశ్వర్యవంతులైనా ఆవిడ కళ్లున్నచోటనే వున్నాయ్. భూదేవిలా శాంతమూర్తి. ఆ ముఖానికి చెదరని చిరునవ్వులే అలంకారాలుగా అందర్నీ ఆకర్షించేది. ముత్యాల్లాంటి బిడ్డల్ని ముగ్గుర్ని కన్నది. ఒక కూతురూ ఇద్దరు కొడుకులూను. కోరిన కట్నాలిచ్చి ఆడపిల్ల పెళ్ళి అట్టహాసంగా చేసి అమ్మాయి నత్తవారింటికి పంపించింది. మగపిల్లల్ని చదువులకు బస్తీకి పంపక తప్పలేదు. మొదట్లో పిల్లలక్కడా మనం ఇక్కడా ఎందుకనుకున్నా పట్నం ఇరుకురోడ్లూ మురికిగాలీ పంపునీరూ కంపు పెయ్యాల్సి పుట్టుకతో రైతుబిడ్డైన అదెమ్మ పిన్ని పెనిమిటికి గాని ఆవిడకు గాని సరిపడలేదు. 'పొలంపుట్రా వాళ్లకూ వాళ్లకూ అప్పగించి ఈఅవస్థలెందు'కని పిల్లల్నక్కడ చుట్టాలింట్లో దిగబెట్టి భార్యాభర్తలింటికి తిరిగి వచ్చేశారు.

ఒకొక్కళ్లకన్నీ అనుకున్నవి అనుకున్నట్టు జరుగుతాయి. అది వాళ్ల నక్షత్రబలం. కొడుకులిద్దర్లో ఒకతను అడ్వొకేటై హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించాడు. రెండో అతను డాక్టరు పట్టా పుచ్చుకుని డిస్పెన్సరీ తెరిచాడు. ఇద్దరికిద్దరూ పేరూ డబ్బూ రెండు చేతుల్తో సంపాదిస్తున్నారు.

తండ్రి పోకముందే ఇద్దరికీ పెద్ద సంబంధాలు వచ్చాయి; పెళ్ళిళ్లయాయి. భర్త పోయిన క్రొత్తలో 'నువ్వొక్కదానవ ఈమారుమూల దేనికి, అందరం కలిసి అక్కడే వుందాం రారాదుటమ్మా!' అని కోడళ్లూ కొడుకులూ బ్రతిమాలారు కాని చిన్నప్పట్నించీ ఆ నీరూ గాలి కలవాటుపడ్డ ఆవిడ ప్రాణం ఆ వూరు విడిచి వెళ్లడాని కంగీకరించలేదు. దివాణంలాంటి లోగిలీ, పచ్చలు పండే పాదుల్తో పలకరించే పెరడూ, చెయ్యిమునుగా కమ్మని పాడీ పంటా, చిన్నప్పటి నేస్తాలూ అన్నిటి కన్నా ఆవూరి దేవుడు చెన్నమల్లేశ్వరస్వామీ అదెమ్మ పిన్నిని కదల్నియ్యలేదు.

మొదట్నించీ చెయ్యి ముడుపు లేకపోవడంవల్ల చేబదుళ్లకూ చేటబదుళ్లకూ ఇన్ని పాలకూ అన్ని మజ్జిగనీళ్ళకూ కూరకనీ నారకనీ ఎవరెప్పుడు వచ్చినా 'లే'దనేది కాదు. అందుకని అదెమ్మ పిన్నంటే అందరికీ అభిమానమే.

'ఏం పిన్నీ! కాశీవెడుతున్నావట - పుణ్యాత్మురాలవు. ఇందాకాయన చెప్పారు. అయితే ఎప్పుడు?' అన్నది రాఘవమ్మ గుమ్మంలో అడుగుపెడుతూనే.

'రా' రాఘవమ్మా! అప్పుడే ఎక్కడ? ఇంకా నెల పైమాట. మా చిన్నబ్బాయీ కోడలూ వెడుతున్నారు. నన్నూ రమ్మంటున్నారు. వెళ్ళాలి, అనుకోవాలి - నువ్వెక్కడ్నించీ? ఏదో బుట్టపట్టుకొస్తున్నావ్.' అంది అదెమ్మపిన్ని.

'ఇదా? ఏంలేదు, పెసరపొట్టుంటే మా గేదెకు కుడితిలో పోసి పోదామని తెచ్చా' అన్నది రాఘవమ్మ. 'నీకు మొదట్నించీ గొడ్డన్నా బిడ్డన్నా తగని అపేక్ష లేవే అమ్మా' అంటూ ఒక సర్టిఫికెట్టిస్తూ 'గేదంటే గుర్తొచ్చింది చూడు రాఘవమ్మా, నేను తిరిగి రావడానికి మూడ్నెలలో పడుతుంది. ఈపాడిగేదె నేం చెయ్యాలా అంటాకా అన్నది మనసైపోయింది. పెద్దబ్బాయికి తోలి పెడదామంటే వాళ్ళ యాతనవడ లేదు.-' అర్థోక్తిలోనే అందుకుంది రాఘవమ్మ. ఆడబోయిన తీర్థం ఎదురైంది. వెదుకబోయిన తీగ కాళ్లకు చుట్టుకుంది. 'అదేమిటి పిన్నీ, ఇటువంటివన్నీ పెట్టుకున్నప్పుడే ఎప్పుడూ ఏదో ఒకటి వుండనే వుంటుంది. 'ఋణానుబంధ రూపేణా పశుపత్ని సుతాలయా' అంటారు వేదాంతులు. నువ్వు గేదె సంగతి మాకు వొదిలెయ్. పాడుకున్నందుకు మాత్రం సాయం చెయ్యలేమా' అన్నది.

ప్రక్కింటి భాగ్యంకూడా యాదాలాపంగా 'అవునండీ పిన్నిగారూ,' అని రాఘవమ్మ ప్రపోజల్ని సెకండ్ చేసింది. 'ఫరవాలేదు పిన్నీ ఎవరమో ఒకళ్ళం చూస్తాం, గేదకోసం కాశీ మానుకుంటావటే' అన్నారు కొంచెం వినకొమ్మందైనా చివరకందరూ. 'అవునులే, అంతవరకొస్తే ఏ నీకో మీకో అప్పగించకల్లానూ తప్పదు' అన్నదాదెమ్మపిన్ని. ఆ తరువాత ప్రసంగం గేదమీదనుంచీ మలుపు తిరిగింది.

* * *

రాఘవమ్మకు అదెమ్మగారి గేదెమీద అభిమానం శుక్లపక్ష చంద్రకళలాగా, మార్వాడి వడ్డీలా దినదిన ప్రవర్ధమానమవుతూ వుంది. చిట్టూ పొట్టూ కుడుగూ కరడూ ప్రతిరోజూ ఏదో ఇంత తెచ్చి పెడుతూ గేదను మచ్చిక చేసుకుంటూ వుంది. అదెమ్మపిన్ని కూడా మౌనముద్రలో అర్థాంగీకారాన్ని ప్రదర్శించేది. ఆ ఆదరాతో రాఘవమ్మ అడిగినవాళ్లతో అడగనివాళ్లతో అదెమ్మపిన్ని గేద భారం తన భుజస్కంధాల మీదికి తీసుకుని ఆమెగార్ని యాత్రలకు వెళ్లడానికి ఒప్పించడం ఎంత గగనమైపోయిందో శబ్దాలంకారాలూ అర్థాలంకారాలూ తగిలించి అదో ఉపకారమన్నట్టు చెప్పుకుపోయేది.

ఆ ఉప్పాకారం (ఉపకారం) ఉలుదారం (ఉదారం) ఎవరెరుగంది! పిల్లి కళ్లు మూసుకుంటే లోకం కళ్లు మూతలు పడతాయా?

కోనేటి మెట్లమీదా కోవెల మంటపం మీదా నాలుగు చీరచెంగులు రెపరెపలాడిన చోటునల్లా అదెమ్మపిన్ని యాత్రసంగతి కన్నా గేద సంగతి పతాకశీర్షికలోని ప్రధానవార్తయిపోతూవుంది. సనాతనత్వంలో



నుంచి భావుకత్వం, అందులోనించి అతి వాస్తవికత్వం, ఆఖరి కభ్యుదయత్వంలోకి మారిన కావ్యవస్తువులాగా గేదె దాని కథా కమామీషు ఊరుకున్న వాళ్లనుకూడా ఊరిస్తూ వుంది. పైకనకపోయినా పాడివున్న వాళ్లూ లేనివాళ్లూ 'మనకొస్తే బాగుండు' నని గేద కోసం గుక్కిళ్లు మ్రింగినవాళ్లే. అలా వాదులుకొందరు లేనిచనువుతీసుకుని ఆదెమ్మ పిన్ని వద్దకువెళ్ళి అడిగారు కూడాను 'గేదను మేపుకుంటా'మని, ఆవిడ గార్ని ఉద్ధరించేందుకన్నట్టు. ఆమెమాత్రం నిశ్చలంగా 'దాని ఇబ్బందేముందిలే. ఇరుగూ పొరుగు మున్నవారి కెవరికప్పగిస్తే కాదంటారు ఈ స్వల్పానికి మీకూడా శ్రమెందుకులెద్దురూ' అనేది తాపీగా.

ఇది ఆనోటా ఆనోటా నడిచి వచ్చింది రాఘవమ్మ చెవిదాకా. దానికి పట్టించుకోవటు 'ఎవరిదగ్గరయితే నేమిలే - 'పోలీ! పోలీ! నీ భోగమెన్నాళ్లంటే మా అత్తమాలపల్లి వెళ్ళివచ్చేదాకా' అన్నట్టు - ఏముంది మూన్నాళ్లముచ్చటే' కంటూ ఒక వేదాంతపుచిట్కా వేసేది. ప్రయత్నంలో ముసుపటికన్నా ముందడుగు వేస్తూ కోట నాలుగు వేపులా ముట్టడి సాగించాలనుకుంది ఎసైడ్‌గా.

రాఘవమ్మకు రోజులు గడిచినకొద్దీ కలలెక్కువవుతున్నాయి. దొడ్డిలో ఒకమూల ఖాళీ చేయించింది. పుడకో పిడకో తడిసిపోతున్నాయంటూ భర్తతో పోరి పాక వేయించింది. ఊళ్లోకి ఇత్తడి వర్తకుడు వస్తే మూడుసేర్లపట్టే కంచెంబు కొంది. పాడి గుంజకు పాలకర్ర పురమాయించింది. కవ్వంకొని అట్టిపెట్టింది. పెళ్ళికూతురు తిరువాయిగా పెళ్ళిసన్నాహాలన్నీ సిద్ధం చేసింది. అప్పటి కావిడ మనస్సు కొంచెం కుదుటపడింది. ఇన్నీ చేస్తూ ఈ మహాక్రతంకూడా పైకి పొక్కనియ్యలేదు. భర్తకు తెలియనియ్యలేదంటే ఆవిడ వాకచక్యం మెచ్చుకోవాలా వద్దా?

ఆవిడ అంచనా ప్రకారం - మనలో మనమాట అది డొక ప్లాను వేసుకుందంటే అందుకు వ్యతిరేకాలకు విలువలు కట్టకుండా అనుకూలాలకు ఆశలు జోడిస్తూ అడుగు ముందుకు వేస్తుంది - 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' అన్న గీతా వాక్యాని కుదాహరణంగా. కాని గురికి బాణం తగిలేవరకసరి, తప్పితే గుండె విలవిలలాడిపోతుంది. అప్పుడే వేదాంతమైనా ప్రాణాంతికమేను.


రాఘవమ్మ పథకం ప్రకారం ఆదెమ్మ పిన్ని పొలంలోనుంచి పచ్చగడ్డి రానే వస్తుంది. చిట్టూ పొట్టు కంత వెతుక్కోనక్కరలేదు, తమ యిస్తోకు పాడికి అన్నీ పాలనవసరం. ఇంటి వాడుకకుపోగా మిగిల్నవి వాడుకలు పెట్టుకోవచ్చు - ఇది చిదంబర రహస్యం - ఇక పోతే ఎటులేదన్నా ఈ మూడ్నాలుగు నెలల అమ్మకంతో చేతికొక గాజుల జత చేయించుకోవచ్చు. గాజులకేం కావలస్తే గేదనే కొనుక్కోవచ్చు. ఇల్లా రాఘవమ్మ ఆశయాల జలాశయాలు నురగలై పరుగులై ఉప్పొంగి కట్టలు తెంచుకుని ప్రవహిస్తున్నాయి.

ఆదెమ్మ పిన్ని ప్రయాణం వారాల్లోదల్లా రోజుల్లోకి దిగింది. రాఘవమ్మ ఇంచుమించు రోజల్లా ఆదెమ్మ పిన్నితోనే గడిపినట్టు గడిపేది. యాత్రకొక్కవలసిన అప్పడాలు చెయ్యడం వడియాలు పెట్టడం పొడాలుకొట్టి పోటు వేయడం వెన్నపూస కాయడం చాకలివాడు తెచ్చిన బట్టలు సర్దిపెట్టడం అన్నీ పన్లూ రాఘవమ్మే చూచిపెట్టేది. ఆదెమ్మ పిన్నికూడా చీటికిమాటికి 'అమ్మాయ్' అంటూ ఏదో అడుగుతూనే వుండేది. రాఘవమ్మ యాత్రకు వెడుతూ వున్నట్టుండేది కాని ఆదెమ్మపిన్ని యాత్రలాగా లేదు. చూడ్డానికి వచ్చినవాళ్లతో 'మా రాఘవమ్మదే ఈ ప్రోద్బలమంతా' అంటూ వుండేది. అందరికీ తెలుసు రాఘవమ్మ అభిలాష గేదమీదో ఆదెమ్మ పిన్ని మీదో. తెలిసినా ఎవరిక్కావాలి, ఎవరంటారు? ఇంత హడావిడి చేస్తున్న రాఘవమ్మ సంకల్పం బెడిసికొడితే చూడాలని చాలమందికుంది. అది ఎవరికి వారికే స్వగతం. జనాంతికంగా మాత్రం రకరకాల చెప్పుకుని నవ్వుకునేవారు. ఇటువంటి రంభా మేనక నృత్యాలు రాఘవమ్మ తపస్సు చెదరగొట్టలేకపొయ్యాయి.

ఇంతలో ఒకరోజు తన్ను చూచి వెడదామని వచ్చిన తోడి కోడల్తో ఆదెమ్మపిన్ని తన గేదమాట తెచ్చి ఇరుగు పొరుగుల్లున్న భాగ్యం రాఘవమ్మల్లో ఎవరికి తోలిపెడితే శ్రద్ధగా చూస్తారని సలహా అడిగినట్టడిగింది. ఆవిడ నిష్కర్షగా 'అబ్బే! రాఘవమ్మ వట్టి మాటదబరామనిషి. అయినాలింగూ లిటుకూ మని మొగుడూ పెళ్లానికింత పాడెందుకు? సుబ్బాడు గడ్డిపరకలు కోయించి వెయ్యడానికి చేరెడు పొలం లేదు. భాగ్యం నిరుకూ నిదానం గలది. నలుగురు పిల్లా జెల్లాగల కుటుంబం. దానికి తోలిపెడితే జాగ్రత్తగా చూసుకొంటుం'దని అనవలసినమాట కాస్తా అని 'ఏమమ్మాయ్ నేనిల్లా అన్నానని అనేవ్, ఆ రాఘవమ్మ అసలే నోటి దుడుకుది. పెడితే పెళ్లి. పెట్టకపోతే శ్రాద్ధం' అంటూ హెచ్చరిక చెప్పుకుని వెళ్ళిపోయింది.

తమాషా ఏమిటంటే ఇంతా హెచ్చరించి వెళ్లిన ఆ తోడికోడలు గాంధారి చెప్పిచెప్పనట్టు ఎవరికి వారికే ఒట్టు పెట్టించుకుని ఉప్పందించింది—'ఆదెమ్మ పిన్ని గేదెను భాగ్యానికి తోలిపెడుతుం'దని.

రాఘవమ్మకూడా అంచెలమీద అంది




★ ఆదెమ్మ పిన్ని గేదె ★

దీనార్. బలరాముడు దుర్యోధన చక్రవర్తికి ఖాయంచేసిన సుభద్రను కాస్తా పడీ వప్పుడు కాకుండా అర్జును డెంకించుకుని పోయినట్టు తన స్వప్నసుందరిని తన భాగ్య లక్ష్మిని తన కామధేనువును తన గేదను వి ధాగ్యమో అమాంతం తన్నుకుపోతుంటేమో అన్న భీకరభయం గుండె గడియారం పెండ్యులా న్నాపివేసినా అక్కడుంటే మాయలమారి కృష్ణుడుండి అంతపని చేయిం చాడు కాని, ఇక్కడ దేవుళ్ళున్నా రను కుంది అయినా ఇటువంటి అనధికార ప్రక టనల కంత ప్రాముఖ్యం ఇవ్వడం ఆరోగ్యం కాదనుకుంది రాఘవమ్మ. ఊరుకోడం తథా స్తనుకోవడం తన వంతే.

ఈ కబురు వినగానే రాఘవమ్మ ఆదెమ్మ పిన్నిని కలుసుకుంది. ఆవిడ ముఖంలో ఏ మార్పూ లేదు. 'ఫేస్ యీజ్ ది ఇండెక్స్ మైండ్' అన్న ఇంగ్లీషు సామెత రాఘవమ్మ కేలా తెలుసునంటారా? మరిచిపోయారు; ఆవిడది ప్లీడరు కుటుంబమని. రాఘవమ్మ అంతతో విడిచి పెట్టలేదు. ఆదెమ్మ పిన్ని మనస్సు ప్రోగించి చూడాలని 'పిన్నీ! ఇన్నాళ్లూ నీ కల పాటుపడ్డ గేదె క్రొత్తవాళ్లని మమ్మల్ని పాలు తియ్యనిస్తుందా?' అని అంటే 'ఎక్కడో పోట్లగొడ్డయితే తప్ప అటువంటిదేమీ వుండదు. నువ్వు చూస్తున్నావుగా, కొమ్ము విసరడమే చేతకాదు. దాన్ని మచ్చిక చేసుకోవడమెంత మాట? మడియలు చాలు' అంది ఆదెమ్మ పిన్ని. రాఘవమ్మ మనస్సులో పటిన మబ్బులు విడిపోతూవుంటే మరోక మెట్టు పైకెక్కి 'పాలేరుతో చెప్పి పచ్చగడ్డిమోపు కోటా తెచ్చివెయ్యమని నువ్వు చెప్పాలి పిన్నీ' అన్నది. 'అదికూడా నువ్వు చెప్పాలేమ్మా! ఎక్కడున్నా నామనస్సు దీని మీదే వుంటుం'దన్నది. అంతటితో ఆదెమ్మ పిన్నిలో ఏ మాటా ప్రత్యేకంగా వినిపించక తప్పేం పారబడలేదని తృప్తిపడి నిట్టూర్పు

తెలుగు ఆంగ్లభాషా బోధిని



తెలుగు చదువతెలిసినవారెల్లరు ఈ పుస్తకంతో ఇతరుల సహాయం లేకనే ఇంగ్లీషుభాష సులభంగా చదువను, వ్రాయను, మాట్లాడను, ఉత్తరప్రత్యుత్తరాలు జరపడం నేర్చుకోవచ్చును. ఒక పెద్దక్యాలికో బైండు పుస్తకం రు 5/- వి. పి. పి రు 1-2-0.

కొక్కోకము: ఇది అసలైన కొక్కోక గ్రంథము. ఫోటోలతో వున్నది— రు 1/- వి. పి. రు. 0 12-0.

Vani Book Depot. P. B. No. 239, Madras-1.

తీసుకుంది మన కథానాయకురాలు. కాదు కాదు మన కథలో నాయకురాలు గేదయి తేనే సరిపోతుంది. మరి రాఘవమ్మ? అయితే హీరో(గుణీభూతచలింగం పదవయః) కాకపోతే విలన్. ఏదైనా చివరగాని తేలదు అందాకా రాఘవమ్మ రాఘవమ్మే.

తీర్థయాత్రలకు వెడుతున్నానని, ఈ మాటు రోజులా వచ్చి వుండమని తల్లి వుత్తరం వ్రాస్తే వచ్చింది జయలక్ష్మి, ఆదెమ్మ పిన్ని కూతురు. జయానికి పుట్టి పెరిగినదగ్గర్నుంచీ రాఘవమ్మగారి అనవసరాధికార ప్రదర్శన పరాయణ ప్రకటానుబంధంగ అకారణ నిరంతర ప్రవర్ధమాన ప్రణయ బంధం — 'ఇదేం మహాసాలంకారయ్యే! ఇది పాఠ్యభాగం కాదు. పత్రికలో కథ' అను కుంటున్నారు కదూ పాఠకులు. అందుకనే అంటున్నా, నాకే కాదు జయానికి కూడా అర్థం కాలేదని. గేదె విషయం విన్నాక 'ఓసినీ!' అనుకుంది.

జయలక్ష్మికి వచ్చిన నేస్తం భాగ్య లక్ష్మి. జయం భాగ్యం ఒకూరి వాళ్ళు ఒక్కడు వాళ్ళను. చిన్నప్పట్నుంచీ ఆటపాటల్లో ఒక్క జట్టుగా వుండేవాళ్ళు. జయం వస్తూనే భాగ్యానికి కబురు చేసింది. స్నేహితురాళ్లిద్దరూ చాలాకాలానికి కలుసుకున్నారు. చిన్ననాటి ముచ్చట్లూ అత్త వారింటి అచ్చట్లూ ఒకరు విడిచి ఒకరు ఎంతసేపు చెప్పుకున్నారో వాళ్ళకే తెలియదు; ఆదెమ్మపిన్ని వచ్చి అన్నానికి లేవమన్నదాకా. జయం బలవంతాన భాగ్యాన్ని కొంత తప్పుకుందామనుకున్నా అప్పాట కక్కడ చెయ్యి కడగక తప్పలేదు. తరువు రావడం తప్పలేదు.

భాగ్యం ఆ రంగంలో ప్రవేశించడం రాఘవమ్మకు కళ్ళల్లో కలికం పెట్టుకున్నట్లున్నా పైకి నవ్వుతుంటుంది. చిన్ననాటి దాకా భాగ్యం చాలా తెలివైనదిరాలని తనే పొగి డింది. అంతేకాదు భాగ్యం పుట్టుకనుండి చూచి మోజుపడితే తనకూడా చేర్పిం దని అందరిదగ్గరా గొప్పగా 'మా పంతులమ్మ గా'రంటూ చెప్పింది. అక్కడ వినయాలే పోయింది. ఇప్పుడు కాదనుకుంటే అవన్నీ ఎలాపోతాయి కనుక 'వడ్డించే వాడు మనవాడైతే కడబంతిలో కూర్చుంటే మాత్రం ఏంపోయిందిలే' అని వూరుకుం దు తప్పులతోనూ గా.

జయంవచ్చినప్పటినుండి తల్లీకూతుళ్లిద్దరూ రాత్రి చాలాసేపు మాట్లాడుకున్నారు.

కళ్లుమూసుకుని తెరిచేలోగా ఆదెమ్మ పిన్ని ప్రయాణం గంటల్లోకి వచ్చింది. ఆ మధ్యాహ్నమే చిన్నకొడుకుదగ్గర్నుంచి ఆవిడ్ని తీసుకువెళ్లడానికి మనిషి వచ్చాడు. అతను వచ్చిందగ్గర్నుంచీ ఆదెమ్మపిన్ని

కూడాపు తెమ్మట్టైపోయింది. రాఘవమ్మ పెట్టీబేడా సర్దిపెట్టింది. పాడుంటూ వచ్చిన్నా అన్నీ సీసాల్లో సర్దిపెట్టింది. టిఫిన్ గిన్నెనిండా పేరినవెయ్యి పోసింది. అన్నీ అనుకున్నట్టు జరిగిపోయాయి. 'గేదను తోలుకువెడతావా పిన్నీ' అని నాలుక చివరిదాకా వచ్చిన మాటను 'ఈ కాస్తలో ఎందుకు తొందరపడాలి రేపుదయమే తోలుకెళ్లవచ్చు' అనుకొని మ్రింగివేసింది. రాత్రి పదింటివరకూ సామానులు సర్దుకోవడంతో వచ్చి వెళ్లేవాళ్ల అంపకాలతో ఆదెమ్మ పిన్ని ఇల్లు తిరునాళ్లయింది. కొంచెం అలజడితగ్గాక రాఘవమ్మ 'వస్తా పిన్నీ నువ్వు వెళ్లేముందు లేచివస్తాలే' అంది. 'ఎందుకేతల్లీ, ఇన్నాళ్లూ కష్టపడి నన్ను కాశీ పంపుతున్నావ్. ఇందులో సగం ఫలితం నీదే. నా రాఘవమ్మ కడుపు పండాలని కాశీ అన్నపూర్ణతో చెప్పుకుంటాలే' అన్నది నవ్వుతూ. రాఘవమ్మ ఆ మాటకు ముసిముసి నవ్వులతో సిగ్గుల పెళ్లి కూతురయింది.

ఊరంతా హాయిగా ఆదమరచి నిద్రపో తున్న ఆ అర్ధరాత్రి నిశ్శబ్ద తరంగాన్ని ఒత్తిగిస్తూ జయంతో ఆదెమ్మపిన్ని తీర్థ యాత్రలకని కొడుకు దగ్గరకు వెళ్లాలని ఎక్కిన రెండెడ్లబండి నిదానంగా సాగిపో యింది.

* * *

రాఘవమ్మ కలల బరువుతో మూతలు పడుతున్న కళ్లు తెరచి ఒళ్లు విరుచుకొని లేచే టప్పటికే కరకరా ప్రొద్దు బారెడు పైకి ప్రాకింది. లేస్తూనే 'ముందు గేదె సంగతి చూడా'లనుకుంది. — మొట్టమొదట నిన్నటి 'ఆదెమ్మ పిన్ని కాశీ వెడుతుందట' అన్నప్పుడే తన తలలో గేదె మెరుపులా మెరిసింది. ఎన్ని అవాంతరాలు వచ్చినా తన పాచిక పారింది. తన పాపు పండింది. తియ్యని ఊహలతో తొలకరి జల్లుకు మల్లె తీగలాగా రాఘవమ్మ శరీరం పులకించింది. మనస్సు మయూరంలా నృత్యం చేస్తూ వుంది.

అవిడ మనస్సులో ఒకమూల భ్రమంగా ఇంట్లో పాములా ఒకేఒక్క ఆశకూడా వుంది.

ఆదెమ్మ పిన్ని దనలే పెద్దకాలం ఊళ్లు కాని పూళ్లు తిరగడంలో ఎక్కడ నీళ్లు పడక ఏ ఛాయలాచేసి ఆ ప్రక్కడు— పోనిద్దురూ రాఘవమ్మ ఏమన్నా అనుకో నియ్యండి, అటువంటివి మనం ఎందు కను కోవాలి. అమంగళం శమించుగాక!

ఈ రకం ఊహలున్నాయంటే మీరు నమ్మరు. అవు నెలా నమ్ముతారు! ఆ మాట పాంకం ఆ మనిషి బొందికొ ఆ కలివిడితనం

ఆ శుభాశీస్సులూ ఆ వేదాంతం ఆ దేవతా భక్తి అన్నీ చూస్తే—

రాఘవమ్మ గోడను తోలుకురావడానికి రుష్యశృంగుణ్ణి తేవడానికి చేసిన ప్రయత్నాలు మంతి సన్నాహం చేస్తూ బయల్దేరి గుమ్మంలో కాలు బయట పెడుతూవుంటే పూచిన తంగేడులా భాగ్యం 'రాఘవమ్మ వొదినే, ఒక మరకం పెసరపొట్టుంటే యిద్దూ రవ్వ తెప్పించి యిస్తా' నంటూ బయట కాలు గుమ్మంలో పెట్టింది.

'సమయానికి సరిగ్గా వచ్చావు నాకు కొచ్చావు. రా! పొద్దెందుకు ప్రొద్దుటేగి' అంది రాఘవమ్మ.

'నిజంగా నీకు తెలియదా వొదినా! ఆదెమ్మపిన్ని గోడను చూస్తూవుండమని మొన్ననే చెప్పింది. ఇవ్వేళ ప్రొద్దుటే వాళ్ళపాలేరు తోలుకువచ్చి మా దొడ్లో కట్టి పోయా' డంది భాగ్యం అతి అమాయికంగా.

రాఘవమ్మ తలమీద మబ్బులేని పిడుగు పడింది. కళ్లు బయర్లుకమ్మాయి. కాలికింద భూకంపం వచ్చింది. - కులపర్వతాలు విరుక్కు తప్పాయనీ, సముద్రాలు ఘోషించాయనీ, సూర్యచంద్రులు గతులు తప్పారనీ, నక్షత్రాలు రాలిపోయాయనీ ఇంకా ఇంకా అబద్ధాలాడి కవి మర్యాదల్ని కాపాడాలనుకోవడం లేదుగనుక, అదికాకపోయినా ఆస్థితినిగురించి ఒక్క అక్షరం వ్రాయదలచుకోలేదు.

మూడు ముక్కలు చెప్పేది కథ ముగింపు అందగించడం కోసం—అకి అన్ని అధ్యాన్నం మధ్యాన్నం అయిపోయాయి. మూడొంతులుగా ఆదెమ్మ పిన్నికి (పిన్ని పిండా కూడూ ను—ఇది రాఘవమ్మ హృదయం) చేసిన అరవ చాకిరీ అంతా యాక్ట్ లో ఒలికిన ఓవర్టైం; తన ప్లానూ ప్రణాళికా చెడిపో కొట్టగా; చివరకు రాఘవమ్మ కోయిలను పెంచిన కాకి అయింది. అవమానంతో పాటు మిగిలిందల్లా పలుకరిలో పశ్చాత్తాపం.

ఇంత ఆక్రోశంలోను అటు ఆదెమ్మ పిన్నికి ఇటు వంతులమ్మ భాగ్యానికి ఎల్ల దబ్బకొట్టాలా అంటూ ఒక వందవర్ష ప్రణాళికకు ప్రారంభోత్సవం చేసుకుంది మనస్సులో.

'భిక్షాం దేహి' అంటూ వచ్చిన తత్వాల తాతయ్య తంబురా మీటుతూ పాడుతున్నాడు.

నాడి నాడని పెట్టి
లో దిగవే మనసా!
ప్రాప్తమే లేకున్న
ఫలితమ్ము సున్నా.
ఓ వెఱ్ఱిమనసా!
మనకర్మ కోరులకై
కినుకేల మనసా!
పెట్టి పుట్టిన దొరలు
పట్టేరు సిరులు.



అనాసిన్'

నాలుగు మందులను కలిగియున్నది.

"అనాసిన్" నాలుగు మందులయొక్క వైజ్ఞానిక మిశ్రమము అది నరముల ముఖ్య స్థానములందు తీవ్రమైన మిశ్రమచర్యను జరిపి, నొప్పి, తలనొప్పి, జలుబులు, జ్వరం, పన్నునొప్పి మరియు కండరాల నొప్పులనుండి శీఘ్రవిముక్తిని కలిగించును.

1. క్వినైన్: అధిక శక్తి నిచ్చు మరియు జ్వరనివారణ మొనర్చు గుణాలకు ప్రఖ్యాతి గాంచినది, జ్వరాన్ని తగ్గించడంలో మిక్కిలి శక్తిగలది.
2. కఫీన్: బలహీనానికి మరియు చిక్కిపోయినందులకు తగిన ఔషధమని విరివిగా వాడబడుచున్నది.
3. ఫినాసిటిన్: తీవ్రమైన బాధా నివారణ జ్వర నివారణియని ఖ్యాతిచెందినది
4. అసిటైల్ సాలిసిలిక్ ఆసిడ్: తలనొప్పి, మరియు అలాటి బాధలను పోగొట్టుటకు మిగుల ఉపయుక్తమైనది.

ఈ నాలుగు మందులు సరిగ్గా వైద్యునియొక్క ఔషధయోగము వలె పనిచేయును 'అనాసిన్' గుండెకు హాని కలిగించదు, లేక కడుపును అవకతవక చేయదు నొప్పి, తలనొప్పి జలుబులు, పన్నునొప్పి మరియు కండరాల నొప్పులనుండి శీఘ్రంగా మరకితమైన మరియు రూఢియైన విముక్తికొరకు ఎల్లప్పుడూ 'అనాసిన్'నే వాడండి.



లక్షలాది మందికి బాధావిముక్తిని కలిగించును

A. 43

(సీరియల్)

దావాగ్ని

జి.సి. రామకృష్ణ

9

తిరునాళ్లు మహా వైభవంగా జరుగుతూ ఉంది. మంచి నాగస్వర విద్వాంసులు వచ్చారు. రామిరెడ్డిగారికి బాండుమేళం అంటే చాలా యిష్టం కావడంచేత మంచి బాండు వాయించేవాళ్ళను కూడా రప్పించాడు.

జాటూరు రాముదాసుగారూ, కోపూరు రామశాస్త్రిగారు, పండితారాధ్యుల సాంబమూర్తిగారు ముచ్చటగా మూడు రోజులు వరుసగా హరికథా కాలక్షేపంచేసి సన్మానాలు పొంది వెళ్ళారు.

ఆరోజు శివరాత్రి—ఈశ్వరుడు నంది వాహనంపై ఉత్సవం జరుపుకునే రోజు. గ్రామం జనసమూహంతో కోలాహలంగా ఉంది. ఆరోజు రాత్రి కూచిపూడి భాగవతులు, "కుమారసంభవం" నాటకం ఏర్పాటు చేయబడింది.

దేవాలయానికి ముందున్న విశాలమైన ఆవరణలో వేదిక నిర్మించబడింది. ధర్మకర్తగారైన రామిరెడ్డిగారు బెత్తం చేతబట్టుకొని కేకలేస్తూ ప్రజల్ని కూచోబెడుతున్నారు. ప్రజలందరు అటూ ఇటూ తిరుగుతూ పెత్తనం చలాయిస్తూ కేకలేస్తూ తిరుబాటు లేకుండా ఉన్నారు.

నాటకం పన్నెండు గంటలకు పూర్తి అయింది. దేవాలయం ఎదుట జనం ప్రజా సముద్రంలాగా ఉన్నారు. బాండుమేళం సన్నాయిమేళం కలిసి చెవులు గింగుర్లెత్తేట్లు మోగుతున్నాయి. ఆ సంగీతం ప్రజలకు ఉత్సాహాన్నీ ఆవేశాన్నీ ఇస్తూంది. పల్లకిని, యాభైమంది దృఢకాయులైన మనుషులు భుజాలపై కెత్తుకున్నారు. దేవుని ఎత్తగానే నాగస్వరం ఉన్నత స్థాయిలో సంగీతాన్ని ఆకాశంలోనికి ప్రవహింపజేసి ప్రజల హృదయాల్ని పులకరింప చేసింది. నాగస్వరం వాయించే వ్యక్తి తన్మయుడై భగవంతుని ఎదుట నిర్భాని ఆవేశంతో వాయిస్తున్నాడు. బాండు వాయిద్యం ప్రజలకు యింపుగా లేకపోవడంచేత అందరూ నాగస్వరం పక్కనే చేరారు.

ఊరేగింపు బ్రహ్మాండంగా బయలు దేరింది. దేవుడు కదిలి వస్తుంటే జనసమూహం, భగవంతునికి నమస్కరిస్తూ మెల్లగా కదుల్తూ నడుస్తున్నారు.

ప్రజలిచ్చే నైవేద్యాలు పుచ్చుకుంటూ పూజారి వీరభద్రయ్యగారు ఆనందభరితులౌతున్నారు. మాధవశాస్త్రి ఆ జనసమూహాన్ని దేవుణ్ని చూస్తూ తన్మయుడైపోయాడు. ఊరేగింపు ఒక అడుగు కదలడానికి అరగంట పడుతూ ఉంది.


వాహనంపై అలంకరించబడిన దేవుడు చాలా ఎత్తుగా ఉండడంవల్ల వీధిలో ఉన్న చెట్లకొమ్మలు అడ్డం వస్తున్నాయి. రామిరెడ్డిగారు సేద్యగాళ్లను గొడ్డళ్లు తీసుకు రమ్మని చెప్పి అడ్డంవచ్చిన చెట్లకొమ్మలు నరకమని ఆజ్ఞ యిచ్చేశాడు. సేద్యగాళ్లు ఉత్సాహంగా చెట్లెక్కి, అడ్డంఉన్న కొమ్మలు, అడ్డంలేని కొమ్మలు అన్నీ నరికి పారేయడం ప్రారంభించారు.

ఊరేగింపు గ్రామమున్సబుగారి వాకిటికి వచ్చింది. దేవుడు యాభైగజాల దూరంలో ఉండగానే రామిరెడ్డిగారి సేద్యగాళ్లు గ్రామమున్సబుగారి యింటిముందున్న వేప చెట్లెక్కి ఫటఫటా కొమ్మలు నరకడం ప్రారంభించారు. గ్రామమున్సబుగారైన వెంకటరెడ్డిగారు వీరావేశంతో వచ్చి "ఒరేయ్ ఎవడురా వాడు! దిగరా ముందు కిందికి" అని రంకవేశాడు. తన పెద్ద సేద్యగాడైన వెంకటేశ్వర్లును పిల్చి, "ఒరేయ్ చెట్టెక్కి వాళ్ళని కిందకి తొయ్యరా" అని ఆజ్ఞ యిచ్చేశాడు. వెంకటేశ్వర్లు చెట్టెక్కి కొమ్మలు కొట్టవద్దని ముందు నెమ్మదిగా చెప్పాడు.

"మా రెడ్డి కొట్టమన్నాడు పోవోయ్" అని రామిరెడ్డిగారి సేద్యగాళ్లు వెంకటేశ్వర్లు మాట లెఖ్ఖ చెయ్యలేదు.

ఒక సేద్యగాడి చేతిలోని గొడ్డలిని వెంకటేశ్వర్లు బలవంతంగా పెనుగులాడి లాక్కున్నాడు. రామిరెడ్డిగారి సేద్యగాడొకడు వెంకటేశ్వర్లును గొడ్డలితో ఒక్క దెబ్బ వేశాడు. వెంకటేశ్వర్లు 'అమ్మా' అని కేకేసి చెట్టుమీదనుంచి దభాలున కిందపడ్డాడు.

ఇంతలోగా గ్రామమున్సబుగారు ఒక వందమంది హరిజనుల్ని పిల్చుకొచ్చాడు. ఆ హరిజనులు రామిరెడ్డిగారి సేద్యగాళ్ళను


లల్లూరాం అండ్ కో
(స్థాపితము 1928)
ఏభై సంవత్సరాలుగా మన్నికకు, నాణ్యతకు, సరసమైన ధరలకు ప్రసిద్ధిచెందిన
* ఇనుప పెట్టెలు * ఉక్కు బీరువాలు
* క్యాషు బాక్సులు
లల్లూరాం అండ్ కో
వెలగలేటివారి వీధి, :: విజయవాడ - 1.
"కొత్త పోయాన్ - మారుతి సినిమా ఎదురుగా

చుట్టుముట్టి గొడ్డళ్లు పెరుకొక్కొని తరిమి తరిమి కొట్టారు.

రామిరెడ్డిగారు రెండువందలమంది హరిజనుల్ని, తన సేద్యగాళ్ళకు వత్తాసిగా పంపించాడు.

రెండు పక్షాలు ఢీకొన్నాయి. ఒకరి మాట ఒకరికి వినిపించడంలేదు. పసిబిడ్డలు స్త్రీలు బాపురుమని అరుస్తూ పరుగు లెత్తారు. రాళ్ళవర్షానికి ప్రజలు భయభ్రాంతులై ఎటుపోను తోచక పిచ్చి పట్టినట్లు పరుగులెత్తుతున్నారు.

రామిరెడ్డిగారు భద్రంగా మేడమీదికి చేరుకున్నారు గ్రామమున్సబుగారు సురక్షితంగా తనమేడపై చేరాడు. హరిజనులు రెండుగుంపులుగాచేరి పోరాడుతున్నారు. బాదుకుంటున్నారు.

మాధవశాస్త్రి తలపైన ఒక ఇటుకరాయి వచ్చిపడింది. ఇంటికి పరుగెత్తడానికి ఆయన కొంతదూరం నడిచాడుకాని స్పృహ తప్పి పడిపోయాడు. ప్రజలందరు చెల్లాచెదరై పోయారు. దేవునిపల్లకీ మోసేవాళ్లు పల్లకీ నట్టనడివీధిలో వదిలేసి పరుగులెత్తారు. పూజారివీరభద్రయ్యగారు అంతులేకుండా అదృశ్యమయాడు.

ఎగ్జిక్యూటిక్ ఆఫీసరుగారైన కామేశ్వరరావుగారు సురక్షితంగా రామిరెడ్డిగారి మేడపైన చేరి—

"రెడ్డిగారూ, మాధవశాస్త్రిని కార్లో పంపించి, పోలీసుల్ని పిలిపించండి." అని కంగారుపడుతూ, చెప్పాడు.

పోరాటం ఎంతసేపయినా అంతం కాలేదు. హరిజనులు బాగా సారాయితాగి ఆవేశంతో ఉండడంచేత మహావీరుల్లాగా పోరాడుతున్నారు.

ఆ కోలాహలానికి గ్రామమంతా గడగడలాడిపోయింది. అంగళ్లు నుగ్గు నుగ్గయి పోయినాయి.

పోట్లాడుకుంటున్న గుంపు పరుగెత్తుకుంటూవచ్చి దేవునిపల్లకీపై బడ్డారు. లైట్లు మోసేవాళ్లు పారిపోవడంచేత అంతా అంధకారం ఆక్రమించుకొంది. రామిరెడ్డిగారు కార్లో వెళ్లి పోలీసువాళ్ళని పిల్చుకొచ్చాడు. మరునాడు ఉదయం నాలుగు లారీలనిండా పోలీసులు తుపాకులు ధరించి, బూట్లు చప్పుడు చేసుకుంటూ వచ్చారు. దెబ్బలు తగిలినవాళ్ళందర్నీ నెల్లూరు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. కొంతమంది హరిజనుల్ని అరెస్టుచేసి జామీనుపై విడుదల చేశారు.

10

నెల్లూరు గవర్నమెంటు ఆస్పత్రిలో సాయంత్రం అరుగంటలప్పుడు పడకమీద పడుకొని, ఒక రామభక్తుడు రామనామ సంకీర్తనం చేస్తున్నాడు. ఆ పక్కనే ఇంకొకపడకమీద ఒక కుసుమహరనాథ భక్తుడు కుసుమ హరనాథస్మరణ చేస్తున్నాడు. ఆ కుసుమ హరనాథ భక్తుడు మెల్లగా తలపక్కకు తిప్పి, ఆరామభక్తుణ్ణి చూచాడు. రామభక్తుడు గెరటయ్య ఆశ్చర్యంతో తల్లడిల్లి "అయ్యో, మాధవయ్య స్వాములూ" అని పలకరించుకున్నాడు.

మాధవశాస్త్రి భారమైన హృదయంతో, "ఏం గెరటయ్యా" అని విచారంగా అన్నాడు. మాధవశాస్త్రిగారి పడకకు ఎదురుగా ఒక యువకుడు మృత్యువుతో పోరాడుతున్నాడు. ఆయువకుడు బ్రతకడం సందేహాస్పదమేనని డాక్టర్లు చెప్పారు. ఆ మృత్యువుతో పోరాడే యువకుడు వెంకటేశ్వర్లు మాధవశాస్త్రితో గూడ చిన్నతనంలో ఆడుతూపాడుతూ తిరిగిన స్నేహితుడు. ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్కరియింట్లో సేద్యానికిఉంటూ గ్రామంలోని భూస్వాములందరికీ తన కండలు కరిగించి, కష్టించి సేద్యంచేసి పంటలు పండించి సేవచేసిన త్యాగపురుషుడు ఆయువకుడు. గెరటయ్యకు ఏమిమాట్లాడడానికీతోచక మాధవశాస్త్రినీ వెంకటేశ్వర్లునీ చూచి కన్నీళ్లు తుడుచుకున్నాడు.

మాధవశాస్త్రి గెరటయ్యవైపు మళ్లి, "నువు ఎక్కడున్నావుగెరటయ్యా నిన్న కనిపించనేలేదే" అన్నాడు.

గెరటయ్య కన్నీళ్లు తుడుచుకొని, "పల్లకీ ఎవకనే వస్తుండానుస్వామీ. ఒక యానాది పిల్లోడొచ్చి అక్కడెవురో కొట్టుకొంటున్నారు, అన్నాడు ఎవురా అని వచ్చాను. మావోళ్లే. మామాలఎదవలే. అడ్డం తీస్తామని పోయాను. తర్వాత నావోళ్లు నాకు తెలీదు" అన్నాడు గెరటయ్య. పాపం గెరటయ్యకు వళ్లంతా దెబ్బలే. మాధవశాస్త్రికి తలపైన రాయి తగలడంచేత తల పగిలి బాగా రక్తం ప్రవహించి శరీరం నీరసించి పోయింది మాధవశాస్త్రికి తలపైన మాత్రమేకట్టు. గెరటయ్యకు ఒళ్లంతా కట్లు కట్టారు.

ఆస్పత్రిలో పడకలు చాలక గాయాలు తగిలినవాళ్ళని వరుసగా వరండాల్లో పడుకోబెట్టారు. అందరూ బాధతో మూలుగుతుంటే నర్సులు తిట్టడం ప్రారంభించారు. ఒకనర్సు పకపక నవ్వుతూ, ఏం నాయనా బాగా తిన్నది అరక్క పోట్లాడుకొని 'అమ్మో, అమ్మో' అని యిప్పుడు మూలిగితే ఏం లాభం? ఆ బుద్ధి ముందేఉంటే ఎంతబాగుండేది?" అంది.

"నా బంగారుతల్లి. మా ఎదవలకు బుద్ధి ఉంటే ఇంకేంతల్లి" అని గెరటయ్య దీనంగా అన్నాడు.

మాధవశాస్త్రి వెంకటేశ్వర్లు పడేబాధ చూడలేక నీళ్ళుగ్రమ్మిన కళ్ళను తుడుచుకున్నాడు. వెంకటేశ్వర్లు ఆరాత్రంతా మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు. వెంకటేశ్వర్లు జీవితం అంతా మాధవశాస్త్రి కళ్లముందు ఒక్కసారి మెరిసింది - చిన్నతనంలోనే తల్లీ తండ్రీ దూరమైపోయారు. ఆరోజునుంచీ కాయకష్టంతోనే బదుకుతూ



చర్మపుబాధలకన్నిటికి

"సైబాల్"

చర్మబాధలు అన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విష క్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబీస్, మొటిమలు, తామర, కాళ్లపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధిచెందినది.

"రమణీస్ బేబి గ్రైప్"

తయారీదార్లు

దిసౌత్ ఇండియన్

మాన్యుఫాక్చరింగ్ కంపెని, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు

సీతారామ జనరల్ స్టోర్సు ఏజెన్సీస్

విజయవాడ, సికింద్రాబాద్.

బరంపురం (గంజాం), బొంబాయి. బెంగుళూరుసిటీ.



★ దా శా గి ★

అఖరున తనే యజమాని ఆజ్ఞను నిర్వర్తిస్తూ దెబ్బలుతిని ప్రాణాలు వదిలాడు — మాధవశాస్త్రి కన్నీటి ప్రవాహాన్ని ఆపుకోలేక గొల్లున ఏడ్చాడు. దుఃఖాన్ని అదుపులో పెట్టుకొని తన స్నేహితుని శరీరాన్ని — గ్రామంలోని భూస్వాములందరికీ సేవచేసిన తన స్నేహితుని శరీరాన్ని తనివితీరా ఆఖరుసారి చూచాడు మాధవయ్య. "మాధవయ్యా, మాధవయ్యా" అంటూ అనురాగంతో వెంకటేశ్వర్లు పిల్చే పిలుపులు మాధవయ్య చెవుల్లో ప్రతిధ్వనించాయి. 'తన పొట్టకోసం ఒకమనిషి ఇంకొకమనిషికి ఎందుకు సేవచెయ్యాలో! ఎన్నాళ్లు సేవచేసినా, వెంకటేశ్వర్లు సంపాదించిన ఆస్తిపాస్తులేమీ లేవు. ఇతరుల సొత్తు పెంపుకు సేవచేసి చేసి అతని కండలు కరిగిపోయ్యాయి చివరికి యజమానికోసమే ప్రాణాలు సమర్పించి ఈ లోకంనుండి వెళ్ళిపోయాడు వెంకటేశ్వర్లు.

డబ్బారేకుల బండిలో వేసుకొని, వెంకటేశ్వర్లును తీసుకొనిపోతూంటే మాధవశాస్త్రి, గరటయ్య ఏడ్చారు.

పోలీసు వాళ్లొచ్చి మాధవశాస్త్రి దగ్గర గరటయ్యదగ్గర స్టేటుమెంట్లు తీసుకున్నారు. గాయాలు తగిలి జాగ్రదవస్థలో ఉన్న మనుషులందరిదగ్గరా స్టేటుమెంట్లు తీసుకొని వెళ్ళారు పోలీసులు. మాధవశాస్త్రిని యింటికి వెళ్లవచ్చునని డాక్టర్లు అనుమతించారు. మాధవశాస్త్రి మెల్లగా లేచి మహానరకంలాగా ఉన్న ఆస్పత్రిలో నెమ్మదిగా పచారుచేశాడు. రోగాలతో ఎముకల గూళ్లలాగా ఉన్న మనుషులొకపక్క — గాయాలతో మూలుగుతున్న తన గ్రామీణులొకపక్క — మాధవశాస్త్రి మెల్లగా వరండాలోకి వెళ్లాడు. అక్కడ మూల వెంకట్రాముడు ఒక బెడ్ పైనబడి గురక పెడుతున్నాడు. శరీరమంతా కట్లు కట్టిఉన్నాయి.

"ఇతను కూడా బ్రతికేట్లు లేదండీ" అని నర్సు సందేహంతో పెదవి విరిచి వెళ్ళిపోయింది.

మాధవశాస్త్రి కొంతసేపు నిశ్చేష్టుడై నిల్చొని దీనంగా వెంకట్రాముణ్ణి చూచి, గరటయ్యదగ్గరికొచ్చి, వెంకట్రాముడు కూడా వెళ్ళిపోయేట్లు ఉన్నాడని చెప్పేసరికి గరటయ్య కాపురుషుని పసిబిడ్డలాగా ఏడ్చాడు.

"ఏమిటయ్యా అది! తయారు వెళ్లండింక" అని మాధవశాస్త్రిని నర్సు ఆజ్ఞ చేసింది. మాధవశాస్త్రి మెల్లగా ఆస్పత్రినుండి వెలుపలికొచ్చి, అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తూ రామిరెడ్డిగారి బసను చేరుకున్నాడు.

కామేశ్వరరావుగార్లు, రామిరెడ్డిగారు, పోలీసు అధికార్లు, ఏదో గుసగుసలాడుకుంటున్నారు.

మాధవశాస్త్రిని చూచి కామేశ్వరరావుగారు దగ్గరకొచ్చి,

"మాధవయ్యా! ఎంత పిచ్చివాడివయ్యా! స్టేటుమెంటు ఇచ్చేది అలాగేనా? ఫరవాలేదులే, మేం సరిచేశాములే" అన్నాడు.


ఆ సరిచేయటం అంటే ఏమిటో మాధవశాస్త్రికి అర్థంకాలేదు. గుట్టుగా వెళ్లి పడుకున్నాడు.

రామిరెడ్డిగారు కారు డ్రైవరును పిల్చి, మాధవశాస్త్రిని కార్లో కూచోమని చెప్పి, 'శాస్త్రిగార్ని ఊర్లో వొదిలిరా' అని ఆజ్ఞాపించాడు. కారు శరవేగంతో పోతూఉంటే మాధవశాస్త్రి ఆలోచనా సాగరంలో మునిగిపోయాడు.

గ్రామానికి చేరి కారులోనుండి దిగగానే గ్రామమంతా కొత్తగా కనిపించింది.


మాధవశాస్త్రిని చూడగానే విమలమ్మ గుండెలు కరిగేట్లు విలపిస్తూ భర్తకాళ్లు పెనవేసుకుంది. సుబ్బారావు పంతులుగారు వచ్చి మాధవశాస్త్రిగారిని చూచి క్షేమంగా తిరిగివచ్చినందుకు సంతోషించాడు. సుబ్బారావు పంతులుగారిని చూడగానే మాధవశాస్త్రికి కొంత ధైర్యం చిక్కింది.

గ్రామమున్సబుగారి సేద్యగాడు వెంకటేశ్వర్లు చనిపోయాడని, మాధవశాస్త్రిగారు సుబ్బారావుగారితో చెప్పి, చెమ్మగిలిన కళ్లు తుడుచుకొన్నాడు. 'పంతులుగారూ, మీ



గోల్కొండకోట శిథిలాలు

ఫొటో: పి. వెంకటేశ్వరరావు—రాజమండ్రి.



కొండపల్లి కొండలు

ఫొటో: వత్సవాయి వెంకటరాయపరాజ—ఖండవల్లి.

కేమైనా చెప్పండి. ఈ గ్రామంలో వీళ్ళ మధ్య బతికేకన్నా, సన్యాసం తీసుకొని ఎక్కడున్నా అడవుల్లో బతికేది చాలా మేలు' అని నిరాశతో అన్నాడు మాధవ శాస్త్రి.

నిరాశ విచిత్రమైన అంటువ్యాధి. అది సోకిందంటే చాలు మనిషిని క్రుంగదీస్తుంది. మాధవశాస్త్రి కుంగిపోతున్న మనసును కొంత అదుపులో పెట్టుకొని

"పంతులుగారూ,.. నాకు మీ సహాయం కావాలి. ఇప్పుడు నాకేమి చెయ్యడానికీ తోచకుండా ఉంది. వెంకటేశ్వర్లు వచ్చిపోయాడు. వెంకట్రాముడు ఈరోజో, రేపో, కన్నుమూసేట్టున్నాడు. రగిలి రగిలి ఇది పెద్దమంటయ్యేట్లుంది. నన్ను కూడా తప్పకుండా కోర్టుకు రమ్మంటారు. నే నింతవరకు కోర్టుముఖం చూడలేదు." అన్నాడు.

సుబ్బారావు పంతులుగారు ధైర్యంగా నవ్వి, 'మీ కెందుకండీ,...మీకు తెలిసినంతవరకు నిజమే చెప్పండి — వాళ్ళకేం... కావాల్సినంత డబ్బుంది - నందిని పందిని చెయ్యగల శక్తివున్నారు. మీ రెడ్డిగారు కావాలనుకుంటే ఎంతపనైనా చెయ్యగలడండీ' అని పంతులుగారు పకపక నవ్వేరు.

11

గ్రామం రెండు శత్రు శిబిరాలుగా మారిపోయింది. మాదిగ వెంకట్రాముడు కూడా రెండురోజులు మృత్యువుతో పోరాడి ప్రాణవాయువులు వదిలేశాడు. హరిజనవాడ రెండుపక్షాలయింది. ప్రతిరోజూ ఏదో ఒక సాకుతో హరిజనులు పోట్లాడుకోవడం ప్రారంభించారు.

గరటయ్య గాయాలు నెమ్మదిచేసుకొని హరిజనవాడకువచ్చి తన ప్రజల్ని చూచుకొని నిరాశతో క్రుంగిపోయాడు. అతని మాటే వినేవాళ్ళు లేరు.

శివరాత్రినాడు జరిగిన కొట్లాట కేసు హైకోర్టుదాకా వెళ్ళింది. గ్రామమున్సబుగారైన వెంకటరెడ్డిగారు తన తరఫున వాదించడానికి శ్రీ హరిశ్చంద్రరావుగార్ని న్యాయవాదిగా నియమించుకొన్నారు. హరిశ్చంద్రరావుగారు భారతదేశమంతటా ప్రఖ్యాతిగాంచిన న్యాయవాది. నట్టనడివీధిలో పట్టపగలు జరిగిన ఖూనీకేసయినా సరే హరిశ్చంద్రరావుగారు తెలివితేటలతో వాదించి, కేసు కొట్టేయించగలిగిన ప్రతిభాశాలి.

రామిరెడ్డిగారు తన పక్షాన వాదించడానికి శ్రీ సత్యనారాయణ మూర్తిగారిని ఎన్నుకొన్నారు. ఆయన హరిశ్చంద్రరావుగారిని మించిన మేధావంతుడు. ఆయన అబద్ధపు సాక్ష్యాలు సృష్టించి, సాక్షులకు తర్ఫీదు ఇవ్వడంలో సాటిలేని మేటి.

"గ్రామమున్సబుగారు అక్రమంగావచ్చి శివుని ఊరేగింపు అడ్డగించి వెంకట్రాముణ్ణి గొడ్డలితో తల పగులగొట్టిన"ట్లుగా మాధవశాస్త్రిగారిని సాక్ష్యం చెప్పమన్నారు. శ్రీ కుసుమ హరనాథభక్తుడైన మాధవశాస్త్రిగారు అబద్ధపుసాక్ష్యం చెప్పడానికి నిరాకరించారు.

రామిరెడ్డిగారికి వళ్ళు మండిపోయింది. కామేశ్వరరావుగారు, వీరభద్రయ్యగారు ఎటువంటిసాక్ష్యం చెప్పడానికయినా సిద్ధపడ్డారు.

మాధవశాస్త్రిగార్ని ఒకనాడు రామిరెడ్డిగారు ఇంటికి పిలిపించి "మాధవయ్యా!

నీ మంచికోసమే చెపుతున్నాను. నాతో విరోధం పెట్టుకున్నావంటే నీకీఊళ్లో మంచి నీళ్లుగూడా పుట్టవు" అన్నాడు.

మాధవశాస్త్రి గడగడలాడిపోయి "అబద్ధం చెప్పడానికి నామనసొప్పడంలేదండీ. మీరేమైనా అనుకోండి. సాక్ష్యం చెప్పేవాళ్లు మీకు కావాల్సినంతమంది ఉన్నారుకదా రామసుబ్బారెడ్డిగారు, పుల్లారెడ్డిగారు, అంతా మనవాళ్లేగదా! నేను దిక్కులేనివాణ్ణి. అదీగాక కోర్టు అంటేనే నాకు విపరీతమైన భయం. ఎందుకు నన్ను వృధాగా శ్రమపెడ్తారు" అన్నాడు మాధవశాస్త్రి.

"ఛీ. నోరుమూసుకో - బుద్ధిలేని అయ్యోర్రా! నువ్వేమో నా మనిషివనుకొని నిన్ను అందరికన్నా ముందు సాక్షుల్లో రాయిస్తే యిప్పుడు వల్లకాదంటావా?" అని వీరావేశంతో ఉగ్రుడై అరిచాడు రామిరెడ్డిగారు.

మాధవశాస్త్రి గడగడలాడుతూ కుసుమహరనాథనామస్మరణచేస్తూ కూచున్నాడు.

సావిత్రమ్మ విసురుగావచ్చి, "ఏమిటండీ ఆ కేకలు? దొంగసాక్ష్యాలు చెప్పేవాళ్లు కావాల్సినంతమంది మీ చుట్టూ ఉన్నారుగా! నాకు కోర్టంటే భయమో అని ఆయన లబోదిబో మొత్తుకుంటుంటే, ఆయన్ని బలవంతంచేస్తే ఏం లాభం?" అని వాదించింది.

రామిరెడ్డికళ్లు చింతనిప్పుల్లాగా ఉన్నాయి. గుర్రుమని "పోముందు ఇంట్లోకి-నిన్నెవరు రమ్మన్నారిక్కడికి? నీమాటేముందిక్కడ?" అని దబాయించాడు. సావిత్రమ్మ అవమానంతో కోపంతో తల్లడిల్లిపోయింది.

"మీయిష్టంవచ్చినట్లే చేసుకోండి తన్నుకొని చావండి - మాకేం, మరేమీ చావరులే. చచ్చేది - ఆ కూటికిలేనివాళ్ళేగా" అని గొణుగుతూ సావిత్రమ్మ ఇంట్లోకి వెళ్ళింది.

"మాధవయ్యా - బాగా ఆలోచించుకో. సాయంత్రం మళ్లీవచ్చి నాకేసంగతీచెప్పు" అని రామిరెడ్డిగారు ఠీవిగా సిగరెట్టుపీలుస్తూ అన్నారు. మాధవశాస్త్రిగారు సెలవు తీసుకొని ఇంటికివెళ్ళి కుసుమహరనాథుని పటం ముందు కూచొని ప్రార్థించాడు - ఎంతసేపు ప్రార్థించినా అబద్ధపుసాక్ష్యం చెప్పడానికి మనసంగీకరించలేదు.

"కుసుమహరనాథునికోరికలతో ప్రార్థించకూడదు. మనల్ని కాపాడేభారం ఆ ప్రభువుదే. మనం ఏపనిచేసినా ఆ ప్రభువుపైనే భారంవేసిచేయాలి" అని రాళ్ళబండి వీరభద్రరావుగారు చెప్పిన వాక్యాలు జ్ఞాపకానికొచ్చాయి - మాధవశాస్త్రి కొంతసేపు ఆలోచించాడు. తన తండ్రి మరణశయ్యపైనుండిచెప్పిన అమూల్యమైన వాక్యాలు మనసులో తళుక్కున మెరిశాయి - "నాయనా ఈ మనుషులమధ్య ఎలా బ్రతుకుతావో నీవు. నిజం నీకు తెలిసినా ఎవ్వరితోనూ చెప్పవద్దు. ధనమదంతో కళ్ళు గానక ఉండే వాళ్ళతో జాగ్రత్తగా మెలగాలి"

మాధవశాస్త్రి మెల్లగా సుబ్బారావు పంతులుగారింటికి వెళ్లారు. పంతులుగారు పిల్లల్ని కూచోబెట్టి అన్నం పెడుతున్నారు. పిల్లలు కిలకిలానవ్వి,

"నాన్నా! అడుగో, మాధవయ్యమామ వచ్చాడు." అన్నారు. సుబ్బారావుగారు శాస్త్రిగార్ని కూచోమని చెప్పి, "ఏమండీ శాస్త్రిగారూ, ఎలాఉంది వ్యవహారం?" అన్నాడు.

మాధవశాస్త్రిగారు నిరాశతో క్రుంగిపోతూ, "ఏముందండీ, కత్తీ నాగేటిసందున నలిగిపోతున్నాను - గ్రామమున్సబుగారు ఊరేగింపును అక్రమంగా అడ్డగించారని, వెంకట్రామున్ని కొట్టారని - నన్నుసాక్ష్యం చెప్పమంటున్నారండీ" అని దీనంగా అన్నాడు మాధవశాస్త్రి

సుబ్బారావుగారు ఆశ్చర్యంగా "మీరేమన్నారు?" అన్నాడు.

"రెడ్డిగారు చెప్పినట్లు వినకపోతే, ఉద్యోగం ఊడిపోతుంది. ఆసంగతి బాగా తెలిసిందే" అన్నాడు మాధవశాస్త్రి.

సుబ్బారావుగారు గాఢంగా ఆలోచిస్తూ కూచున్నారు.

ఏం చెయ్యమంటారో చెప్పండి - నేను ఏమీ చూళ్లేదు. అందరూ పరుగెత్తుతుంటే నేనూ ఒకపక్కకు పరుగెత్తాను. పెద్దరాయి



వచ్చి నెత్తిన తగిలింది. తర్వాత ఏమి జరిగిందో నాకు తెలీదు." అన్నాడు మాధవశాస్త్రి

సుబ్బారావు గారు చిరునవ్వునవ్వి, "మీ యిష్టం - మీకు ఉద్యోగమే కావాలనుకుంటే, అబద్ధం చెప్పండి - వెధవ ఉద్యోగం, బతక లేకుండా పోతామా అనుకుంటే నిజమే చెప్పండి." అన్నాడు సుబ్బారావుగారు—

సరేనని మాధవశాస్త్రిగారు ఇంటికి వెళ్లారు. ఎంతసేపు ఆలోచించినా ఎటూ తేలలేదు. ఉద్యోగం లేకపోతే ఇంకేమైనా ఆస్తిపాస్తులన్నా ఉంటే అనుకోవచ్చు - కానీ వకీళ్లు సృష్టించిన అబద్ధపుసాక్ష్యాలు చిలకపలుకుల్లాగా పలకడానికి మాధవశాస్త్రికి మనసంగీకరించలేదు ఆలోచిస్తూ పడుకున్నాడు - రాత్రి పన్నెండుగంటలయి ఉంటుంది - ఎవరో తలుపుతట్టారు. మాధవశాస్త్రికి గుండెజల్లుమంది అసలే ఆలోచనతో నలిగిపోతున్న మనిషి - అర్ధరాత్రప్పుడు ఎవరో తలుపు తట్టారు - మాధవశాస్త్రి ప్రాణాలు పిడికెట్లో పెట్టుకొని విమలమ్మను నిద్రలేపాడు. విమలమ్మ లేచి "ఏమిటండీ" అని భయంతో గడగడలాడింది.

ఇద్దరూ విన్నారు - ఎవరో, మెల్లగా గోటితో తలుపు తట్టుతున్నారు. మాధవశాస్త్రి ధైర్యం తెచ్చుకొని, కుసుమ హారనాథుణ్ణి మనసులో ధ్యానించుకుంటూ, "ఎవరు?" అన్నాడు.

"తలుపుతీ, మాధవయ్యా" అని జాలిగా ఒక స్త్రీ కంఠం విన్పించింది.

విమలమ్మ, మాధవశాస్త్రి, ఒకరిముఖాలు ఒకరు చూచుకొని గాభరాపడి, దీపం పెద్దదిచేసి, నెమ్మదిగా నడిచి తలుదగ్గర కొచ్చి, "ఎవరు?" అని మాధవశాస్త్రి మళ్లీ అన్నాడు.

"ఎందుకు మాధవయ్యా అంత భయం? నేనూ మనిషి నేనే, తలుపు తియ్యవ్వామీ" అని వెలుపలినుండి, మెల్లగా జవాబు వచ్చింది.

మాధవశాస్త్రి ధైర్యంచేసి తలుపు తలుపు తెరిచాడు తలపైన వేసుకొన్న ముసుగు సవరించుకుంటూ, గ్రామమున్నబుగారి భార్య రుక్మిణమ్మ లోపలికొచ్చింది. విమలమ్మ మాధవశాస్త్రి నిర్విణ్ణులై నిల్చున్నారు. రుక్మిణమ్మ తలుపు వేసి,—

"ఏం, నాయనా...మీకు ఆశ్చర్యంగా ఉండదికదూ! అవును నాయనా......నా బ్రతుకు అందరికీ ఆశ్చర్యమే అయింది..." అన్నది.

విమలమ్మ చాపవేసి, "కూర్చో అమ్మా" అని మర్యాదచేసింది.

"ఎందుకులేమ్మా" అని రుక్మిణమ్మ వినయంగా అని,—"మాధవయ్యా ..నా మంగళసూత్రం కాపాడమని నీ కాళ్లు బట్టుకుందామని వచ్చాను నాయనా. ఎందుకయ్యా ఊరుకుంటావుంటే ఉండకుండా ముందుకు దూకేవు—లేనిపోని కని నెత్తికి చుట్టుకున్నాడు దిగులుపడి ఇంట్లో గూర్చొనుండాక ఎంగుకొచ్చినట్టు నిన్న వకీలు దగ్గరికి పోయి రావడానికి మూడు వేల యింది—ఏమీ లేదు మాధవయ్యా. నువ్వు గనక సాక్ష్యం చెప్పకుండా ఉంటే, కేసు బలం తగ్గిపోతుంది—అని అంటున్నాడు. లేకపోతే, ఉరిశిక్ష తప్పదని నలుగురూ అంటున్నారు—నా మాట విని ...నువ్వు అబద్ధం చెప్పొద్దు—జరగిన సంగతి—నీకు తెలిసిందే చెప్పు—అంతగా నీ నౌకరి తీసేస్తారా—మా రెడ్డితో చెప్పి నీ పేరట రెండెకరాలు రాసిచ్చేటట్లు చేస్తాను—నా పసుపు కుంకుమ కాపాడు నాయనా—తండ్రీ, ఉరిశిక్ష వేస్తారు—అని అందరూ గుసగుసలాడుకుంటూ ఉంటే, నా మనస్సెట్టా ఉంటది, నీవే చెప్పు తండ్రీ!.... నువ్వేమీ, మీ రెడ్డికి భయపడొద్దు—నువ్వు నిజం చెప్పు. నిన్ను పోషించే భారం నాది. మా కుంటేవాంట్లో రెండెకరాలు ఒక లెక్క గాదు. నా ప్రాణాలు కాపాడేవంటే అంతేచాలు నాయనా" అని రుక్మిణమ్మ గొల్లున ఏడ్చి, కన్నీటి చెరగు నోటకుక్కుకుంది.

మాధవశాస్త్రి మనసు కరిగిపోయింది.

"సరేలేమ్మా - నేనూ అదే అనుకున్నాను. నేను ప్రాణంపోయినా అబద్ధం చెప్పేవాణ్ణి కాదమ్మా" అన్నాడు.

రుక్మిణమ్మ ముఖం పూర్ణిమ నాటి చంద్రబింబంలాగా ప్రకాశించింది. విమలమ్మ చేతిని దగ్గరికి తీసుకొని, రుక్మిణమ్మ ఏదో మెల్లగా చేతులో పెట్టి, 'వస్తా నాయనా' అని లేచి గుమ్మందాటి చీకట్లో అదృశ్యమయిపోయింది.

విమలమ్మ తన చేతులోఉన్న వస్తువు చూచుకుంది - నూరు రూపాయల కాగితం - మాధవశాస్త్రి విమలమ్మ ఆశ్చర్యంతో ఒకరి ముఖం ఒకరు చూచుకున్నారు.

(ఇంకా వుంది)

మీరు ఎప్పుడు రుచి చూడని చాలా మంచికాఫీ...



స్టేన్స్ ఎఱ్ఱ లేబిల్ ప్యూర్ కాఫీ మీకు కోరిన రుచి, బలము నాణ్యతే గాక ఎన్నో కప్పుల కాఫీకూడ యిచ్చును. ప్రతి ప్యాకేజీపై స్టేన్స్ పేరు చూచి మరీ కొనండి పాటిలేని నాణ్యతకు అదే మీ గ్యారంటీ దాని తాజాదనము చెడకుండా గాలి చొరనట్లు ½ పౌ. 1 పౌ. 3 పౌ 7 పౌ. 14 పౌ & 20 పౌను టిన్నులలో ప్యాక్ చేయబడినది.

నేడే ఒక టిన్ను కొనండి. ఎఱ్ఱలేబిల్ ప్యూర్ కాఫీనే కోరండి.

ది యునైటెడ్ కాఫీ సప్లై కంపెనీ లిమిటెడ్,
కోయంబత్తూరు, దక్షిణ ఇండియా

మహబూబ్ నగర్ ఏజెంట్లు మెసర్సు ఎస్ మల్యాల & సన్సు జనరల్ మర్చెంట్సు. మహబూబ్‌నగర్.
పశ్చిమ గోదావరి డిస్ట్రిబ్యూటర్లు: మెసర్సు శ్రీపాద నరసింహం బ్రదర్సు. జనరల్ మర్చంట్సు. పోస్టు బాక్సు. నెం 10 కాకినాడ (హెడ్‌క్వార్టర్సు) బ్రాంచీలు పాలకొల్లు, ఏలూరు.

Stanes
THE PICK OF THE SOUTH
స్టేన్సు ఎఱ్ఱ లేబిల్ ప్యూర్ కాఫీ
ప్రతి యొక్కరు కొనదగు
చక్కని కాఫీ

అదృష్టహీనులు

జయంతి శ్రీరామమూర్తి

అప్పుడే పెద్దవాన కురిసి వెలిసింది. ఒక గంటసేపు వరుణదేవుడు భూదేవిమీద ఆగ్రహం చేడా అనిపించింది. చెట్లూ చేమలూ నీళ్లతో ఏకమైపోయాయి. కలుగుల్లో దాగివున్న సర్పాలకు తడివల్ల ఇబ్బంది కలిగినా, పైకి రాబోయే కప్పలను తలచుకొని అవి నోరు తడిచేసుకొంటున్నాయి. చెట్ల ఆకులమీది నీటిబిందువులింకా టపటపా రాలుతూ నేవున్నాయి. పడమటి కొండలవైపు పరుగు లంకించుకున్న సూర్యుడు వెనుతిరిగి చూడటంలేదు. ఆ సమయాన వినోదరావు తన బంగళాలో డ్రాయింగు రూములో సోఫామీద కూర్చుని తుపాకీ తుడుచుకుంటున్నాడు. మధ్యమధ్య కిటికీలోంచి గేటువైపు తొంగిచూస్తున్నాడు. ఆయన వేటనిమిత్తం జోథ్‌పురీ సూటు వేసుకుని సిద్ధంగా వున్నాడు. ఆయన బుగ్గలమీది కోరమీసాలు అప్పుడే చాకలివాడు పుతికి మెలి పెట్టిన గుడ్డల్లా మెలు కుని వున్నాయి. వాటి చివర ఆయన రాసుకున్న అగరుసెంటు సువాసనలు కిటికీ అద్దాలు తుడుస్తూన్న రామన్న అనుభవిస్తున్నాడు. అతడు పదేపదే తనకేసి చూస్తూం డడం సహించలేకనో యేమో వినోదరావు "రామన్నా! ఈవేళ నా జోళ్ళు పాలిష్ చెయ్యలేదా?" అన్నాడు.

"చెయ్యకేం బాబయ్యా! రోజూ నా చెయ్యి మొదటిపనదే గదండీ, మరిచిపోతానా?" అన్నాడు రామన్న.

"అయితే, ఇంత చక్కగా వున్నాయేం, నీ మొహంలాగ." అన్నాడు యజమాని ఋూరాకంతంతో.

రామన్న మారుమాటాడక, లోనికి పరుగెత్తి పాలిష్ సామానులు తెచ్చి, వినోదరావు కాళ్లు తనతొడమీద పెట్టుకుని బాగా మెరిసేదాకా జోళ్లు తోమేడు. అంతసేపూ బాగా ఆనందం అనుభవించేడోయేమో, ఆయన కళ్ళుమూసుకుని మీసాలు మెలిపెడుతూ మధ్యమధ్య తనలో తాను నవ్వుకుంటూ, ఆనాడు తాను చంపబోయే మృగాలను తలచుకుంటూ చిటికెలు వేస్తూ వున్నాడు. రామన్న మళ్లీ తనపనిలో నిమగ్నుడయ్యేడు-వినోదరావు కళ్లు తెరచి,—

విశ్వాసరావు రాలేదేం యింకా?" అన్నాడు.

రామన్న ఆత్రంతో చూస్తూ,—

విశ్వాసరావు వస్తారండీ! టీ పెట్టమంటారా?" అన్నాడు

"నీతలకాయ! వాడికి టీ యేమిటిరా? మనకన్న పెద్దవాళ్లకి గాని, చిల్లరవాళ్ళకి టీమాట తల పెట్టవద్దని ఎన్ని సార్లు చెప్పాలి నీకు? నీది మట్టిబుఱ్ఱ" అన్నాడు యజమాని.

"చిత్తం" అన్నాడు పనివాడు.

ఇంతలో బయట తలుపుమీద టక్కుటక్కున యెవరో వేళ్ళతో కొట్టిన శబ్దం కాగా, "కమిన్" అన్నాడు వినోదరావు.

విశ్వాసరావు మెల్లగా లోనికి వచ్చి "నమస్కారం" అన్నాడు.

వినోదరావు చేతి గడియారం చూస్తూ "ఇప్పుడు ఎంత టైం అయింది" అన్నాడు.

విశ్వాసరావు "నాదగ్గర గడియారం లేదండి."


"గడియారం వుంటే మహా కరెక్టుటైముకి వచ్చేటట్టు. తల్లి పుట్టిల్లు మేనమామకి తెలియదా! ఈవేళా నిన్నా కాదు, వచ్చిన నుంచి చూస్తున్నాను మిమ్మల్ని. టైము సెన్సు ఎంతమాత్రమూ లేదు. ఇక ప్రమోషన్ రాలేదని అరచి యేం లాభం!" అని దులిపేసేడు అధికారి.

విశ్వాసరావు వర్షంవల్ల ఆలస్యమైందని చెబుదామనుకున్నాడు కాని, ఎందుకల్లనో అతని కంఠం పని చెయ్యలేదు.

వినోదరావు తుపాకీ చేతిలో మెడలో వేసుకుని లేచేడు. బయటకు వచ్చి, గరేజిలో నుంచి తన మోటారుకారు తీసి, విశ్వాసరావుని వెనక సీటులో ఎక్కించుకుని బయలుదేరేడు. కారు తానే నడుపుతూ, తారు రోడ్డుమీద జారుగా పోనిస్తున్నాడు. విశ్వాసరావు తన అధికారిని చూస్తూ, స్టీరింగ్ చక్రంమీది అతని వేళ్ళమీద దృష్టి నిలిపి తన ఆలోచనలలో తానున్నాడు. నిజానికి ఆ వేళ్లే విశ్వాసరావు జీవితాన్ని కూడా నడిపిస్తున్నవి.

వినోదరావూ, విశ్వాసరావూ ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. ఒకే వయసువాళ్లు. ఒకే చదువుగలవాళ్లు. కాని విశ్వాసరావు వినోదరావుక్రింద పనిచేస్తున్నాడు. అతని జీతం నెలకి రెండు వందలు. అధికారి జీతం దీనికి పదిరెట్లు. అంతమాత్రాన వినోదరావు పదిరెట్లు తెలివిగలవాడనుకోరాదు. నిజానికి ఆఫీసుపని అంతా విశ్వాసరావే చేస్తాడు. కాని మెప్పంతా వినోదరావుకి లభిస్తుంది అది దేశకాల పరిస్థితుల మహిమ. కీలకం యెక్కడుందో తెలియక విశ్వాసరావు యేటేటా తికమక పడుతుంటాడు. తెలుసుకుని వినోదరావు పైకెగబ్రాకి పోతుంటాడు. గడచిన సంవత్సరం ప్రమోషన్ విశ్వాసరావుకి అతి సమీపంలోకి వచ్చింది. కాని వినోదరావు అతని రిపోర్టుమీద ఎఱ్ఱసిరా కురిపించడంవల్ల మళ్ళీ దూరంగా పారిపోయింది. విశ్వాసరావు చాలా బాధపడ్డాడు. కాని ఆ బాధ అధికారి కెందుకు? తనతో అనవసరపు భేదాభిప్రాయాలు పెట్టుకున్నాడు కనక అనుభవించవలసిందే! చిన్న పనివాడికే అంత స్వాభిమానంవుంటే, పెద్ద ఆఫీసరుకి తనకుండదూ?

నిజానికి విశ్వాసరావు చాలా విచారించేడు. తన సంసారం క్షేమాన్ని గురించి అయినా తాను లొంగిపడివుండవలసింది. మనిషి గౌరవానికీ అతని ఆదాయానికీ అవినాభావ సంబంధంవున్న యీరోజుల్లో, తానంత అవివేకంగా ప్రవర్తించేనని తన్ని



డిస్ట్రిబ్యూటర్లు సీతారామ్ జనరల్ స్టోర్సు
(ఏజెన్సీస్,) విజయవాడ -1

లాను తిట్టుకున్నాడు. కాని చేతులు కాలిన పిమ్మట ఆకులు పట్టుకుని యేమి లాభం? అందుకే ఈయేడు మళ్ళీ రికార్డుల సీజను వచ్చింది గనక వినోదరావు ఏం చెబితే అది చేయడానికి సిద్ధపడ్డాడు. అతడు కుందేలుకి మూడే కాళ్లంటే - 'చిత్తం! యింకా కంటేసుమండీ!' అంటాడు. ఆయన 'భూమి గుండ్రంగా లేదం'టే - 'అవ్వే, వుండని యెవరన్నారు? బుద్ధితప్పు' అంటాడు. గత కాలపు అనుభవాలను జీర్ణించుకున్న విశ్వాసరావు ఈ సంవత్సరం అధికారి ప్రాపకాన్ని చాలా మట్టుకు సంపాదించుకున్నాడు. ఈ నెలలో రికార్డులు వస్తాయి, ముందు నెలలో ప్రమోషన్ రావచ్చును! అందుకే ప్రమాదంతో గూడిన పనైనా అప్పుడప్పుడు అధికారితో వేట కూడా వెడుతున్నాడు తోడుగా.

వినోదరావు వేటం టే చెవికోసుకుం



రెక్సోనా ప్రొప్రయిటరీ లిమిటెడ్‌వారి తరపున భారత దేశంలో తయారుచేయబడినది

RP. 131-X52 TL

టాడు. అవసరమైతే అన్నం లేకుండా నెల్లాళ్ళు వుండగలడు, కాని వేటాడందే పదిరోజులు గడవవు. ఏదీ దొరక్కపోతే ఆఖరికి ఒక్క పావురాయైనా పడెయ్యాలి. అంతమాత్రాన ఆయన జాలిలేనివాడనీ అనుకోరాదు. తనతుపాకీ గుండుకి నేలరాలి మరణవేదనతో కొట్టుకొనే జంతువులయెడ, పక్షులయెడ ఆయనకెంతో జాలి. ఏ కొన ప్రాణంవున్నా బ్రతికిద్దామని ప్రయత్నిస్తాడు. ఆమధ్య నొక పొడలదుప్పి గుండు తొడలోనుంచి దూసుకుపోయి పడిపోయింది. వినోదరావు వెంటనే దాన్ని కారులో యెక్కించుకొని, పశువులడాక్టరు వద్దకు తీసుకుపోయి కట్టుకట్టించేడు. దానికి భూమ్మీద నూకలు లేక మూడోనాటికల్లా ఆయన కూరగా మారింది గాని, లేకుంటే ఆయన దాన్నింతో ముద్దుగా పెంచుకుందామనుకున్నాడు.

కారు స్పీడుగా పోతూంది. రోడ్డుపక్కనున్న చెట్లు గబగబా వెనక్కి పరుగెత్తుతున్నాయి. ఆ చెట్లమీది నెంబర్లు చదువుదామని విశ్వాసరావు ప్రయత్నించేడు కాని వీల్లేకపోయింది. ఆపైన రోడ్డు వంకర తిరుగుతోంది. అది సూచించే బోర్డు ఒకటి అతని కంటబడింది. అంతే. ఆ మరుక్షణాన ఏం జరిగిందో అతనికి తెలియదు. అతనికి తెలివి వచ్చి చూచేసరికి ఏమీ బోధపడలేదు శరీరమంతా తిమ్మిరెక్కి పట్టుతప్పినట్టుతోచింది. శరీరంలో యే భాగమైనా లోపించిందేమోనని అంతా కలయచూసుకున్నాడు. అన్నీ సరిగానే వున్నాయి. లేచి నిలబడ్డాడు. కాస్త నడిచేడు. అధికారికోసం కలయజూసేడు. కారు ఒక చెట్టుకంటి పెట్టుకుని తప్పబడిన లేకముద్దలా వుంది. అధికారి కఠోరభూభాగంమీద విగతజీవిలా పడివున్నాడు. ఎన్నో ప్రాణాలను సునాయాసంగా తీసివేసిన తుపాకీ ముక్కముక్కలై ప్రక్కన పడివుంది. విశ్వాసరావు అధికారి ముక్కుదగ్గర చెయ్యిపెట్టి చూసేడు. ఊపిరి ఆడుతోంది. వెంటనే పోయి రోడ్డుప్రక్క పంటకాలువలోనివి ఇన్ని నీళ్లు తెచ్చి మొహాన కొట్టేడు. వినోదరావు తెలివి వచ్చి జాలిగా చూసి లేవబోయి కాలు పట్టుకుని వెనక్కి పడిపోయాడు. విశ్వాసరావు అతని ఎడమకాలి జోధపురీ సూటుగుడ్డ బొత్తాములు విప్పి పైకెత్తేడు. ఒక్కసారిగా హడలిపోయాడు. ఒక ఎముక విరిగి బయటకు పొడుచుకువచ్చింది. వినోదరావు మాటలేకుండా జాలిగా చూస్తున్నాడు. విశ్వాసరావు కేమి చెయ్యడానికీ తోచలేదు. ఇంతలో ఎదురుగా ఒక లారీ వస్తూ ఈ దృశ్యాన్ని చూసి అక్కడ ఆగిపోయింది. విశ్వాసరావూ, లారీడ్రైవరూ కలిసి వినోదరావుని లారీలోకి మోసేరు. సరాసరి అతన్ని జనరల్ ఆసుపత్రిలో చేర్చేరు.

అతనిని ఆఫీసర్ వార్డులో పడుకోబెట్టేరు. ఆ వార్డు నిజానికి ఇంద్రభవనంలా వుంది. గదిలో కుండీలలోవున్న పూలమొక్కలు ఘుమ్మని పరిమళిస్తున్నాయి. కాని, కాలు విరిగిన వినోదరావు నరకంలో వున్నట్లే బాధపడుతున్నాడు. విశ్వాసరావు మొహం మాసి చిన్నపిల్లవానిలా వలవలా యేడుస్తున్నాడు.

"అదే సరిపోతుంది. బెంగపెట్టుకోకండి" అని విశ్వాసరావు ఓదార్చేడు.

"చూడు. చావుబ్రతుకుల అంతరం గరికవాసి లేదు. బ్రతికున్న నాలుగురోజులూ మనంతవాడు లేడనుకుంటాం. మనరోజు తప్పితే ఎంతవాడైనా యింతేగదా?" అన్నాడు యజమాని.

ఆరాత్రే విరిగిన యెముక సర్దేసి కట్టుకట్టేరు. వినోదరావు భార్యవచ్చి భర్తను కంటికి రెప్పలా కాచుకుంటూంది. అధికారిని చూడడానికి జనం తండోపతండాలుగా వచ్చిపోతున్నారు. విశ్వాసరావు ఆరాత్రి తెల్లవార్లూ కంటిమీద కునుకుతీయలేదు. గంటగంటకూ లేచి అధికారిని చూస్తూనే వున్నాడు. అధికారికి సమస్తోపచారాలూ అతడే చెయ్యవలసి వచ్చింది.

మూడోరోజుకి మెల్లగా కాలికి వేసిన ప్లేస్టరు గట్టిపడేసరికి వినోదరావుకి ధైర్యం వచ్చింది. మెల్లగా కూనిరాగాలు ప్రారంభించేడు. షేవు చేయించుకుని మీసాలు దువ్వడం మొదలుపెట్టేడు. విశ్వాసరావు మీద మెల్లగా అధికారం చెలాయించడం ఆరంభించేడు. "వినోదరావు అదృష్టంవల్లనైతేనేమి, విశ్వాసరావు చేసిన ఉపచారాలవల్లనైతేనేమి, మెల్లగా వినోదరావు తేరుకొంటున్నాడు" అనుకొన్నారు ప్రజలు.

ఒకటిన్నరనెల గడిచింది. వినోదరావు మెల్లగా కర్రపట్టుకుని నడుస్తున్నాడు. కారు చెడిపోయిన విచారం ఏమీ లేకుండా ఇన్స్యూరెన్సువాళ్ళు పూర్తిసొమ్ము చెల్లించుకున్నారు. దానితో మళ్ళీ కారుకొందామని వినోదరావు ప్రయత్నం చేస్తున్నాడు. అన్నీ లక్షణంగానే వున్నాయి. సెలవు కూడా పొడిగించి హాయిగా వున్నాడు.

విశ్వాసరావుకి ఎప్పటిలాగా ప్రమోషన్ చేజారి, తనకన్న జూనియరు వ్యక్తి జేబులో పడిపోయింది. కారణం తిరిగి వినోదరావు యిచ్చిన చెడ్డరిపోర్టే నని తెలుసుకుందుకు ఆట్టే సేపు పట్టలేదు. విశ్వాసరావుకి తల కొట్టేసినట్లయింది. నిద్రాహారాలు మాని అధికారికి ఇంత చేసినా కడకు "తివిరి యిసుమున తైలంబు దీయవచ్చు"—అన్నవిధంగా పరిణమించింది. ఇంతకీ చెడ్డరిపోర్టు పొందడానికి తాను చేసిన తప్పేమిటి? ఈ మాట అధికారినే అడుగుదామని ఒక సాయంత్రం బయలుదేరేడు విశ్వాసరావు.

అధికారి యింట్లో అడుగు పెడదామనుకునేసరికి లోపల తననుగురించిన మాటలేవో వినబడడంవల్ల ఆగిపోయేడు.

"విశ్వాసరావు మళ్ళీ రావడం మానేసేడు ఈమధ్య" అని వినోదరావు.

"వస్తారు పాపం మీవిషయంలో ఎంత కష్టపడ్డారో గదా!" ఆయన భార్య కాబోలు.

"కష్టపడకేం జేస్తాడు—నా క్రింద పని చేస్తూ? లేకుంటే నల్లిని నలిపేసినట్లు నలిపెయ్యనూ?"—

విశ్వాసరావు కాళ్లు చల్లబడ్డాయి. తానతనికి మనిషికి మనిషిలా సాయబడ్డాడు కాని, అధికారి అనే భయంచేత కాదు. కాలు విరిగిన రాత్రి వచ్చిన ధర్మ చింతన అంతా ఏమయింది?

"ఏమన్నా పాపం, మీ కాయన చాలా సేవ చేసేడు కాలు విరిగినప్పుడు మిమ్మల్ని అక్కడ వదిలేసి వెళ్లిపోతే మీరేం చేసేవారు?" అన్నది భార్య తిరిగి.

"ఏడిశాడు. అసలీ దురదృష్టమంతా వాడిదే. వాడితో వెళ్లేను గనుకనే నాకీ గతి పట్టింది" వినోదరావు.


విశ్వాసరావు వెనక్కి నడక ప్రారంభించి "అవును. వాడి దురదృష్ట జాతకం. లేకుంటే ఏనాడు నాకు ప్రమోషన్ రావలసినమాట!" అనుకుంటూ యింటికి వెళ్లిపోయేడు.

తిరిగి అతడు వినోదరావు వద్దకు వెళ్ళి తన దురదృష్టాన్ని వ్యాపింపచేయ దలచలేదు. ఇలావుండగా పదిరోజుల అనంతరం ఆఫీసులో అతనికి పిడుగులాంటి వార్త చెవినిపడింది వినోదరావు చనిపోయేడని—కాలు కుళ్ళి త్వరత్వరగా దేహమంతా వ్యాపించడంవల్ల డాక్టర్లు ఏమీ చెయ్యలేకపోయారనీ.

విశ్వాసరావు చాలా విచారించేడు. ఆ పదిరోజులూ అతన్ని దర్శించనందుకు దిగులుపడ్డాడు. ఆనాడు ఆఫీసులో ఎవరి నోట విన్నా ఒక్కటేమాట.

"వినోదరావుకి అంత చిన్న వయసులోనే అంత పెద్ద ఉద్యోగమైంది. కాని దురదృష్టవంతుడు—అనుభవించే యోగం లేదు."

విశ్వాసరావు కేమీ పాలుపోలేదు. ప్రమోషన్ వచ్చినా వినోదరావు అనుభవించలేని దురదృష్టవంతుడు తానా, అనుభవించగలిగినా ప్రమోషన్ రాని దురదృష్టవంతుడు - ఇందులో ఎవరెక్కువ దురదృష్టవంతుడు ?? ★



వికలాంగులకు విద్యాబోధ

ఇల్లిందల సరస్వతీదేవి

వికలాంగులకు విద్యాబోధన వ్యవహారాలను పరిశీలించటానికి భారత ప్రభుత్వము ఒక జాతీయ సలహాసంఘాన్ని నియమించింది. ఈ సంఘనిర్ణయము ననుసరించి రెండవ పంచవర్ష ప్రణాళికలో వికలాంగులకు విద్యాసౌకర్యాలు కల్పించబడనున్నాయి.

పాశ్చాత్యదేశాలలోని విద్యావేత్తలు, విద్యాశాఖాధికారులు, అనుభవజ్ఞులైన వైద్యులు, ప్రత్యేక విద్యావిధానావసరము గల బిడ్డలను అయిదు తరగతులుగా విభజించారు. 1 అంధులు, 2 మూకబధిరులు, 3 శారీరకమైన అంగవైకల్యము గలవారు, 4 మూర్ఛరోగులు, 5 మానసికముగా వెనుకబడినవారు. వీరందరినీ మొత్తముగా వికలాంగుల శాఖలోచేర్చి, విద్యగరపటానికి పాశ్చాత్యదేశాలు చాలాకాలము కృషిచేసి కొన్ని విధానాలను కనిపెట్టాయి.


1893 లో మూకబధిరాంధులకు విద్యాసౌకర్యాలను కల్పించటానికి ఇంగ్లండు దేశములో చట్టము చేయబడ్డది. అంతవరకూ ఆ బిడ్డలకు ఏవిధమయిన విద్యాసౌకర్యమూ అనువుగా లభించలేదు. ఆచట్టము ప్రకారము విద్యాశాఖాధికారులు వారికి తగిన విద్యాసౌకర్యాలను చేయవలసినవారైనారు. 16 సంవత్సరాలవరకూ ఈ బిడ్డలకు నిర్బంధోచిత విద్య అమలుపరచటమువల్ల తలిదండ్రులకు వీరి భారము అంతగా ఉండదు.

అంధులలో గ్రుడ్డితనము రెండు రకాలు. మొదటి రకము పూర్తి గ్రుడ్డితనము. రెండవది అల్పదృష్టి లేక దృష్టిమాంద్యము.

పూర్తి గ్రుడ్డితనముగల బిడ్డలకు ప్రత్యేకమైన పరికరాలతో, ప్రత్యేకమైన లిపిలో (బ్రెయిల్) విద్యను గరపవలసి ఉంటుంది. (దీనినిగురించిన వివరాలు 1955 ఫిబ్రవరి మాసాంతమున 'మూకబధిరాంధుల జీవితాలలో వెలుగుబాటలు' అను శీర్షికలో ఆంధ్ర సచిత్రవారపత్రికలో ప్రకటింపబడిన వ్యాసములో వ్రాశాను.)

దృష్టిమాంద్యముగల బిడ్డలకు అంధులకువలె ప్రత్యేక లిపిలో (బ్రెయిల్) విద్యగరపే పాఠశాలల అవసరము ఉండదు. కాని సాధారణ పాఠశాలలలో ఉండే వసతులు చాలవు. కనుక ఈ బిడ్డలకు కొద్ది మార్పులతో, ప్రత్యేక విద్యావిధానములో విద్య గరపవలెనని 1939 లో ఆంగ్లదేశపు విద్యాశాఖ నిర్ణయించింది. ఇటువంటివి రెండు పాఠశాలలు గ్రీనిచిలో ఒకటి, మాంచెస్టరులో ఒకటి స్థాపింపబడ్డాయి. ఈ పాఠశాలలు మామూలు పాఠశాలలకు అనుబంధముగా ఉండవచ్చునని నిర్ణయింపబడ్డది. ఈ బిడ్డలకు అనుకూలమయిన విధముగా, కంటికి ఎక్కువ శ్రమ కలుగకుండా పూర్తి విద్య గరపే విధానము ఏర్పాటు చేయబడ్డది. ఈ బిడ్డలకు వ్రాయటానికి చదవటానికి సామాన్యముగా అన్నిచోట్ల ఉండే ఏర్పాట్లుచాలవు. పెద్ద అక్షరాలుగల పుస్తకాలను వారి కందించటమే కాకుండా, వ్రాయటమూ, చదవటమూ విద్యాకార్యక్రమములో తగ్గించటానికి నిశ్చయించారు. చదివేటప్పుడు ప్రత్యేకమైన అద్దము వాడినట్లయితే కంటికి, ఎక్కువశ్రమ లేకుండా చదవగలుగుతారు. ఫ్రేము చేయబడిన అద్దాన్ని చేతితో కంటికి దగ్గరగా పట్టుకొని బిడ్డలు చదవవచ్చు; లేక అటువంటి అద్దాలజోడు కంటికి అమర్చవచ్చు. ఇటువంటి అసాధారణ పరిస్థితులుగల బిడ్డలకు భవిష్యజ్జీవితములో జీవనాధారముగా ఉపయోగపడే వృత్తి విద్యలను గరపవలెనని నిశ్చయించారు. ఈవిధముగా ఆ బిడ్డలు తమకు అనుకూలమయిన వృత్తులలో ప్రవేశించునట్లూ, ఆ వృత్తుల కనువైన వ్యాపారజ్ఞానము పొందేటట్లూ, శిక్షణనివ్వటానికి ఆ పాఠశాలలు పూనుకొన్నాయి. ఈ ప్రత్యేక పాఠశాలలు వగైరా

(30-వ పేజీ చూడండి)



పోర్‌బందరులో బాపూ జన్మమందిర సింహద్వారము
ఫోటో : రాఘవాచార్య—శిఖ్నార్.



(గుండిమెడ వెంకటసుబ్బారావుగారు రచించిన తైలవర్ణ చిత్రానికి ఫొటో).

గాంధీ మహాత్ముని

జయంతి - 1955 అక్టోబరు 2.

★ వికలాంగులకు విద్యాబోధ ★

వేళ, - ఆరుబయట నడిపితే ఆరోగ్య దృష్ట్యా బిడ్డలకు మంచిదని నిర్ణయించారు. ఈ పాఠశాలలలోని విద్యార్థులను వారానికి మూడు పర్యాయములు వైద్యుడు పరీక్షించుతూ ఉండాలి. దృష్టిమాంద్యము అధికము కాకుండా చూడాలి. అద్దముల ఉపయోగాలను ఎప్పటికప్పుడు నిర్ణయించుతూ ఉండాలి. అవసరాలనుబట్టి మారుస్తూ ఉండాలి.

మూకబధిర లక్షణాలు సాధారణముగా కలిసే ఉంటాయి. మూగవారికి చెవుడు ఉండితీరుతుంది; కాని చెవిటివారికి మూగతనము లేకపోవటము కూడా ఉన్నది. (వీరి విద్యాబోధనలను గురించిన వివరాలు గత ఫిబ్రవరిలో ప్రచురింపబడిన వ్యాసములో ఉన్నాయి.) "మూక బధిరాంధులకు ఒక పాఠశాలలోనే ప్రత్యేక విద్యా సౌకర్యాలతో విద్య గరపటమువల్ల ఆ రెండు రకాలకూ మేలుకలుగదు. విడివిడిగా పాఠశాలలు ఉండవలసినదే"నని డాక్టరు హెలెన్ కెల్లరు, హైదరాబాదులో ఉన్న మూకబధిరాంధ పాఠశాలను దర్శించినప్పుడు తన అభిప్రాయాన్ని వెలిబుచ్చింది.

శారీరకమైన అంగవైకల్యముగల బిడ్డలను మూడు తరగతులుగా విభజింపవచ్చు. 1. ప్రత్యేకమైన లోపము ఏదీ లేకుండానే బలము తక్కువగా ఉన్న బిడ్డలు. 2 అంగవైకల్యము కలవారు. 3. వ్యాధి పీడితులు (క్షయ, వాతసంబంధమైన గుండెజబ్బు, పక్షవాతము మొదలైన వ్యాధులుకలవారు) వీరిలో ప్రతి తరగతివారికీ ప్రత్యేక ఉపచారమూ, ప్రత్యేక విద్యాబోధనా కావలసినవే.

పేర్కొనతగిన ఏ వ్యాధీ లేకపోయినా, బలహీనముగా ఉన్న పిల్లల ఆరోగ్యాభివృద్ధికొరకు ఆరుబయట పాఠశాలలు ఏర్పడ్డాయి. ఇవి సామాన్యముగా ఇతర పాఠశాలలవలెనే పగటి వేళ నడపబడుతాయి. పరిశుభ్రమైనగాలి, సూర్యరశ్మి ఆరోగ్యాన్ని చేకూర్చగలుగుతాయి. ఆరుబయట కాకపోయినా పంచలవంటి సౌకర్యాలు కలిగి ఉండటము మంచిది. బలహీనముగా ఉన్న బిడ్డలకు శారీరకమైన పుష్టిని కలిగిస్తూ విద్యాబోధ చేయటానికి ఆరుబయటపాఠశాలలు తోడ్పడుతాయి. రక్తము పలచబడి బలహీనులైనవారు, అంటువ్యాధులకు లోనై తిరిగి కోలుకొననివారు, ఆహారపుష్టి లేకపోవటముచేత బలహీనముగా ఉన్నవారు, క్షయరోగులు ఉన్న వైద్యాలయమునుండి వచ్చిన సామాన్యరోగులు ఈ పాఠశాలలలో చేర్చతగినవారు. ఆరుబయటి పాఠశాలలు ఊరిబయట ఉంటేనే వాస్తవముగా లాభకరము. బిడ్డల రాకపోకలకు ప్రత్యేకమైన ఏర్పాట్లు అవసరము. ఇటువంటి పాఠశాలలకు బస్సులు ఉండటమువల్ల పిల్లలకు వీలుగా ఉంటుంది. బిడ్డలు ఉదయమునుండి సాయంత్రమువరకు పాఠశాలలలో ఉండవలసినవారు కనుక, వారికి మూడుపూటలా ఆహారము యిచ్చే ఏర్పాట్లు పాఠశాలలలోనే జరగాలి. మధ్యాహ్నపు వేళ నిద్రకు తగినవసతులను కల్పించాలి. ఈ పాఠశాలలలో ఉపాధ్యాయులు విద్యకు సంబంధించిన కార్యక్రమము నిర్వహిస్తారు; నర్సులు ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమము నెరవేరుస్తారు. పాఠశాలకొరకు ప్రత్యేకింపబడిన వైద్యుడు వారానికి రెండు లేక మూడుపర్యాయములు వచ్చి, పిల్లల స్థితిగతులను గమనిస్తాడు. అవసరమయిన వైద్యోపచారాలు బిడ్డలకు అదనుకు లభిస్తాయి. ఇటువంటి పాఠశాలలలో ఉన్న బిడ్డలు యథాస్థితికి రావటానికి 6 నెలల కాలము పట్టుతుంది.

శారీరకముగా అంగవైకల్యముగల బిడ్డలకు వ్యాధులవల్లగాని పుట్టుకతోగాని ఆ లోపము కలుగుతుంది. ఇటువంటివారు సాధారణ పాఠశాలలద్వారా విద్యార్జన చేయలేరు. వీరికి సాధారణ పాఠశాలల విద్యాకార్యక్రమమునే ఏర్పరచవచ్చు. కాని ఈ పాఠశాలకు వసతిగృహాల ఏర్పాట్లు ఉండటము అనుకూలము. రాకపోకలకు బస్సు ఏర్పాట్లు కూడా ఉండవలసి ఉంటుంది. పాఠశాలా కార్యక్రమములో వృత్తివిద్యలను చేర్చటము ముఖ్యము. ఈ ఏర్పాటువలన బిడ్డలు వారి దేహపరిస్థితుల ననుసరించి వృత్తులలో స్థిరపడటానికి అవకాశము కలుగుతుంది. ఈ విద్యార్థులకు విద్యాబోధనతోపాటు ఔషధోపచారాలకు తగిన సౌకర్యాలు పాఠశాలలలోనే ఏర్పడాలి. మర్దనము (*Massage*) ఆసనాలు, శరీరవ్యాయామము మొదలైన సాధనలకు అవకాశము కల్పింపబడాలి. కృత్రిమావయవాలుగాని, నడకకు సహకరించే సాధనాలుగాని పాఠశాలల వైద్యుల సలహాల ననుసరించి వాడాలి. ఈ పాఠశాలలలో 16 వ సంవత్సరమువరకూ ఉండి విద్యాలాభము పొందిన బిడ్డలు స్వయంపోషక శక్తిని సంపాదించగలుగుతారు.

మూర్ఛరోగులకు (సొమ్మవ్యాధి) విద్యాబోధన కష్టమైన పని. వీరిలో రెండురకాలవారు ఉంటారు. 1. ఉన్మాదసంబంధమైనది. 2. మూర్ఛ సూచనమాత్రముగా కనబడి తగ్గుతూఉండేది.

ఉన్మాదసంబంధమైన మూర్ఛరోగము: ఇది కౌమారదశ దాటిన తరువాత రాదని చాలామంది అనుకొనేవారు. ఈ రోగ చికిత్సలో అనుభవము గడించిన డాక్టరు నట్రాస్ (*Dr. Nattrass*) ఒక వైద్యపత్రికలో ఈవిధముగా వ్రాశాడు.

"నాదగ్గరకు వచ్చిన 602 మూర్ఛ రోగులలో నూటికి 47 వంతున 20 వ ఏటను, నూటికి 25 వంతున 30 వ ఏటను మూర్ఛల


కేశవర్ధని తో
కేశాలను వృద్ధి చేసుకోండి
చుండును పోగొట్టండి.
ఇక తలలో
దురద ఎందుకుండాలి!
వెంట్రుకలు


ఎందుకు రాలిపోవాలి? పసితనంలో నెరియుట
మాన్పండి. నెరియుటం ఆలస్యం కానివ్వండి.
కేశవర్ధనితో కేశాలకు పునర్జీవంపోసి, అందం చేకూర్చండి
షాంపూ వాడి కేశ శుభ్రత, సువాసన పొందండి.
కేశవర్ధని అ. 14, షాంపూ అ. 14. పోస్టేజి అదనం. అన్నిచోట్ల లభించును.
కేశవర్ధని ప్రాడక్ట్సు, కోయంబత్తూరు.
No. 3
నేషనల్ పేర్సు & పర్ఫ్యూమ్స్ (వదరక్) లిమిటెడ్. ఐకింగ్‌హాంపేట, బెజవాడ



1955 అగస్టు 15 వ తేదీన 300 మంది బీదలకు అన్నదానం, వస్త్రదానం చేసిన విశాఖపట్నం, ఆకెళ్ళ సూర్యనారాయణ మహిళాభవన సభ్యులు.

వ్యాధి వచ్చినది. ఈ వ్యాధి పలభయి సంవత్సరాలకు పైబడినవారికి కూడా వస్తూ ఉంటుంది." ఈ వ్యాధికి స్త్రీ పురుష భేదమూ లేదు—అనువంశికముగా సంక్రమించేదీ కాదు. మూర్ఛలలో పెద్దరకము ఒకటి, చిన్నరకము ఒకటి—రెండురకాలు ఉన్నాయి. కొంతమందికి ఈ రెండురకాల వ్యాధి ఉండవచ్చు. నిర్వ్యక్షపారము వల్లను, స్వభావములో గాని, పరిస్థితులలో గాని తొందరపాటు కలిగినందువల్లను మూర్ఛలు వెంటవెంట వస్తూఉంటాయి. ఇవి రోజులవారగా గాని, వారాలు లేక నెలల వారగా వస్తూఉంటాయి. వ్యాధితత్వాన్ని గమనించి, ఆ మధ్యకాలములో గుణము నివ్వగల శక్తివంతమైన ఔషధాలు వాడవలసి ఉంటుంది. మూర్ఛరోగులలో కొందరు ఆకస్మిక సంఘటనలవల్ల మూర్ఛపోతారు. పిడుగుపాటు, ఉరుములు మత్తు కలిగించే ఘాటైన వాసనలకు కూడా మూర్ఛలు వస్తాయి. నరాలు కండరాలు ఆకస్మికముగా ముడుచుకొని పోతాయి. కొందరికి ఈసందర్భములో పోయిన స్మృతి తిరిగి రాదు. పాఠశాలా వైద్యులు ఈ బిడ్డలదైనిక జీవితాలను అతిసూక్ష్మముగా కనిపెట్టవలసి ఉంటుంది. ఈబిడ్డలను క్రీడలలో - ఈత కొట్టటము, చెట్లు ఎక్కటము, మొదలైన పనులను చేయనివ్వకూడదు. పెరిగి పెద్దవారైనతరవాతకూడ కాయనడపనివ్వకూడదు. ఈ బిడ్డలకు విద్యావిధానము, కార్యక్రమము ప్రత్యేకముగా ఉండటము వారికి క్షేమకరమూ అభివృద్ధికరమూను. మూర్ఛరోగుల మేధశక్తి చురుకుదనములో ఇతర విద్యార్థులకంటె తక్కువ రకముగా ఉంటుందని వైద్యుల నిర్ణయము. కనుక విద్యావిధానము కూడా నిదానమైనదిగానే ఉండాలి. మన వైద్య శాస్త్రజ్ఞులు ఈ బిడ్డలను ఇతర విద్యార్థులతో కలిపి విద్యాబోధ చేయటానికి అనుకూలాభిప్రాయము వ్యక్తపరచలేదు. ఈ కారణముచేత కూడా ప్రత్యేక పాఠశాలలు అవసరము.

మూర్ఛరోగుల పాఠశాలలలో మామూలు పాఠ్యక్రమముతోపాటు పాకశాస్త్రము, బట్టలను ఉతికి ఇస్త్రీచేయుట, రంగులు వేయుట, కుట్టుపని, నేతపని, బొమ్మలను చేయుట, వడ్రంగము, తోటపని, మొదలైన వాటిలో శిక్షణనివ్వటము పాశ్చాత్య దేశాలలో ఆచారమయినది. గృహ సంబంధమయిన విజ్ఞానము కూడా పాఠ్యక్రమములో చేర్చవచ్చు. మూర్ఛరోగులకు స్వభావములో సాధారణముగా, దుడుకుతనము, మూర్ఖపు పట్టుదల ఉంటాయి. చేతికందిన వస్తువులను పగులకొట్టటము, పాడుచేయటము, అడ్డగించినవారిని కొట్టటము సామాన్య లక్షణాలు. వికలాంగులందరిలో మూర్ఛరోగుల స్థితి చాలా జాలికరమైనది. వీరికి

బహుమతి రు. 500
(గవర్నమెంటు రిజిస్టర్డు)

తెల్ల వెండ్రుకలను పోగొట్టును

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము మాసువాసనగల "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60 సం॥ల వయస్సువరకు వెండ్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపక శక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 3-8-0; 3 సీసాలు రు. 9-0-0 సగము నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు. 12/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/- లు. ఇది పనిచేయదని నిరూపించిన రు. 500/-

GENERAL LABORATARIES,
(H. O) P O Rajdhanwar (H. Bagh)

★ వికలాంగులకు విద్యాబోధ ★

ఆత్మగౌరవము ఆత్మవిశ్వాసము పెంపొందించే మార్గాలను ఉపాధ్యాయులు అవలంబిస్తూ ఉండాలి. వీరికి విద్యార్థులతో కూడిన ఉల్లాసకరమైన జీవితము పాఠశాల తరగతులలోను, వసతి గృహాలలోను కలిగించటమే వ్యాధి నివారణోపాయము.

మూర్ఛరోగులు సాంఘిక ప్రయోజనాలకు యోగ్యులు కారని ఒక నమ్మకము ప్రజలలో సామాన్యముగా ఉంటుంది. వీరికి వివాహాలు కూడదని కొందరు నమ్ముతారు. కాని, స్త్రీరోగులలో చాలమందికి గర్భధారణమువల్ల ఈ వ్యాధి నెమ్మదించినదని వైద్యులు వ్యక్తముచేశారు. మూర్ఛవ్యాధి తల్లినుండి బిడ్డకు సంక్రమించటము అరుదు. రోగులనుబట్టి, రోగలక్షణాలనుబట్టి వైద్యులు నిర్ణయించిన ప్రకారము వివాహము చేయుటము మంచిది.

మానసికముగా వెనుకబడిన బిడ్డలు: వీరిని ఉన్మాదులనీ, వీరికి విద్య గరపటానికి అవకాశము లేదనీ భావించే ప్రమాదమున్నది. గ్రహణశక్తిలో వెనుకబడినవారుగా మాత్రమే వీరిని పరిగణించాలి. సామాన్య పాఠశాలలలో ఇతర విద్యార్థులతో చేర్చి విద్యాబోధన చేయటానికి ఈ బిడ్డల పరిస్థితులు అనుకూలించవు. ప్రత్యేక పాఠశాలలలో, వీరికి విద్యాబోధ చేయటానికి సాధ్యమైనన్ని సాధనలు ఉపయోగించవలసి ఉంటుంది. ఈ బిడ్డల మానసిక పరిస్థితులలో తరతమభేదాల ననుసరించి పాఠ్యక్రమము ఏర్పడవలసి ఉంటుంది. వీరిలో కొందరికి కేవలము చేతిపనులు మాత్రమే అభ్యసించగలశక్తి ఉంటుంది. ఈ నిర్ణయాలన్నీ వైద్యులు విద్యాశాఖాధికారులు సమాలోచించి చేయవలసినవి.

కొందరు బిడ్డలు క్షయ పక్షవాతము మొదలైన దీర్ఘవ్యాధులచేత పీడించబడుతూ ఉంటారు. వీరికి వైద్యోపచారాలు ప్రతిక్షణమూ అవసరమయే పరిస్థితులు కలుగుతూ ఉంటాయి. ఇటువంటి బిడ్డలను వైద్యాలయాలలో చేర్చి అక్కడే తగిన విద్యాబోధన చేయవలసి ఉంటుంది: పాశ్చాత్యదేశాలలో వైద్యాలయాలకు అనుబంధముగా కొన్ని పాఠశాలలు (*Hospital Schools*) ఏర్పడ్డాయి. ఈ బిడ్డలకు వైద్యుల సలహాల ననుసరించి విద్యావిధానము రూపొందించవలసి ఉంటుంది. వీరికి పాఠ్యక్రమములో చదవవలసిన భాగముకంటె శ్రవ్యదృశ్య భాగములు చేర్చినట్లయితే సులభముగా ఉంటుంది. దీనికి సాధనలుగా రేడియో కార్యక్రమాలు విజ్ఞానకరమైన చలనచిత్ర ప్రదర్శనాలు ఈ బిడ్డలకు తరచుగా ఏర్పాటుచేయాలి.

వికలాంగుల ప్రత్యేక పాఠశాలలలో నియమింపబడే ఉపాధ్యాయులకు మనస్తత్వ సంబంధమయిన విజ్ఞానముతో కూడిన ప్రత్యేక శిక్షణ అవసరము. వీరు సాధించబోయే ప్రయోజనాన్నిబట్టి వేతనాలుకూడా ప్రోత్సాహకరముగా ఉండటము ఈ సందర్భములో ముఖ్యమైనదిగా భావించాలి.

వికలాంగులకు ఏర్పడే ప్రతి ప్రత్యేక పాఠశాలకూ వసతిగృహ సౌకర్యాలను విధిగా కల్పించవలసినదే. ప్రతి గ్రామములోను ఒక పాఠశాల ఏర్పడటము అసాధ్యము కనుక గ్రామాలనుండి వచ్చే బిడ్డలకు ఈ సౌకర్యాలు కల్పింపబడాలి. వికలాంగుల చట్ట నియమావళి ప్రకారము ప్రతి తరగతిలోను 20 మంది విద్యార్థులకంటె ఎక్కువగా ఉండరాదు; ఉపాధ్యాయులకు పరిపాలనా సౌకర్యము ఉండదు. దీనిని దృష్టియందుంచుకొని 15 మంది విద్యార్థుల కొక ఉపాధ్యాయుడి వంతున నియామకము చేయాలి. ప్రతి పాఠశాలకూ బిడ్డలకు ఉపయోగకరమైన ఉత్తమ గ్రంథాలయమూ, దానికి శిక్షణపొందిన గ్రంథపాలకుడూ అనుబంధముగా ఉండాలి. చలనచిత్ర ప్రదర్శనాలతోపాటు నాటక ప్రదర్శనాలు ఉత్సాహముతో హృదయాకర్షకముగా నూతనాంశాలను గురించి ప్రసంగించగల వారిచేత ఉపన్యాసాలు అప్పుడప్పుడు ఏర్పాటు చేస్తూ ఉండాలి.

ఎక్కడ బాలబాలికలకు విడివిడిగా పాఠశాలలు ఏర్పడటానికి సాధ్యముకాదో అక్కడ పురుషులతోపాటు స్త్రీలనుకూడ సమాన సంఖ్యలో ఉపాధ్యాయులుగా నియమించటము సముంజసమని విద్యావేత్తలు, మనస్తత్వ శాస్త్రజ్ఞులు మామూలు పాఠశాలల విషయములో తమ అభిప్రాయాలను వ్యక్తీకరించారు. ఆ సూచనలను ఈ పాఠశాలల విషయములో కూడా వర్తింపచేసుకోవలసి ఉంటుంది.

మొత్తముమీద మనదేశములో స్థాపించబడబోయే ఈ రకమైన పాఠశాలలు అంగవైకల్యముతో బాధపడుతూ ప్రాపంచిక సుఖాలకు దూరమై, జీవచ్ఛవాలవలె బ్రతుకుతున్నవారికి వెలుగు బాటలను నిర్మించి వారి జీవితవికాసానికి దోహదమివ్వగలిగినవిగా ఉండాలి. ★

ఏం, తలనొప్పి
కొనుటకు వెడుతున్నారా?

సారిడన్
నొప్పిని పోగొట్టును
ఒక బిళ్ల 2 అణాలు



సర్వ గర్భాశయ వ్యాధులను
పూర్తిగా పోగొట్టి ఆరోగ్యమును
సంతానమును కలుగజేయును అన్ని
చోట్లదొరకును సీసా రు. 2/8
కృష్ణా లేబరేటరీ, బెజవాడ

వనితాలోకం :

విధి ప్రతికూలమయితే

మధిర భానుమూర్తి

ఎంత మరిచిపోదామన్నా మరిచిపోలేకుండా ఉంది సరస్వతి ఎక్కడ నుంచున్నా, ఎక్కడ కూచున్నా, ఏం తింటున్నా ఏ పని చేస్తున్నా రావే కనిపిస్తున్నాడు కంటికి. రావు చనిపోవటం, అంత్యక్రియలు జరగటం, ఆ నాడు తనకి ప్రపంచంలో ఇక ఏ పట్టుకొమ్మ లేదని పెద్ద బాధ రావటం...ఇవన్నీ తను ఎరిగున్న విషయాలే అయినా రావుని గురించి ఆలోచన వచ్చినప్పుడల్లా రావు మరణం అబద్ధమేమో నన్నంత ప్రత్యక్షంగా రావు తనకి కనిపిస్తున్నాడు. తనతో మాట్లాడుతున్నాడు. "అమ్మా!" అని ఆప్యాయంగా పిలుస్తున్నాడు. ఇవన్నీ తను కాదనలేదు. కాని ఆ మాట ఎవరికేనా చెప్తే మాత్రం వాళ్లు నమ్మరు. ఇదంతా భ్రమ అంటారు. నిజముగా వాళ్లకెవరికీ రావు కనిపించకపోవటంవల్ల అలా అంటారో, లేక తనను ఓదార్చటానికి అలా అంటారో ఇప్పటికీ తనకి అర్థం కాదు. కాకపోతే ఏమిటి?.. వాడు చదువుకునే గది తలుపు మొన్న తీసే సరికి వాడు కుర్చీలో కూచుని చదువుకుంటున్నాడు తను తలుపు తీసిన అలికిడికి తనవైపు తిరిగి 'ఏం అమ్మా?—ఇలా వచ్చావు?' అని అడిగాడు 'నువ్వు ఇక్కడున్నావా' అంటూ తను ముందుకు వెళ్ళింది కుర్చీ దగ్గరకి తను వెళ్లేసరికి అక్కడ లేడు..అంతలో ఎక్కడికి వెళ్లాడో!...

ఈ మధ్యన ఎప్పుడూ అలాగే చేస్తున్నాడు. కనిపించినట్టే కనిపించటమూ, తీరా దగ్గరకి వెడితే అక్కడ ఉండకపోవటమూ. తనమీద ఏమైనా కోపం వచ్చిందేమో! ..అయినా కోపం ఎందుకు? తను వాడికి కోపం వచ్చే పని ఏదైనా చేసిందా అంటే ఏమీ లేదు. ఈ మాట ఆయన్ని అడిగితే "ఇంకెక్కడి రావే!...వాడు మనని విడిచిపోయి నెల అవుతూంటేను?. .నీకేమైనా పిచ్చెక్కిందా?" అన్నారు. పైకి ఈ మాటలు మొండి ధైర్యంతో అన్నా గాని ఆయనకీ లోపల బెంగ లేకపోలేదు. ఆ మాట ఆయన అన్నాక తనకి జ్ఞాపకం వచ్చేది, నెల రోజుల నాడు రావు పోయాడన్న సంగతి

అవాళ ఆ మాటలు విని తను కొయ్యబారిపోయింది. చెట్టంత కొడుకు. చేతికంది వచ్చాడు. ఏదో వాడి మానాన వాడు బ్రతకటమే కాకుండా ఇంటిల్లపాదినీ పోషించే స్తోమతు సంపాదించాడు...చాలా తెలివైన వాడు. చదువుకునే రోజుల్లో తన తెలివితేటలవల్ల ఉపాధ్యాయులను మురిపించి స్కాలరుషిప్పు సంపాదించుకున్నాడు. వాడికి మంచి భవిష్యత్తు ఉందని అందరూ అన్నారు. దానికి తార్కాణంగా వాడికి మొన్ననే మూడు వందల రూపాయల జీతం వచ్చే ఉద్యోగమయింది పైగా వాడొక్కడే మగపిల్లవాడు. వాడి తరువాత వరసగా నలుగురూ ఆడపిల్లలే ఇంట్లో తండ్రి తరవాత తండ్రి అంతటివాడు. అలాంటి వాడు పోయాడంటే బాధే!... అందులోనూ ఎన్నడూ రెండు లంఖణాలైనా చేసి ఎరుగని వాడు, అకస్మాత్తుగా పోయాడంటే ఆ బాధ మరింత ఎక్కువగా ఉండటం సహజమే! పైగా తను ఆ రోజునే ఊరు వెళ్లటం వల్ల మరింత ఎక్కువైంది తన బాధ. పోయే సమయానికి దగ్గర లేకపోయానుగదా అని ఎంతో విలపించింది. ఏమిటో అలా అనుకోవటమే గాని ఉండిమాత్రం తనేం చెయ్యగలదు? ..పోయేవాడిని ఆపగలదా! ...ఆ శక్తి లేదుగా మనుష్యులకి...కాని అలా అనిపించదు. తనే దగ్గర ఉండిఉంటే ఉపచారాలు జాగ్రత్తగా చేస్తూ, ఏ వేళ ఏం కావాలో కనిపెట్టుకుని చూస్తూ కాలక్షేపం చేసును కాని అలా జరగలేదు. అందుకే విచారిస్తుంది సరిగ్గా ఆరోజే ఊరు వెళ్ళినందుకు తనని తను ఎన్నిసార్లో తిట్టుకుంది ..

తను ఇలా అనుకుంటూంది గాని ఆయన దగ్గరే ఉన్నారుగదా! .....ఆయన ఏం చెయ్యగలిగారు...ఆయనకుమాత్రం వాడిని బ్రతికించుకోవాలని ఆశ లేదా?... వాడు తన కంటే ఆయనకి అంతేగా?...ఆమాటకి వస్తే తనకన్న ఆయనే వాడిని గారాబంగా చూసేవారు కోపం వస్తే తను కొట్టేది అప్పుడప్పుడు కాని ఆయన మాత్రం ఎప్పుడూ వాడిమీద చెయ్యి చేసుకోలేదు...

అక్కడికీ చేతనయినంతవరకు ఆయన ప్రయత్నించారట ఊళ్ళో ఉన్న పెద్దపెద్ద డాక్టర్ల నందరినీ పిలిపించారట. ఆ ఒక్క రోజూ వైద్యానికి అయిదారు వందలు ఖర్చు చేశారట. ఎంత ఖర్చయినా గాని లెక్క లేకుండా చెయ్యగలిగారు గాని, ఆయన వాడికి ప్రాణాన్ని పొయ్యగలిగారా?... అంత పలుకుబడి, డబ్బు ఉండి ఆయనే చెయ్యలేని పని తను ఎలా చెయ్యగలదు?.. నిజానికి తను అవాళ దగ్గరఉంటే వాడి స్థితి చూసి తను పెట్టే ఏడుపులు పెడబొబ్బలతోటి ఆయనకి బొత్తిగా ధైర్యంపోయి కాళ్లు చేతులు ఆడకపోను. అంతవరకు అది మెరుగు! కాని తన బెంగ ఎలాపోతుంది?...పదినెలలు మోసి కని వాడిని పెంచేందుకని రోజులు, నెలలు, సంవత్సరాలు లెక్క చెయ్యకుండా కష్టపడి చివరకి వచ్చేసరికి, ఆ సమయానికి, తను లేకపోవటం తనకి బాధ కాదూ? ...ఆ బాధ వల్లే తనే ఉండి ఉంటే?' అనిపిస్తుంది; తనుఉండి చేసేదేమీ లేకపోయినా. ఇంతకీ వాడికీ తనకీ అంతటితో ఋణం తీరిపోయింది. కాకపోతే ఏమిటి?...

ఆ రోజున తనని చూట్టానికి వచ్చినవాళ్ళంతా అదే మాటన్నారు. "ఏం చేస్తాం?.. వాడికి అంతటితో సరిపోయింది... ఇదేం మన చేతుల్లో పనా? ..ఏడవకు...గుండె రాయి చేసుకోవాలి..." అంది సుబ్బమ్మ.

"కాదటమ్మా!...బాధ ఉంటుంది... సహజం...కన్న కడుపా మరొకటా!... చూసేవాళ్ళకి మనకే ఇలా ఉంటే అనుభవికి ఉండటానికేం?..... ఇంతకీ అంతే పెట్టి పుట్టింది...లేకపోతే రత్నంలాంటివాడు - వాడికి చావేమిటి...చెప్పండి?" అంది లలితమ్మ.

"అంతే మరి!...ఏడిస్తే మాత్రం మళ్ళీ వస్తాడా?. ఏం చేస్తాం? ఆ భగవంతుడికి దయ లేకపోయింది. నిక్షేపంలాంటి వాడిని తీసుకుపోయాడు" అంది సూర్యకాంతం.

"ఏమనుకుంటే ఏం లాభం?...రారాని కష్టం వచ్చింది...కుటుంబం అంతా వాడిమీదే ఆశలు పెట్టుకు బ్రతుకుతుంటే వాళ్లందరినీ వదిలేసి తన త్రోవని తను వెళ్ళిపోయాడు .." అంటూ తన చీరకొంగుతో కళ్లు ఒకసారి తుడుచుకుంది మంగమ్మ.

"నువ్వే ఇలాగ బెంగ పెట్టుకుంటే ఇంక ముసలాయన- ఆయన మరి ఇదయిపోతాడు. ...కాస్త ధైర్యం చెప్తూ ఆయనకీ పిల్లలు మాకు ఎలా ఇదయిపోతున్నారో! ..." అని సలహా యిచ్చి వెళ్లిపోయింది వెంకాయమ్మగారు

ఇలాగ అందరూ తలొకసారి వచ్చి ఏదో వేదాంత ధోరణిలో మాట్లాడి వెళ్ళిపోయేవారు. అంతా ఖర్మ అని; కాలం సమీపించబట్టిగాని లేకపోతే వాడు పోవటం అన్నది అసంభవం అని; ఇలాగ అందరూ అంటారు గాని తను వాటిని విశ్వసించలేకుండా ఉంది.. కాని ఆలోచించగా అదే నిజమేమోనని కూడా అనిపించక పోలేదు..

★ విధి ప్రతికూలమయితే ★

అసలు ఎవరో తన కొడుకుమీద పగ పట్టి ఇలా చేశారని తనకి అనుమానంగానే ఉంది లేకపోతే తనకొడుక్కి అంత అకస్మాత్తుగా కలరా రావట మేమిటి?...అంతకుముందు రోజు మామూలుగా ఆఫీసుకి వెళ్లివచ్చాడు. రాత్రి అందరితోపాటు సరదాగా కబుర్లు చెప్తూ భోంచేశాడు. తెల్లవారగట్ల తనతో కూడా లేచాడు. తను ప్రయాణమయి వెడుతుంటే స్టేషనుదాకా వచ్చాడు రైలు ఎక్కించటానికి. రైలు కదలబోయే ముందు "మామయ్య వ్రాసిన పెళ్ళికొడుకుని చూసి రావే అమ్మా!...అన్నీ బాగుంటే సుశీకి ఈఏడు పెళ్ళి చేద్దాం!" అన్నాడు. అలాంటిది ఇంటికి వెళ్లటంతోటే ఒక విరోచనం, డోకు వెళ్లాయట. అంతే! అక్కడనుంచి వరుసగా!.. సాయంత్రానికి స్పృహ లేదట సూర్యోదయం కాకముందే పోయాడట!... ఇంతకన్న ఘోర మేదైనా ఉందా?...పది గంటలయేసరికి తను టెలిగ్రాం అందుకోవటం, రావటం, అంతకుముందురోజు తనతో నవ్వుతూ సుశీ పెళ్లినిగురించి మాట్లాడిన తనకొడుకు కళేబరం మాత్రమే చూడగలిగింది ఇవాళ. ఇప్పుడిక వాడికి ఈ ప్రపంచంలో ఏ విషయంతోనూ సంబంధం లేదు.. ఏ బాధ్యతా లేదు ... ఏ కోరికా లేదు... ఎంతలో ఎంత పని జరిగింది?... ఆ వ్యాధి తీరు అలాంటిది.

ఏమో!.. అలాగని మాత్ర మేమిటి? ... ఇదివరకు ఎందరు కలరా వచ్చి బ్రతకలేదు. తన కొడుక్కి వచ్చినప్పుడే అది అంత ప్రమాదమైన వ్యాధి కావాలా?...ఆరోజునే ఇంకా ఎందరికో వచ్చింది. కాని వాళ్లంతా బాగానే ఉన్నారు. తన కొడుకు ఒక్కడే బలి అయాడు...తను అంతే నోచుకుంది...

ఇప్పుడ నేమిటి?.. తన నోముల ఫలితం మొదటినుంచి అంతంతగానే ఉంది. చిన్నప్పుడు ఎంతకాలం ఏ బాధ్యతా, బాధ లేకుండా కులాసాగా గడిపిందో!...అంతే! తనకి యుక్తవయస్సు వచ్చినప్పటినుంచి తండ్రికి ఒక సమస్యగానే తయారయింది. అనేకవిధాల ప్రయత్నం చేశాడు తనకి పెళ్ళిచెయ్యాలని. కాని వీలుకాలేదు ... చివరకి ఎలాగో ఈయనను వెదికి తెచ్చాడు నాన్న. ఈయనకి అప్పటికి సుమారు నలభై ఏళ్లుంటాయి అంతవరకు ఏదో ధోరణిని ఉండేవారట. జీవితం అంతా బ్రహ్మచారిగానే గడపాలని ఉందని, ఉత్తమ లక్ష్య సాధనకై కృషిచెయ్యాలని ఉందని అనేవారట. అందుకోసమే ముప్ఫై అయిదేళ్లు వచ్చేవరకు పెళ్ళిమాట తలపెట్టనే లేదట. అప్పుడు ఆయనకి అనిపించిందట - తన జీవితానికి అనుకూలవతి అయిన సహధర్మచారిణి ఎంతో అవసరమని ఆమాట ప్రసంగవశాత్తూ మిత్రులతో అన్నారట. అది ఆ నోట ఆనోట తన తండ్రివరకూ వచ్చింది నాన్నకి ఆ సంబంధం నచ్చింది. నిశ్చయిస్తానన్నాడు. అమ్మ వల్లకాదంది. ఆయన వయస్సు ఎక్కువని అభ్యంతరం చెప్పింది. తనకీ అలాగే అనిపించింది. కాని గత్యంతరం లేదు. కొంత తర్జన భర్జన అయాక అందరూ ఒప్పుకున్నారు పెండ్లి బాగానే జరిగిపోయింది. అప్పటినుంచి తను ఆయనతోనే ఉంది

పెళ్ళయిన రెండేళ్ళకే తనకి కొడుకు పుట్టాడు - రావు. వాడిని చూసి తన తల్లి తండ్రీ ఎంత పొంగిపోయారు! అసలు తన జీవితంలో పెళ్ళిచెయ్యలే మనుకున్నవాళ్ల చేతికి మనుమడిని అందిస్తే వాళ్ళ సంతోషానికి అవధులు లేకపోయింది. ఆయనకూడా రావు పుట్టుకతో మారిపోయారు అంతవరకు ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూం డేవారు. ముఖం ఎప్పుడూ గంభీరంగా ఉండేది. ఇలా ఉండగా ఆయనతో మాట్లాడటంకూడా భయం వేసేది తనకి. ఈయనకి ఈ ధోరణి ఎక్కువయి ఉన్నట్టుండి ఏ సన్యాసులలోనో కలిసిపోతారేమో!...అప్పుడు తన గతేమిటి? అని ఎంతో బాధపడేది. అహోరాత్రులు అదే ఆలోచనతో గడిపేది. ఆలోచించినకొద్దీ భయం వేసేది తనకి. అలాంటిది రావు పుట్టాక ఆయన మామూలు మనిషయారు. ఇదివరకు ఇంటిమీద అంత శ్రద్ధ చూపనివారల్లా రావుకోసమేనా ఇంటిమీద ఎక్కువ శ్రద్ధ చూపేవారు ఇలాంటి మార్పు ఆయనలో వస్తుందని తను కలలో కూడా అనుకోలేదు.

రావు తరువాత ముగ్గురు మగపిల్లలు పుట్టిపోయారు. దాంతో తను, ఆయన కూడా రావు విషయంలో ఎక్కువ శ్రద్ధ తీసుకోవటం మొదలుపెట్టారు కంటికి రెప్పలాగ కాపాడేవారు. వాడు జాగ్రత్తగా చదువుకుంటున్నాడు. ఇలా ఉండగా తనకి ఆడపిల్లలు పుట్టటం ప్రారంభించారు. సుశీతో ప్రారంభమై వరుసన అంతా ఆడపిల్లలే!... ఉన్న ధనం అంతా రావు చదువుకే అయిపోయింది. ఆయనకా ఉద్యోగం లేదిప్పుడు. చేసినది సర్కారు నౌకరీ కాకపోవటంవల్ల పింఛనయినా లేదు. ఈ పరిస్థితుల్లో నలుగురు ఆడపిల్లలు. అంతా చిన్న చిన్న వాళ్లే! .. ఇంకా వాళ్లు పెరిగి, పెద్దవాళ్లయి పెళ్లి పేరంటం జరిగి, ఒక అయ్యకి ఇల్లయినప్పుడుగదా తన మనసుకి ఊరట!...

అయితే ఇందులో 'గుడ్డిలో మెల్ల' అన్నట్టుగా రావుకి కాస్త శుభ్రమైన ఉద్యోగం దొరికింది. ముందువెనకలు చూడకుండా వాడికి వీలున్నంతవరకు చదువు చెప్పించటంవల్లే ఈనాడు కుటుంబ భారమంతా వాడు మొయ్యగలుగుతున్నాడు. ఇక వాడికి పెళ్లి చేసినట్లయితే వాడి విషయంలో తన బాధ్యత ఏమీ ఉండదనీ, మిగిలినవాళ్ళ బాధ్యత వాడే వహిస్తాడనీ ఆశించారు ఆయన. ఆమాట వాడితో కదిపితే, ముందు సుశీలకి పెళ్ళిచేశాక ఈమాట ఆలోచించవచ్చు నన్నాడు. అప్పుడే వాడికి బాధ్యత నాటినందుకు ఆయన సంతోషించారు. తనకు వయస్సు మీరినందుకు పుత్రుడు చేతికి అందాడుగదా అని తృప్తిపడ్డారు ..అవును మరి! ఎందుకు నాటగు? ఒక్క సుశీకి పెళ్లి చెయ్యగానే సరా?... దాని వెనకాల ఇంకా ముగ్గురున్నారు... ఆఖరి పిల్లకి మూడేళ్ళయినా నిండలేదు... ఏది ఏమయినా వాడిమీద తగని భారం మోపారు తను ఆయనా కలిసి అనిపించింది తనకి. కాని తప్పదుగా, అనుకుంది అంతలోనే.

ఇప్పుడిప్పుడే సుశీకి సంబంధాలు చూడటం కూడా మొదలుపెట్టాడు తండ్రికంటె ఎక్కువ శ్రద్ధగా ఉన్నాడు. వాడి పోషణలో తనకి కూడా బాధలేదని తను నమ్మింది.

ఇలా ఉండగా రావుకి కలరా రావటం, ఆనాడే పోవటంకూడా జరిగాయి. ఇంతవరకు గుట్టుగా కాలక్షేపం చేస్తున్న సంసారం వీధికెక్కినట్టే. ఇంతవరకూ ఏ కొమ్మ నాధారం చేసుకుని తమ జీవిత శేషం గడపాలనుకున్నారో, ఆ కాస్త ఆధారం లేనిదయింది. ఉన్న స్థిరం అమ్ముకుంటే నే గాని రోజు గడవదు. ఆయనకా బొత్తిగా వార్ధక్యం వచ్చింది. సంపాదన ఏమీ లేకపోగా మనిషి ఆసరా కావలసిన స్థితి వచ్చింది. పిల్లలంతా పసివాళ్లే! వీళ్ళతోటి తను ఇంక రోజు ఎలాగ గడపటం? ఏది ఆధారంగా తీసుకుని తను జీవితయాత్ర నడపటం?...ఎవరి చేయూతతో పిల్లలని పెద్దవాళ్ళని చెయ్యటం? ... ఈ ఆలోచనలతో తనకి మతిపోతోంది. పైగా 'పుత్ర వియోగం'. క్షణ క్షణం జ్ఞాపకం రావటం. ఇదంతా ఎంత మరచిపోదామన్నా మరచిపోలేకుండా ఉంది. సరస్వతి...అంతకు ముందురోజున ఇక తనకు తన సంసారానికి ఏ చింతా లేదని గుండెలమీద చెయ్యి వేసుకుని హాయిగా నిద్రించిన తను ఇప్పుడు తనకు, తన సంసారానికి ఏవిధమయిన ఆధారము లేదని వాపోవలసిన స్థితి వస్తుందని కలలో కూడా అనుకోలేదు ...తనింతే నోచుకుంది కాబోలు... దాని నెదిరించే శక్తి తనకి లేదు. ★



ఐకమత్యం

జంధ్యాల సుబ్రహ్మణ్యశర్మ

మంచు దేశమందున నివ
సించెడు గుఱ్ఱాలు రెండు
బండిలాగి అలసిపోయి
బాగా దప్పికగొనెను.

నదికేగెను నీళ్ళుత్రాగ—
నదిలోగల నీళ్ళన్నియు,
గడ్డకట్టియుండ - రెండు
కొంతసేపు యోచించెను.

గిట్టలతో మంచు పగల
గొట్ట నీరగునని - తోచి
కాళ్ళనెత్తి ఒక్కొక్కటి
గట్టిగాన కొట్టదొడగె.

కానీ అవి యెంతసేపు - ఒ
క్కొక్కటి కొట్టినను - మంచు
గడ్డ పగలలేదు - అంత
రెండూ యిట్లనుకొనెను!

"ఒక్కొక్కరమే కొట్టిన
ముక్కలగుటలేదు గాన,
ఒక్కసారె యిద్దరమూ
కొట్టి యిపుడు చూదాము."

ఈవిధమున ఒక్కసారె
అవి రెండూ కొట్టగానె
ముక్కలయ్యె - నీళ్లువచ్చె
చక్కగ అవి త్రాగివెళ్లె.

ఐకమత్యభావముతో
ఒకేరీతి పనిచేసిన
ఎంతకష్టమగునదైన
చింతించక చేయవచ్చు.



కప్ప, సింహము

తటాకనిర్మలోదకమ్ము త్రావ, సింహమొండు, వే
హుటాహుటిన్ గమించి, చెర్వుఒడ్డుచేరి నిల్వగా
తటాననున్న రంధ్రమందు దాగియున్న కప్పయున్
చటాలునన్ బెకాబెకంచు సవ్వడించె నల్లనన్.

"ఇదేదియో మహామృగమ్ము, ఏమి సేయువాడ, హా
ద్విదారకమ్ముగా ధ్వనించె, దీనినెట్లెదుర్తునో
గదా" యనెంచు సింహరాజు గాంచి కప్పయున్ మదిన్
మదమ్ము రెచ్చి, పైకివచ్చి, నవ్వుచున్ నిలంబడెన్.

హసించుచున్న దర్దురమ్ము నుబ్బరానఁ గాంచుచున్
"ఛసీ, ననున్ వనాధినాథు నింతయల్పజంతువా
హసించి భీతిలంగజేయు"టంచు, సింహమాగ్రహిం
చి, సత్వరన్ గ్రహించి చింపి చెండివైచె భేకమున్.



నీతి

పోరుచేతకానివారు — కన్ననీతి తెలుపుటకీ
కొరుకూత లరచుపెందు — చిన్నగాథ పనికివచ్చు.

"మాంజా" దారం

దాగంటి తులసి

"ఏమండోయి. మా వయ్య గారూ, తీసుకొచ్చేరూ?" అని నేను ఆయనతో అంటూనే ఉన్నాను. ఆయన నామాట వినిపించుకోలేదు.

"నీకు సమాధానా లెవడు చెప్తాడయ్యా? నీకోసం ఏమీ రాలేదు. మా అమ్మాయిదగ్గిరికి పోతే ఇంత కాఫీ అయినా యిస్తుంది" అని అంటూ ఆయనలోపలికి వెళ్ళిపోయాడు. నేనూ ఆయనవెనకే వెళ్లేను. మా ఆవిడ కాఫీ అప్పుడే చల్లారబోస్తున్నాది. చలికాలమేమో కాఫీ చూస్తేనే ప్రాణం లేచొస్తున్నట్టుంది.

"ఆకాఫీ అలాపెట్టి ఇవి ముందు పెట్టుకో", అని మావయ్యగారు అరిటాకుతో పదిలంగా కట్టిన పొట్లాం విప్పి చేమంతిపువ్వులూ, వాడంబరాలు, మరువంచిగుళ్ళూ కలిపికట్టిన దండ మా ఆవిడ కిచ్చారు.

"పెట్టుకుంటా కాని ముందు కాఫీతాగండి," అని మా ఆవిడ గ్లాసునిండా కాఫీపోసి ఆయనముందరపెట్టి దండ పుచ్చుకుంది. మా వయ్యగారు వరుసకు మావయ్యగారు కాని నాకూ బంధువుకాడు. మా ఆవిడకీ బంధువు కాడు. మా యింటికి నాలుగిళ్ల అవతల వాళ్లిల్లు. అదే మాకూ ఆయనకీ బంధుత్వం. చిన్నడాబా, చిన్న దొడ్డీ, స్వంతయిల్లే. దొడ్డి చిన్నదైనా మొక్కలతో ఎప్పుడూ కలకల్లాడుతూఉంటుంది. తెల్లవారుఝామున నాలుగుగంటలకి లేచి నూతిలో నీళ్ళన్నీ ఆ మొక్కలకి ఎత్తిపోస్తాడు. పువ్వులుకోసి ప్రత్యేకం మా ఆవిడకి తెచ్చిపెడతాడు. ఆ దండ స్వయంగా తనే కడతాడు. ఇంకెవరు కట్టినా అతనికి నచ్చదు కూడా. "పువ్వులన్నీకోసి చాలామంది దేవుడికి పూజ చేస్తారు. ఒక్కొక్కరు చెట్టుపువ్వు చెట్టునే ఉంచి సంతోషిస్తారు. నాకు రెండూ నచ్చవు. దిమ్మాదిరగా పువ్వులు పూయించాలి. ఆడవాళ్లు పెట్టుకోవాలి. అప్పుడే పువ్వులకి విలవని నాఅభిప్రాయం," అని మావయ్యగారు చెప్పిందే చెప్తూ ఉంటారు.

మావయ్య కాఫీతాగి "అల్లుడూ ఒక్క రూపాయుంటే యిద్దూ. చిన్న సరదా చేస్తాను" అన్నారు.

ఉండాలికాని ఉంటే మావయ్య చాలా సరదాలే చేస్తాడు. లేకపోయినా అంతా సరదాయే. పస్తు పడుకున్నా పరమాన్నం తిన్నట్టు కనపడతాడు. అరవైఏళ్లొచ్చినా ఆరేళ్ళకుర్రాడిలాగ హుషారుగా ఉంటాడు. ఇంతకుముందు రాత్రే మాయింట్లో బియ్యం పట్టుకెళ్లేరు. ఇంకేమవసరం వచ్చివడ్డాదో? పాపం పొద్దున్నే అడిగేడు. అంచేత వెంటనే యిచ్చేను.

"అల్లుడూ, ఇవాళ సాయంకాలం వద్దుకాని, రేపు సాయంత్రం మాయింటికోసారి రా. అంతా నూరి సిద్ధంగా ఉంచేను. ఈ రూపాయితో ఏంచేస్తానో చూద్దువుగాని" అని చటాలున లేచి వెళ్ళిపోయేడు.

మావయ్య తిరిగి స్వగ్రామం వచ్చి ఎన్నాళ్లో కాలేదు. ఎలిమెంటరీ స్కూలుమాష్టరు పనిచేసి రిటైరయేడు. అయిదేళ్ళింకక్కడో మాష్టరుపని చేసేడు. ఆ ఉద్యోగం అయింది. ఇహ ఈ ఉద్యోగం చెయ్యడానికి వీల్లేక ఇక్కడికి వచ్చేడు. ఇల్లుతప్ప ఇంకేం లేదు. ముప్ఫైఏళ్లు పనిచేసినా పెన్షనయినా అయ్యవార్లకిఉండదుకదా! ఇంకానయమే. మావయ్యకి తాతలు కట్టించిన యిల్లైనా ఉంది. ఏదో మా వీధిలో ఉన్నవాళ్ళని చెప్పుకోవడమేకాని అంతకుముందు పరిచయం లేదు. ఎప్పుడూ పైఊర్లోనే పనిచేశేడు. స్వంత యిల్లుందని వచ్చేడుకాని ఈ ఊరికీ అతనికీ సంబంధమే లేదు. వచ్చి ఆర్నెల్లైందో లేదో మాకు మాత్రం ఆత్మబంధువైపోయేడు. అయిదారిళ్ళలో పిల్లలకి ప్రైవేట్లు

చెప్పుకుని బతుకుతున్నాడు. అతని పెద్దపిల్లలంతా ఆడవాళ్లు. కొడుకులు చిన్నవాళ్లు. హైస్కూలు క్లాసులు చదువుతున్నారు. జీవితం కష్టంగా గడుస్తున్నా ఏ బాధా పట్టించుకోకుండా సంచరిస్తాడు. మావయ్యగారు ఇంటిపక్కకి వెళ్ళకుండా బజారువేపుకే వెళ్లిపోయేరు. ఆ వెళ్ళడంలో అంగలు వేసుకుంటూ కుర్రాడిలాగే వెళ్తున్నాడు. అతని నడకతీరే అంత. చిన్నపిల్లలకి పాఠాలు చెప్తూ జీవితం గడిపి, తనూ చిన్న పిల్లడిగానే ఉండిపోయేడు. అంతా నూరి సిద్ధంగా ఉంచాలని చెప్పేడు. ఏమిటో ఆ నూరి ఉంచింది. దీపావళి వెళ్లిపోయినా మరోదీపావళి చేస్తాడు కాబోలు!

ఆ మర్నాడు సాయంత్రం వాళ్లింటికి పిల్చేడన్న సంగతే నాకు జ్ఞాపకం లేదు. మా అమ్మాయి తొందర తొందరగా తల్లిచేత జడ వేయించుకొని, గౌను వేసుకుని టిప్ టాప్‌గా తయారై నాముందునుంచే ఒక్కపరుగు తీసింది. "ఎక్కడికే" అని నే నడుగుతూ నేఉన్నా అది వీధిలోకి తుర్రుమని పారిపోయింది. సాయంకాలం ఐదున్నరైంది. ఎలాగూ వీధిలోకి వెళ్లాలి. లేచి బట్టలేసుకుంటున్నాను. మాయింటి దాసీది దానికొడుకుని వెంటబెట్టుకుని అంట్లు తోమడానికి వచ్చింది. "మీ మావయ్యగారోపాలి రమ్మన్నారు బాబూ" అని కబురు తీసుకొచ్చింది.

వెళ్లేను మావయ్యగారింటికి. చీడీ మీద అత్తయ్యగారు కూర్చున్నారు. పచ్చగా పసుపు రాసుకున్న మొహం మీద రూపాయికాసంత బొట్టు పెట్టుకొని ఎప్పుడూ కలకల్లాడుతూ ఉంటారావిడ. వేరే మహాలక్ష్మి ఎక్కడో ఉందని చూడక్కర్లేదు. ఆవిడ మొహం చూస్తే నిజంగా చేసిన పాపాలు పోతాయి. ఎప్పుడూ లేంది ఆవిడ మొహం ఎంచేతో యిప్పుడు ముడుచుకుపోయిఉంది. ఆలోచనంటే ఏమిటో ఎరుగని ఆవిడ, బుగ్గ మీద చెయ్యిపెట్టుకుని ఆలోచిస్తోంది.

పెరటివేపు చూశా. అంగుళం జాగా లేకుండా మొక్కలతో నింపేశాడు. చేమంతిపువ్వుల శోభ చెప్పతరంకాదు. లేని జాతంటూ లేదు. నందనవనంలా ఉంది. మావయ్యగారి మొక్కలగురించి కథ రాస్తే మొక్కకొక కథవుతుంది. ఎక్కడ ఎలా ఎప్పుడు ఆ మొక్కని సంపాదించేడో అంతా మావయ్యగారే చెప్పాలి.

"మావయ్యగారేరీ?" అడిగేను. నేనన్నమాట ఆవిడకి వినిపించిందో లేదో కూడనూ. నేనన్న వెంటనే కుర్రకారు చప్పట్లు చరుస్తూ చేసిన గందరగోళం కాకిగోలా దబ్ దబ్ మని చప్పుళ్లూ చెవుల్ని బద్దలు కొట్టేయి. ఏమిటా అని డాబా కమ్మలవేపు చూసేను.

"వినపడిందా బాబూ. అదే. వెళ్ళి చూడు. మీ మావయ్యగారు చేస్తున్నపని! ఆయనపక్కకి సంతోషించేవాడివి నువ్వొకడివి దొరికేవు. వెళ్లు. వెళ్లు" అన్నారు అత్తయ్యగారు. శాంతమూర్తయిన ఆవిడ నోటంట కోపంతోటీ, విసుగుతోటీ మాటలనిపించిన ఆ పని ఏమిటైయుంటుందీ అని అనుకుంటూ క్షణంలో డాబా ఎక్కేను. డాబా మీద దృశ్యం నన్ను ఆశ్చర్యంలో ముంచేసింది. మావయ్యగార్ని చుట్టబెట్టుకుని ఆయన కొడుకులు సీనూ, వాసూలూ, ప్రైవేటు కుర్రాళ్లూ, ఆ వీధికుర్రాళ్లూ మా అమ్మాయి అందరూ ఉన్నారు. పిల్లలమధ్య "పలేతా" పట్టుకుని మావయ్యగారు భరతనాట్యం చేస్తున్నారు.

"రావోయ్ సరిగ్గా సమయాని కొచ్చేవు" అని ఆహ్వానించేరు.

"నాన్నోయి, చూడు చూడు తమాషా. హోయి హోయి" నా కూతురు వేలు పైకెత్తి చూపెట్టింది. ఎర్రటి పడగా, దాంతోటి నీలం బెలూనూ కిందికి దిగిపోతున్న ఎర్రటి సూర్యబింబాన్నీ, నీలాకాశాన్నీ అందుకోడానికి పరిగెడుతున్నాయి. వీటికి దక్షిణంగా కొంచెం దగ్గరలో తోకలేని ఓ ఆకుపచ్చ పడగ ఎగురుతోంది.

ఆకాశంలో ఏమూల చూసినా గాలిపడగలే. పండుగముందు శీతాకాలం రాగానే ఊరందరికీ యిదే పిచ్చి. గాలిపటా లెగరెయ్యడం, పడగలని కోయించడం, తెగిపోయిన పడగ గాల్లో ఎగురుతూఉంటే కుర్రాళ్ళంతా దానివెంట పరిగెడుతూఉండడం పరిపాటే. నాకు మాత్రం చలికాలం సాయంకాలం ఆకాశంలో ఈ గాలిపడగలతో ఎంత సరదాచేస్తారో తెలీదు. ఏదో కుర్రాళ్లు ఎగరేసుకుంటారు అనే నాభావం. ఆకాశంనిండా గాలిపడగలే. ఒక పడగని ఇంకొక పడగ కొయ్యడానికి ప్రయత్నం చేస్తూ ఉన్నది. భూమ్మీద ఓప్రాణిని ఇంకోప్రాణి కబళిస్తున్నట్టే ఓపడగని ఇంకొకపడగ దారంతో కోసి దాని ఎగురుబాటంతా అంతం చేస్తున్నాది.

"తాతయ్యా మనపడగే కింద నుండిపోయింది"

"ఊఁ ఏమిటన్నావు? ఇదిగో.

★ "మాంజా" దారం ★

యిస్తాడు చూడు" అన్నారు మావయ్యగారు.

"ఎగురూ ఎగురూ పైకెగురూ ఓ ఎర్రపడగా" అంటూ పాడ్డం మొదలెట్టింది మా అమ్మాయి. దాంతోటి మిగిలినకుర్రాళ్లూ శ్రుతి కలిపేరు. "ఎగురూ ఎగురూ" అని చెవులు గింగురుమన్నాయి. పిల్లల గొంతులని మించిన గొంతుకతో 'ఎగురూ ఎగురూ' అంటూ మావయ్యగారు దారంతో ఏం గమ్మత్తు చేసేరో కాని చూస్తూఉండగానే ఎర్రపడగా పడగతోపాటు బుడగా మీదకి లేచిపోయేయి.

"హేహే, అద్గదీ. హాయి డబ్బా" అంటూ చప్పట్లు చరుస్తూ కుర్రాళ్లు నాట్యం చెయ్యడం మొదలెట్టేరు. మావయ్యగారు పరీక్ష ప్యాసైన కుర్రాడిలా పొంగిపోతున్నారు. ఆ మేష్టారి వేపూ, ఆ పిల్లల వేపూ వాళ్ళ ఆనందానికి కారణమైన ఆ ఎర్రపడగా, నీలంబెలూన్ల వేపూ కళ్ళప్పగించి నిల్చుండిపోయేను.

"ఏం అల్లుడా ఇంత ఆలస్యంగా వచ్చేవు? అల్లుడివైనందుకు అల్లుడి టెక్కు చూపెడతావు! రెండు కబుర్లుపెట్టినా ఆలస్యమే చేసేవు!" అని వాదువేసేడు.

"ఇందాకట్లా మనబుడ్డీ నీలం పడగతో యుద్ధంచేసినప్పుడు నువ్వు రాలేదు. బుడ్డీని దించేసేక వచ్చేవు! ఏం చేస్తాం? ఏమర్రా పిల్లలూ. నీలం పడగని ఎలా కోసేసేం?" అన్నారు మావయ్యగారు.

"ఒక్క నీలంపడగా? ఏడువాళ్ళ అని వెంటపెట్టి, వెంటపెట్టి కోసేం. ఓ! ఎన్నితిప్పలు పెట్టేం! పాపం మీదకి లేవడం మనబుడ్డీని అందుకోలేక కిందకి దిగిపోవడం. కిందకీ మీదకీ కుప్పిగంతులు వేయించేం. ఆఖరికి కుయ్యోమని ఏడుస్తూ పడిపోయింది," అన్నాడు మావయ్యగారి సీను.

"ఇంతకీ బుడ్డీఅంటే ఏమిటండీ?" అడిగేను.

"ఏమిటీ? నీకు బుడ్డీ అంటే తెలీదూ? తోకలేనిపడగని బుడ్డీ అంటారు. తోకున్న పడగ స్థిరంగా ఉండి మనం ఎంత పైకిపంపిస్తే అంత పైకి లేచిపోతుంది బుడ్డీకి చంచలత్వం జాస్తి. అంచేతే పైవాడి పడగలని కొయ్యడానికి బుడ్డీయే ఉండాలి," మావయ్యగారు పడగా, బుడ్డీల తేడాలు చెప్పేరు.

"మనబుడ్డీ ఆకాశంమీదుంటే ఈపాటికి ఆకుపచ్చబుడ్డీపని అయేది. మేష్టారు దించేసేరుకాని..." అన్నాడో కుర్రాడు

"నాకు వీటిముక్కూ మొహం తెలీదు. ఆ బుడ్డీని ఎగరెయ్యండి ఆ కొయ్యడాలూ అవీ చూస్తాను," అన్నాను

"అవునండీ, మళ్లాఎగరెయ్యండీ" అన్నాడు సీను.

"ఇందాక వీడింటిని కోసేం దీంతో ఎనిమిదీ అవుతాయి" అన్నాడు ఇంకోకుర్రాడు.

"ఆకుపచ్చబుడ్డీ పొగరణిచెయ్యాలండీ"

మావయ్యగార్ని మాట్లాడనివ్వకుండా పిల్లలందరూ గొడవ చెయ్యడం మొదలెట్టేరు.

"తాతయ్యా బుడ్డీని తీసుకొస్తానూ?" అని పరిగెట్టింది నా కూతురు. డాబామీద ఓవారపెట్టిన ఎర్రబుడ్డీనీ, దానితోటే ఉన్న ఇంకో "పలేతా"ని తీసుకొచ్చింది.

"మేష్టారూ నేని ఎర్రపడగని ఎగరేస్తూ ఉంటానండీ?" అని ఓ కుర్రాడు మావయ్యగారిమీదకి ఎగబాకేడు. మావయ్యగారు చేతిలో ఉన్న "పలేతా"ని ఆ అబ్బాయిచేతి కిచ్చి మనవరాలు తెచ్చిన కొత్త "పలేతా"ని పుచ్చుకున్నారు. ఆకాశంమీదకెత్తేను కళ్ళని. ఎర్రపడగా, నీలంబుడగా ఆకాశాన్ని కొలుస్తున్నాయి. పెద్దవిగా కనబడుతున్న వాటి ఆకారాలు నలకలైపోయేయి. వసిష్టుడులా పడగా, దానిపక్కని మిణుకు మిణుకుమంటున్న అరుంధతిలా బుడగా చూడముచ్చటగా ఉన్నాయి. ఆకుపచ్చబుడ్డీ దిన్నపోయి వెలవెలబోతున్న మొహంతో పరీక్షపోయిన కుర్రాడిలా కిందనుండిపోయింది.

మావయ్యగారు బుడ్డీకి కట్టిన దారాన్ని ఓసారి కొలిచి సరిచూసేరు. పలేతాని రెండుచేతులతో పట్టుకుని "ఒరే సీనూ పటాన్ని ఎత్తిపట్టుకో" అన్నారు. సీను బుడ్డీని తీసుకుని డాబాకొసకెళ్ళి ఎత్తిపట్టుకున్నాడు. "ఊఁ వదిలెయ్యి" సీను పటాన్ని వదిలేసేడు. వదిలిన వెంటనే అది నాగుపాములా మెలికలు తిరుగుతూ, ఫర్‌ఫరలాడుతూ, బుర్ర కిందికి పెట్టీ, మీదకి పెట్టీ అడ్డదిడ్డాలు పోతూ మీదికి గబగబా లేచింది. ఓ నిమిషంలో పక్కనున్న కొబ్బరిచెట్టు పైకి లేచింది. మరునిమిషానికి దాని ఆకారం చిన్నదైపోయి ఆకుపచ్చబుడ్డీకి జానెడు తేడాలో ఉంది. మరో

తీగానికి బుడ్డివీరాంటే ఎగరడం మొదలెట్టింది.

"ఇంకయిందిలే నీపని"

"ఎంతసేపెగురుతావ్ ? నేనుం ఇక్కడ ఉండగా ఆకాశంలోకి తల పెట్టడమే?"

"అద్భుతం దద్భుతంది. పెళ్ళిపుతుంది"

పిల్లలందరూ ఆకుపచ్చ బుడ్డిని సంబోధించి తలోమాటా అన్నారు. మెడలు చాచి అందరం ఆకాశంలోకి కళ్ళని పెట్టేసేం. నాలో పెద్ద ఉత్సాహం బయల్దేరింది. ఆతృతతో ఆ రేళ్ళ పట్రాడిసైపోయేను. పిల్లలు అందరూ గప్‌చిప్‌గా మాటలు బిగించి, చేతులు ఆడిస్తున్నారు. మావయ్యగారు తమాషాగా దారాన్ని ఆడిస్తూ మధ్యమధ్యని లాగుతున్నారు. ఆకుపచ్చబుడ్డి మీదకిలేవడానికి ప్రయత్నంచేస్తూ కుడిపక్కకి తొలగిపోతోంది. ఆబుడ్డి కుడికివెళ్తే కుడికీ, ఎడానికివెళ్తే ఎడానికీ, ఎటువెళ్తే అటు మావయ్యగారి ఎర్రబుడ్డి పరుగులుతీస్తూ దాని వెంట పరిగెడుతోంది. వీటి సమరాన్ని చూడ్డానికన్నట్టు ఓ బుషి కత్తుంగుంపు వీటిపక్కనుంచీ ఎగురుకుంటూపోయింది. వీటికి బాగా దూరంగా ఎర్రపడగా, నీలం తెలుపూ బుర్రలూపుతూ వీటి యుద్ధాన్ని తిలకిస్తున్నాయి.

"ఎటుకావాలంటే అటు మాం బాగా పంపిస్తున్నారే," అన్నాను.

"మరేమిటనుకున్నావు? ఎడం పక్కకి జరుగూ అంటే ఎడంపక్కకి జరగాలి. కుడిపక్కకి ఎగురూ అంటే కుడివేపే ఎగరాలి. మీద కెళ్లూ అంటే మీదకెళ్లాలి. కిందకి దిగూ అంటే దిగాలి దారం నాచేతిలో ఉన్నంతసేపూ నే చెప్పినట్టల్లా నడవ్వలసిందే! ఇప్పుడుచూడు. చూడం పర్రా పిల్లలూ. జాగ్రత్తగా చూడండి" అన్నారు మావయ్యగారు.

ఎర్రబుడ్డి దుడుంగున కిందికిదిగి తటాలున మీదకి లేచిపోయింది. అంతే! ఆకుపచ్చబుడ్డి పల్టీలు కొడుతూ కిందరాలిపోతోంది. "హోయిహోయి, హోహో అంతే కావాలి అంతేకావాలి, ఎనిమిదోది, ఎనిమిదోది" అంటూ ఈలలు వేస్తూ పిల్లలు గెంతుతున్నారు. మెడలు నొప్పెడుతున్నా ఎర్రబుడ్డి మీంచీ దృష్టి మరల్చలేదు. విజయగర్వంతో ఊగిసలాడుతూ స్వర్గాన్నందుకోడానికి ఉరకలేస్తోంది ఎర్రబుడ్డి! అంతరిక్షానికిపోయి ఎంతో ఉల్లాసంతో ఎగురుతున్న ఆకుపచ్చబుడ్డిపని అయిపోయింది. తల వేలేసి అంత అంతరిక్షాన్నుంచీ కిందికి పతనమైపోతున్నాది. ఆ పతనాన్ని చూస్తే ఎంతో జాలివేసింది. పతనమై పతనమై ఓ చెట్టు శిఖరానికో ఎలక్ట్రిక్ తీగలకో చుట్టుకుపోతుంది. మావయ్యగారి ఎర్రబుడ్డీ, ఎర్ర పడగా పడగకింద బుడగా గర్వాతిశయంతో ఎగురుతున్నాయి.

"ఎలా ఉందోయి అల్లుడూ" అడిగేరు మావయ్యగారు.

"అద్భుతంగా ఉంది. ఇందులో కూడా మీరు ఉద్దండులన్నమాట! కొయ్యడంఅంటే ఏమిటో యిప్పుడు బాగా తెల్సింది"

"ఎంతమజాగాఉందో చూసేవా? ఇదీ ఒకకళే! మనం ఎలా వెళ్ళమంటే అలా నడుస్తోంది, చూడు. నిన్న నీదగ్గర్నుంచి వెళ్ళాకే కొనేసేను. ఉల్లిపొరకాగితాలూ, దారమూనూ. నిన్నరాత్రికి పటాలు తయారైపోయేయి. ఇవాళ సాయంత్రం యుద్ధానికి "మాంజా" దారం సిద్ధంచేసేసేను. చెప్పేనుగా, నీదగ్గరకి రాకముందే గాజుపొడి నూరేను"

"గాజుపొడెందుకూ!"

"మాంజా"కి. దారానికి మెత్తగా అంతా గాజుపొడి పట్టించి ఎండ పెడతారు. చెయ్యడానికి పద్ధతి తెలియాలి. పట్టుకుచూడు" దారాన్ని పట్టుకునిచూసే. గరుగ్గా ఉంది.

"ఆఁ ఆఁ అలా రాయకు. కోసుకుపోతుంది. "మాంజా"ల్లోనూ అసలు సిసలైన "మాంజా." నాచేతి "మాంజా"కి యింకేదీ సరితూగదనుకో" అన్నారు.

సరదాకేదో పిల్లలెగరేసుకుంటారని తెలుసుకాని దీనికింత గ్రంథం ఉంటుందని ఎప్పుడూ అనుకోలేదు. ఎవరూ చెప్పలేదు.

"దీనికోసమే ఆ విడ అలా చిర్రుబుర్రులాడిపోతోంది! మామీ ముదుచుక్కార్యుంది! తేలా పాయి దండగచేస్తేనని ఏడుస్తోందికాని దీని మజా దానికెలా తెలుస్తుంది? చిన్నకుర్రాడిలా ఏమిటాపన్లంటుంది. పడగని కోస్తూఉంటే ఎంతసరదాగా ఉందో నువ్వే చూసేవా? దీంతో ఎనిమిదిపటాల్ని నషా చేసేను. మూడుబుడ్డీలూ, ఐదు పడగలూ. అన్ని మాంగులూ లేందే ఏదవుతుంది చెప్పూ? పడగల్ని కొయ్యడానికి బుద్ధి ఉండాలి. మాంజా ఉండాలి. పలేతాలే లేకపోతే యింత బాగా దారాన్ని వదలగల్నా? ఇంకెటొచ్చీ బెలూనుంది కిందటి సంవత్సరం నుంచీ పటానికి బెలూనుకట్టి ఎగరేద్దామనుకుంటున్నాను. మొత్తం

"మాంజా" దారం

రూపాయీ అయిపోయిందనుకో. అయితేనేం? ఏఁవీ ఖర్చుపెట్టకుండా సరదా ఎలా తీరతాయి?" అన్నారు మావయ్యగారు.

"కొంగా కొంగాగోళ్లు, కొంగా కొంగాగోళ్లు" అంటూ పిల్లలందరూ చేతులెత్తిఅరవడం మొదలుపెట్టేరు. కొంగలబారుబుడ్డీ, పడగల పక్కనుంచీ నివాసాలకి ఎగురుతూ వెళ్ళిపోయింది. అవి కనపడుతున్నంతసేపూ పిల్లలందరూ చేతులుబోర్లించి మీదకెత్తి ఉంచేరు.

"ఇదిగో నాగోరుమీద పడ్డాది"

"నాకూ పడ్డాది"

"మూడింటమీద పడ్డాది"

ఒకళ్ళమీద ఒకళ్లు పడిపోతూ, కుమ్ములాడుకుంటూ, గోళ్ళనిచూసుకున్నారు. కొంగలకిచూపిస్తే గోళ్లకి తెల్లటి మచ్చలు పడతాయని కుర్రాళ్లు కొంగలకి గోళ్లు చూపెడతారు.

"ఏమర్రోయి నాగోరుకీపడ్డాది" అన్నారు మావయ్యగారు. ఆయన చేతిని పీకేస్తూ, మీద పడిపోతూ తెల్లమచ్చని పిల్లలందరూ చూసేరు. నాగోళ్లూ చూసుకున్నాను. నావి స్వచ్ఛంగా ఉన్నాయి.

"నాన్నా చీకటి పడిపోతోంది" అన్నాడు మావయ్యగారి సీను.

"ఒరే, నువ్వొదించీరా" అని మావయ్యగారు దారాన్ని చుట్టడం మొదలెట్టేరు. పడగనీ బుడగనీ ఎగరేస్తున్న కుర్రాడు "పలేతా" రెండుకొసలనీ రెండుచేతులతోపట్టుకుని మిషన్లా దారాన్ని చుట్టడం మొదలెట్టేడు. నలకల్లాఉన్న బుడ్డీ, పడగా, బెలూన్ల ఆకారాలు పెద్దవైపోతున్నాయి. రానురాను అవి రాక్షసాకారాలు దాల్చేయి. డాబా మీద రాబందుల్లా రెండు కావుల కాగితాలతో చేసినపడగా బుడ్డీలూ, భూతంలా బాటాబెలూను వాలేయి. మావయ్యగారు చిన్నపిల్లల్ని చేతుల్లోకి తీసుకుంటున్నట్టు బుడ్డీనీ, పడగనీ, బుడగనీ జాగ్రత్తగా అందుకున్నారు.

"వీటికోసం వారం రోజులబట్టీ ఆలోచిస్తున్నాను. ఈ కుర్రాళ్ళకింకా సెల అవలేదు. ఎలాగ? ఏం చెయ్యడం? నిన్న నింక పట్టలేక నిన్నడిగేసేను." చెప్పేరు మావయ్యగారు.

"తాతయ్యా బుడగ నేను పట్టుకోవద్దూ?"

"ఓసారి పట్టుకుని యిచ్చెయ్యి. కిందకి నువ్వు తేలేవు. పేలిపోతుంది" మనవరాలి చేతిలో బెలూనోసారి పెట్టేడు. అమ్మాయి దానిమీద చేత్తో ఫర్ ఫర్ మనేటట్టు రాసి, మొహంమీదోసారి పెట్టుకుని యిచ్చేసింది. డాబాదిగికిందికివచ్చేం.

"మేష్టారూ రేపూ ఎగరేస్తారు కదండీ"

"ఎందుకెగరెయ్యనూ? రేపూ రండి."

"నమస్కారమండీ"అని అందరూ దణ్ణాలుపెట్టి బిలబిల్లాడుతూ వెళ్ళిపోయేరు. నా చెయ్యి పట్టుకొని నిల్చుంది మా అమ్మాయి. బెలూన్ని తాడేసి దూలానికి వేళ్లాడదీసి పడగలని బీరువామీద పదిలంగా దాచేరు. అత్తయ్యగారు ఎక్కడ కూర్చున్నారో అక్కణ్ణించి కదల్లేదు.

"అమ్మా అన్నం పెట్టవే" అన్నాడు సీను.

"అన్నంలేదు దణ్ణంలేదు. గాలిపటం ఎగరేసుకోండి" అన్నారు అత్తయ్యగారు. ఫకాలుమని నవ్వేరు మావయ్యగారు.

"కోపంవస్తే నీ మొహం మరీ బాగుంటుందిసుమీ" అన్నారు. అత్తయ్యగారు అందమైన మనిషే.

"బాగుంటుంది. బాగుంటుంది. చూసేవుకదా నాయనా. ఎవరిపని బాగుందంటావు?" అని నావేపు తిరిగేరు.

"చెప్పేనుకదోయి అల్లుడూ రూపాయి దండగైపోయిందిట. నువ్వు చూసేవుకదా! దండగ్గంటావా?"

"అచ్చే దండగేమిటి?" అన్నా.

"ఏమిటీ! నీకూ అలాగే తోచిందీ? మావకితగినఅల్లుడివిదొరికేవు! దండగవలేదుట! మొన్న మీయింట్లో బియ్యం బదులు తెచ్చుకున్నాం. ఇవాళ పొయ్యిమీదికి గిన్నెక్కే మార్గంలేనేలేదు. ఇచ్చ రూపాయి తీసుకొచ్చి చేసిందేమిటయ్యా అంటే గాలిపటం ఎగరేసేరు. గాలిపటం. వంటొండలేదనితెల్సే. చీమ కుట్టినట్టైనాలేదు మనిషికి. నా తంటాలు నేను పడవల్సిందే! ఏమనుకోడం? ఆయనగారికి తోడు నువ్వొహడివి. ఆయన ఏంచేసినా మాఁ బాగుందంటావ్" అన్నారు అత్తయ్యగారు. మావయ్యగారు మాట్లాడకుండా బుర్రోంచుకున్నారు. సీనూ వానూ బిక్కమొహాలేసుకుని నించున్నారు. ఆయన తత్వం నాకాశ్చర్యం కలిగించింది. అంత ఆనందానిచ్చిన గాలిపటం దండగని అండానికి నాకూ నోరురాలేదు.

"సీనూ. నంచీ పట్టుకురావోయి" అని లేచేను.

"నువ్వు పంపించకు నాయనా! ఈ మనిషికి బాగా తెలిసి రావాలి" అన్నారు అత్తయ్యగారు. నేను మాట్లాడకుండా సీనుని తీసికెళ్ళి ఓ శేరుబియ్యం యిచ్చి పంపించేను.

★


మార్టిన్ రాట్లర్

చిత్రం: ఆర్. ఎమ్. బాలన్‌టైన్

ఇంతలో మార్టిన్‌రాట్లర్ పెంపుడుపిల్లి తడిసిన ఒళ్ళంతా నాకుకుంటూ, అలిసిపోయి, దీనంగా 'మ్యావ్' అన్నది. దాని అరుపు వినగానే అసలే కోపంతో ఉన్న మార్టిన్‌రాట్లర్ ఒక్కసారి భగ్గున మండిపోయాడు. ఉవ్వెత్తుగా లేచి, బాబ్ క్రోకర్ మీది కురికి, ముఖంమీద గుద్దులవర్షం కురిపించాడు. బాబ్ క్రోకర్ నిలవలేక కిందపడిపోయి, దెబ్బలనుండి కొంత సేపటికిగాని తేరుకోలేకపోయాడు. లేచి నుంచున్నాడు. ఈసారి మార్టిన్ ఇందాకటిలాగా మీదపడడానికి వీలులేకపోయింది. ఎందుకంటే బాబ్ పిడికిలిబిగించి మార్టిన్ ముక్కుమీద, రొమ్ముమీద వేసెడు వేసెడు గుద్దులు తగిలించాడు. ఈ గుద్దులతో మార్టిన్ కోపం చాలవరకు దిగిపోయింది. జాగ్రత్తగా ఉండడం అవసరమని భావించాడు. చుట్టూమూగిన విద్యార్థులు "మార్టిన్, జాగ్రత్తగా ఉండు, భయపడకు," అని ప్రోత్సహించారు. ఇద్దరు వస్తాదులు రొజుకుంటూ మళ్లీ గుండ్రంగా తిరగసాగారు.

ఆరోజున జరిగిన యుద్ధం వేలలో ఎన్నదగినది. వాటర్లూ యుద్ధం ఇంగ్లండులో ఎలాటిసంచలనం కలిగించిందో, మార్టిన్ బాబ్‌ల ద్వంద్వయుద్ధం వాళ్ళ గ్రామంలో అలాటిసంచలనమే కలిగించింది. స్కూల్లో అందరికంటె పెద్దవాడైన బాలునికి కూడా అంత గొప్పయుద్ధం ఎన్నడూ జరిగినట్లు జ్ఞాపకం రాలేదు. ఆరోజుతో ఒక కొత్తశకం ఆరంభమైంది. ఆతరవాత స్కూల్లో ఏసంఘటన జరిగినా "'పెద్దకుస్తీ' తరవాత మళ్ళీ ఇలాటిది జరగలేదు" అనే ప్రతివారూ వ్యవహరించేవారు. బాబ్ క్రోకర్ శక్తిసామర్థ్యాలు అందరికీ తెలిసినవే. కాని మార్టిన్‌రాట్లర్ ఇంకా అనుభవం లేనిబాలుడు. ఇంతవరకూ ఎవరితోనూ దెబ్బలాడి ఎరుగడు. మోటపనులు చెయ్యడమన్నా, అల్లరి చెయ్యడమన్నా అతనికి సరదా ఉందిగాని, దెబ్బలాటలంటే ఏమాత్రం ఇష్టంలేదు. అందుకే చిరిగిన చొక్కాతోగాని, దెబ్బలతో వాచిన మొహంతోగాని అత డెన్నడూ ఇంటికి రాలేదు. పెద్దమ్మ డరోతీగ్రంబిట్ ఈ ఒక్కవిషయంలో మార్టిన్‌ను మెచ్చుకునేది. ఆమెకు సిద్ధాంతరీత్యా పోట్లాటలంటేనే అసహ్యం. అసలు ప్రపంచంలో సైనికులు ఉండకూడదని ఆమె విశ్వసించేది. బైబిల్‌లో చెప్పినట్లుగా, సౌజన్యంతో, సానుభూతితో సమస్యలను పరిష్కరించుకోవాలిగాని దెబ్బలాటలతో కాదని ఆమె నమ్మకం. మంచితనంతో సాధించరానిది లేదని ఆమె అనేది. అందరూ ఆమెలాగానే అనుకునేట్లయితే, ఈ కత్తులు, తుపాకులు, పిస్తోళ్ళు, పోట్లాటలు ఏమీ ఉండనేఉండవు! పాపం, పిచ్చిది! ఎప్పుడూ ఎక్కడో ఒకచోట ఘర్షణ జరుగుతూనేఉండే ఈ ప్రపంచం ఆమె నమ్మకాలప్రకారం నడుచుకుంటే నిజంగా

అనువాదం: వండారి రామమోహనరావు



ఉయ్యాలమ్మా ఉయ్యాల !
ఉండ్రాళ్ల తద్దీ ఉయ్యాల !

ఫొటో : వి. రామమూర్తి—మద్రాసు.

బాగానే ఉంటుంది. అది దాదాపు అసాధ్యం కనుక, మనం చెయ్యగలిగినదల్లా ఒకటే: నిజంగా ధర్మం కోసం, న్యాయంకోసం పోట్లాడవచ్చును. అప్పుడు మనంచేసేది పాపంకాదనే తృప్తియైనా కనీసం మిగులుతుంది.

మార్టిన్, బాబ్ పోరాటం సాగిస్తున్న నేల ఎగుడుదిగుడుగా మిట్టపల్లాలుగా ఉంది. అది మార్టిన్‌కు చాల సహాయకారి అయింది. బాబ్ క్రోకర్ కొంచెం అస్తవ్యస్తంగా బలిసిన మనిషి. అందుచేత చలిమిడి ముద్దలాగా పడేవాడేగాని, దబ్బున లేచేవాడుకాదు. ఒళ్ళంతా హూనమైపోయేది. మార్టిన్ ఉక్కుకడ్డీలాగ చురుకైనవాడు. సాధారణంగా కిందపడేవాడే కాదు. పడినా చిటికెలో లేచి నుంచునేవాడు. అధర్మయుద్ధం చేయరాదనే పట్టుదలకలవాడు కనుక, పడివున్నప్పుడుగాని, లేవబోతున్నప్పుడుగాని బాబ్‌ను కొట్టేవాడు కాదు. తాను అపజయం పొందితే తన పిల్లికిపట్టే గతి తలుచుకుంటే మాత్రం అతని నెత్తురు సలసల కాగిపోయేది. బాబ్ లేచి నిలబడి పిడికిలి బిగించేలోగానే పదిగుద్దులు వేసి లేచిన గోతిలోకే మళ్ళీ పడేసేవాడు. ఒక్కొక్కగుద్దు గుద్దినప్పుడూ, తిన్నప్పుడూ కూడా మార్టిన్ కోపం రెండింతలుగా పెరిగిపోయేది. నాలుగైదుసార్లు కిందపడినా, మళ్ళీలేచి విరోధిమీదకు లంఘించేవాడు. తను ఎన్ని దెబ్బలుకొట్టినా బాబ్ క్రోకర్‌కు సరిగ్గా తగలడంలేదని, మీదపడి కిందికి తోసేసేవాడు. కాని బాబ్ బలిష్ఠుడుకనక, నెమ్మదిగా తేరుకుని, ఉత్సాహం పుంజుకుని దెబ్బలాడుతూనే ఉన్నాడు. హఠాత్తుగా మార్టిన్ నుదురుమీద ఒకగట్టి దెబ్బకొట్టి పడేసి తనుకూడా కాలు మెలికపడి కింద పడ్డాడు. అక్కణ్ణించి ఇద్దరూ కొంతదూరం దొర్లుకుంటూ పోయారు. తిరిగి లేచినుంచున్నారు. మార్టిన్‌కు విపరీతమైన కోపంవచ్చింది. తన తెల్లపిల్లి నీళ్లలో ఈదుతూ ప్రాణరక్షణకోసం అరుస్తున్నట్టుగా ఒక దృశ్యం ఊహలో మెదిలింది. దాంతో కొత్తశక్తి వచ్చినట్లయింది. ఒకటి రెండుఅడుగులు వెనక్కివేసి, బాణంలాగా పరిగెత్తుకొచ్చాడు పెద్దగా అరుస్తూ ఒక్క ఎగురుఎగిరి బాబ్ క్రోకర్ రొమ్ముమీదికి దూకాడు. ఈ దెబ్బతో బాబ్‌పని అయిపోయింది. పోట్లాటసందడిలో ఇద్దరూ ఎప్పుడు జరిగారో నీటిఒడ్డుదాకా జరిగారు. అందుచేత ఇద్దరూ దొర్లుకుంటూ సరాసరి నీళ్ళలోకి పోయి పడ్డారు. కొన్ని సెకండ్లపాటు ఇద్దరూ నీళ్ళలో మునిగిపోయి కనిపించలేదు. ముందు పైకి వచ్చినవాడు మార్టిన్ రాట్లర్. కళ్లు, నోరు పెద్దవిచేసి, నిలబడి, శత్రువును కొట్టడానికి చెయ్యెత్తాడు. కాని కొట్టవలసిన అవసరం మళ్ళీ కలగలేదు. బాబ్ క్రోకర్ తల పైకి తేలింది. కళ్లు మూతపడిఉన్నాయి. చేతులు, కాళ్లు ఆడడంలేదు. మార్టిన్ రాట్లర్ కొట్టడానికి ఎత్తిన చేత్తో బాబ్‌ను పట్టుకుని, బలమంతా ఉపయోగించి ఒడ్డుకు ఈడ్చుకువచ్చాడు బాబ్‌కు తెలివివచ్చిన తరవాత, కళ్లుతెరిచి, నీరసంగా ఇక దెబ్బలాడలేను" అన్నాడు.

"బాబ్ క్రోకర్! మనం దెబ్బలాడవలసి వచ్చినందుకు నాకు చాలా విచారంగా ఉంది. నా పిల్లిని రక్షించుకోడానికే దెబ్బలాడాను గాని, లేకపోతే ఛస్తే దెబ్బలాడేవాణ్ణికాదు. అసలు నువ్వే నన్ను ఇందులోకి దింపావు. ఇదంతా మరిచిపోయి మనిద్దరం ఇకనుంచీ జతగా ఉందాము," అన్నాడు మార్టిన్ రాట్లర్.

బాబ్ సమాధానం ఇవ్వలేదు. కష్టంమీద తన వెస్ట్‌కోటు తొడుక్కున్నాడు.

"నామీద కోపంగా ఉన్నదా బాబ్? నేనేం తప్పుచెయ్యలేదని నీకు తెలుసు. జతగా ఉందాం ఇకనుంచీ" అని మళ్లీ మార్టిన్ అన్నాడు.

బాబ్ మాట్లాడలేదు.

"బాబ్! రా, రా, ఇంక కోపం మానెయ్. ఇద్దరూ స్నేహంగా ఉండండి. ఇప్పుడు మార్టిన్ నిన్ను కొట్టేశాడు ఇంకోసారి, నువ్వు అతన్ని కొడుదువుగాని," అన్నారు కొందరు పెద్దకుర్రాళ్లు.

"అరె. మీరు పొరపాటుపడ్డారు. బాబ్ క్రోకర్ మార్టిన్‌రాట్లర్‌ను ఎప్పటికీ గెలవలేడు! ఎప్పటికీ గెలవలేడు!" అని ఒక గంభీరకంఠం వెనకనుండి వినిపించింది

అందరూ వెనక్కి తిరిగారు. అంతవరకూ తమతోపాటు ఒక కొత్తవ్యక్తి కూడా అక్కడ ఉండి, కుస్తీని చూస్తున్నట్లు వాళ్లు గమనించనేలేదు. ఆ కొత్త వ్యక్తి ఒక నావికుడు. చిరునవ్వు నవ్వుతూ, ఒక చెట్టు కింద కూర్చుని, పైపు కాలుస్తూ ఉన్నాడు ఆపైపు బాగా చిన్నది, నల్లది. సాధారణంగా బీద ఐరిష్ వాళ్లు అటువంటిపైపులే వాడతారు. అతడు లేచి నుంచున్నాడు మనిషి అతిదీర్ఘకాయుడు. మంచి బలిష్ఠుడు. నిర్లక్ష్యంగా, హుందాగా బాలురదగ్గిరికి నడిచి వచ్చాడు.

★ మార్టిన్ రాట్లర్ ★

"మార్టిన్! నువ్వు రెండుకాళ్లమీదా నిలబడ గలిగినంతకాలం నిన్ను బాబ్ క్రోకర్ జయించలేడు" అంటూ ఆ ఐరిష్ నావికుడు మార్టిన్ తలను స్పృశించాడు. బాబ్ వంక తిరిగి "కుర్రాడా! ఇంత చిన్నవాడిచేతులో దెబ్బలు తినడం నీ అదృష్టం. రా, ఇతనితో చేతులు కలుపు. అతనిచేతిని పట్టుకోవడానికి కూడా నువ్వు అర్హుడివికాదు. అదీ నీ అదృష్టమే. రా. ఆ. అదీ. అలా జతగా ఉండాలి. బాబ్ క్రోకర్! 'నేను విచారిస్తున్నాను' వగైరా చెత్త మాట్లాడకు. అది అబద్ధమవుతుంది. మార్టిన్! రా, నీతో ఇంటిదాకా నేనుకూడా వస్తాను. కబుర్లు చెప్పుకుంటూ పోదాం. నువ్వు పెద్దయితే గొప్పవాడివి కాకపోతే నాపేరు బార్నీ ఓఫ్లానగన్ కానే కాదు", అని ఐరిష్ వాడు అన్నాడు.

మార్టిన్ తెల్లపిల్లిని చంకలో పెట్టుకుని బయలుదేరాడు. అతని జోళ్లుకూడా తడిసేవున్నవి. కాని కొంతసేపటికి అతని శరీరపు వెచ్చదనంచేత పిల్లివొళ్లు తడి ఆరిపోయింది. మార్టిన్, ఐరిష్ నావికునితో కలిసి ఇంటివేపు నడిచాడు. అతని మొహం దెబ్బలతో వాచి, నల్లబడిపోయింది. నెత్తురు చారికలు కట్టింది.

బాబ్ క్రోకర్ తన అనుచరులతో స్కూలువైపు వెళ్లిపోయాడు త్రోవలో నావికుడు మార్టిన్‌కు అనేకదేశాల వింతలూ, విశేషాలూ, తాను చేసిన సాహసాలు చెప్పాడు. అవన్నీ వింటుంటే మార్టిన్ రక్తం ఉప్పొంగింది. తానుకూడా సముద్రాలమీద ప్రయాణం చేయాలనే బలవత్తరమైన వాంఛ కలిగింది. వాళ్ళఊరికి అయిదుమైళ్ళదూరంలోఉన్న బిల్టన్ రేవుపట్నానికి వెళ్లినప్పుడల్లా మార్టిన్ రాట్లర్‌కు అలాటికోరికే కలిగేది. బార్నీకూడా "నువ్వు ఏదన్నా పనినేర్చుకోవోయ్. పెద్దవాడివవటంలా?" అన్నాడు. (మార్టిన్‌కు పదోయేడు.) తనతోపాటు ఓడలోకి వస్తే పని ఇప్పిస్తాననీ, చురుగ్గా పనిచేసేకుర్రాడు ఒకడు తనకి చాలా అవసరమనీ బార్నీ చెప్పాడు.

మార్టిన్ నిట్టూర్పు విడిచాడు. తనకైతే సముద్రాలమీద ప్రయాణం చెయ్యాలనుందనీ, కాని పెద్దమ్మ ఒప్పుకోదనీ అన్నాడు.

ఇద్దరూ విడిపోయేముందు, బార్నీ మార్టిన్‌ను అడిగాడు, తన నౌకలోకి ఒకసారి వచ్చిచూసి పోవలసిందని. నౌకలో ఉద్యోగానికి పంపించడానికి వీలైతే పెద్దమ్మను ఒప్పించాలని కూడా చెప్పాడు. ప్రయత్నిస్తానని మార్టిన్ అన్నాడు.

4

పైనచెప్పిన బిల్టన్ రేవుపట్టణంలో నౌకావ్యాపారం చేసి బాగా ధనంగడించిన ఒకవృద్ధ వర్తకు డుండేవాడు. అతడు వ్యాపారానికి తక్కువకాలం, సత్కార్యాలకు ఎక్కువకాలం వినియోగించేవాడు. ఆయన పేరు ఆర్థర్ జాలీబోయ్. పొట్టిగా, లావుగా, ఎర్రగా, చురుగ్గా ఉండేవాడు. ఆయన వ్యాపారానికి అట్టేకాలం వినియోగించకపోయినా, వ్యాపారం దినదినాభివృద్ధి పొందుతూనే ఉండేది. బిల్టన్ పట్టణంలో ఆర్థర్ జాలీబోయ్ సభ్యుడుగానో, డైరెక్టరుగానో, కార్యదర్శిగానో కోశాధికారిగానో ఉండని ప్రజాహితసంఘం అంటూ ఉండేదికాదు. ఏదో పరోపకారం కోసమే జీవిస్తున్నాడా అన్నట్లు ఉండేవాడు. అయినా అంత నిగర్వి మరొకడు లేడు. తన గొప్ప తాను చెప్పుకునేవాడు కాదు. మితంగా మాట్లాడడం, అమితంగా వితరణ చూపించడం ఆయనకు స్వభావసిద్ధగుణాలు.

మిసెస్ డరోతీగ్రంబిట్ మేజోళ్ళు బహు నేర్పుగా అల్లుతుం దని ఆయనకు కర్ణాకర్ణిగా తెలిసింది. తెలిసిననాటి మధ్యాహ్నమే, ఆయన ఆమె ఉండే గ్రామానికి బయలుదేరాడు. ముందు తనకు ఆప్తుడైన చర్చి అధికారిని కలుసుకుని ఆ ముచ్చటా, ఈ ముచ్చటా చెప్పి, మిసెస్ గ్రంబిట్‌ను గూర్చి అడిగాడు. ఆమె ఊరికే డబ్బిస్తే ఎంత యిచ్చినా పుచ్చుకో దని తెలుసుకున్నాడు. ఎందుచేత అని అడిగాడు.

"తనవంట్లో శక్తి ఉన్నంతకాలం, ఇతరులనుండి డబ్బు ఉచితంగా పుచ్చుకోకూడ దని ఆమె సిద్ధాంతం. అలా పుచ్చుకుంటే, పాటుపడడానికి శక్తిలేని బీదవారికి న్యాయంగా పోవలసిన డబ్బును తాను దోచుకున్నట్లవుతుందని ఆమె అంటుంది. ఆమె సిద్ధాంతంతో నేనూ ఏకీభవిస్తాను. కాని, ఆమెకు వంట్లో జవసత్వాలున్నాయనేది అబద్ధం. పాపం ఎంతపాటుపడి పనిచేసినా జీవనం గడిచేటట్లులేదు," అని చెప్పాడు చర్చి అధికారి.

"ఆమె బాగా తెలివైనదేనా?" అడిగాడు జాలీబోయ్.

"అబ్బే. చెప్పుకోదగ్గ తెలివితేట లేమీ లేవు.

నిజానికి మామూలు పనులకు కావలసినంతవరకే ఆమె తన తెలివితేటలు ఉపయోగిస్తుంది."

"అయితే చాలామందికంటె ఆమె తెలివైనదే. పెంకిఘటమా?"

"అబ్బే చాలా నెమ్మదస్తురాలు"

"సరే, వస్తాను. నాకు కొంచెం పనుంది," అన్ని, జాలీబోయ్ లేచి మిసెస్ గ్రంబిట్ ఇంటికి వెళ్లాడు.

ఒక అరగంటసేపు మాట్లాడి జాలీబోయ్ వృద్ధురాలికి సంబంధించిన అనేకవిషయాలు రాబట్టాడు. జీవనోపాధివిషయం అడిగితేమాత్రం ఆమె కొంచెం

డాల్డా

పోటీ

ముగింపు తేది అక్టోబర్ 15 వరకు పొడిగింపబడినది

జనులకు సౌకర్యముగా నుండుటకై డాల్డాక్విజ్ పోటీ అక్టోబర్ 15, 1955 వరకు పొడిగింపబడినది. ఒక పెద్ద బహుమతిని పొందేటందుకు ఈ తరుణమును ఇంక విడిచిపెట్టియుండినయెడల ఇదే మంచి అవకాశము. మీ ఎంట్రీ ఫార్మ్‌ను ఇదివరకే పంపియుండినయెడల, ఎందుకు ఇంకొక దానిని పంపించకూడదు?

ముఖ్యము

అక్టోబర్ 31, 1955న ఈ పత్రికలో తీర్పరుల నిర్ణయము ప్రకటించబడును. గెలుపొందినవారి పేర్లు నవంబర్ 30, 1955న ఈ పత్రికలో ప్రకటించబడును.

మొదటి బహుమానము...
రు. 20,001*
రెండవ బహుమానము...
రు. 5,001



* మొదటి బహుమతిని గెలుపొందినవారు ఒక్కరుగాని లేక అందరూ కలిసిగాని అదనపు రు 20,001లను బిడ్డల ఆస్పత్రికిగాని లేక వార్డుకుగాని యిచ్చే హక్కును గూడ గలిగియుందురు.

ఒక ఎంట్రీ ఫారమ్‌ను మీ డాల్డా వ్యాపారివద్ద తీసుకోండి

(బొంబాయి, హైదరాబాద్, సౌరాష్ట్ర మరియు మైసూరు రాష్ట్రములందు నివసించువారు తప్ప) తదితరులందరూ పాల్గొనవచ్చును.

HVM. 259-X52 TL

విసుక్కునేది. కాని చెల్లెలికొడుకుసంగతి వస్తే బడబడ వాగేసేది. మార్టిన్‌రాట్లర్ చాలా ఆకతాయివాడని మొదట్లోనే నిర్ధారణగా చెప్పింది. అతన్నిగూర్చి మాట్లాడుకుంటూపోవడంలో, ఆ సంగతే మర్చిపోయి, చివరికి అంత మంచిపిల్లవాడు ఇక లోకంలో లేడనే అభిప్రాయం కలగజేసింది. మార్టిన్‌నుగూర్చి ఇద్దరూ చాలసేపు సంభాషించారు. చివరికి, అంతా విని జాలీబోయ్ తాను మార్టిన్‌ను ఓడఁలపనికి తర్ఫీదు చేస్తానని వాగ్దానం చేశాడు. మిసెస్ గ్రంబిట్ "అమ్మో, ఓడలపనే" అన్నట్లు నిర్ఘాంతపోయింది. ఆమె కది ఇష్టంలేదని తెలుసుకుని, తన కార్యాలయంలో గుమాస్తాపని ఇస్తానని, క్రమంగా ఆపనిలోనే అభివృద్ధికి రాగల డనీ జాలీబోయ్ చెప్పాడు. మిసెస్ గ్రంబిట్ ఆనందం వర్ణనాతీతమైంది.

"సరేగాని, మిసెస్ గ్రంబిట్! మీరు మేజోళ్లు బాగా అల్లుతారని తెలిసింది. నాకు రెండువేలజతలు మీ రెంతత్వరలో ఇవ్వగలిగితే అంత త్వరలో కావాలి," అన్నాడు జాలీబోయ్.

మిసెస్ గ్రంభిట్ కళ్లు ఆశ్చర్యంతో విప్పారాయి.

"నా సొంతానికి కాదనుకోండి. నాకు కుటుంబం అంటూ లేదు గనుక నా కుటుంబానికి కూడా కాదు. ఒకవేళ నావాళ్లంటూ ఉన్నా వాళ్ళకి అన్ని అనవసరం. విషయ మేమిటంటే, నేను వర్తకుణ్ణి నేను ఇతరదేశాలకు వస్తువులు ఎగుమతిచేస్తూఉంటాను. రెండువేలు జతలంటే నాకు పెద్దలెక్కలోది కాదు. అయితే అన్ని తయారుచెయ్యడం మీకు కష్టం కావచ్చు. పోని మీకు వీలైనన్నే తయారుచెయ్యండి," అన్నాడు జాలీబోయ్.

"కష్టమేమీ కాదు—" అని మిసెస్ గ్రంబిట్ ఏదో అనబోయింది.

"కాని ఒక చిన్నమాట. నాకు ఒక చిత్రమైన మాదిరిగా అల్లినమేజోళ్లే కావాలి. దానివల్ల మీకు శ్రమ ఎక్కువ కావచ్చు. దానికి మీ రెంత ఎక్కువ ప్రతిఫలం ఇమ్మన్నా ఇస్తాను మామూలుగా జతకు మీ రెంత పుచ్చుకుంటారు?"

"మూడు షిల్లింగులు."

"మంచిది. సరే మీ అల్లికసూదులు తీసుకోండి. ఈ సూదిని ఇటునించి అటు పోనివ్వండి—ఆ. అది. ఆ సూదిని ఇటు రానివ్వండి. అది. అంతే. ఇప్పుడేమైంది?"

ఒక చిత్రమైన మెలికముడి పడింది. మిసెస్ గ్రంబిట్ కొన్నిక్షణాలు తేరి పారచూసి "ఇలా అల్లినందువల్ల ఏమిటి లాభం?" అని అడిగింది.

"ఎందుకైతే మీకేం? నాకు కొన్ని చిత్రమైన ఊహ లొస్తూ ఉంటాయి. విదేశీయులకు కొన్ని చిత్రమైన ఫేషన్ల వస్తువులంటే మోజు. సీలమండ పైభాగం నుంచి మేజోడుకు ఈమాదిరి ముళ్ళువచ్చేట్టుగా అన్నీ అదేపద్ధతిలో అల్లాలి. మీకు శ్రమ ఎక్కు విచ్చినందుకు ఏ మనుకోవద్దు జతకు ఆరేసి షిల్లింగు లిస్తాను ఏమంటారు?"

"ఎందుకు, వద్దువద్దు. అసలు ఇది ఎక్కువశ్రమ

ప్రఖ్యాత ఫ్రెంచి నవలాకారుడు

విక్టర్ హ్యూగో రచించిన

★ ఘంటారావం ★

నవలకు పుస్తకరూపంలో తెనుగు అనువాదం

అనువాదకులు సూరంపూడి సీతారామ్

వెల రు: 1-8-0 పోస్టుఖర్చులు ప్రత్యేకము

ఆంధ్రగ్రంథమాల,


మదరాసు-1.

మాలతీ చందూర్ రచనలు:

చంపకం - - చదపురుగులూ	1 8 0
రేణుకాదేవి ఆత్మకథ	1 8 0
పాప (కథల సంపుటి)	1 8 0
మాలతీ చందూర్ కథలు	1 0 0

5-8-0 M O పంపిన వారికి పై నాలుగు పుస్తకాలూ పోసు ఖర్చులు భరించి పంపగలం

దేశకవితామండలి, విజయవాడ - 2



చైనీస్ కథలు: ఫెంగ్ స్వే - ఫెంగ్:

15. తుపానులో సాలెపురుగు

ఆ మధ్యాహ్నమంతా గాలి ఆడలేదు. ఎండ తీవ్రంగా కాసింది. ఎక్కడో దూరంగా మేఘాలు గర్జించాయి. మేఘగర్జన క్రమంగా సమీపించింది. మెల్లిగా కాటుక మబ్బులు ఆకాశంలో గుమిగూడాయి. పెద్ద తుపానువచ్చే సూచనలు స్పష్టంగా కనిపించాయి.

ఒక చెట్టుమీద గూడుకట్టుకుని గూడుమీద నిలిచిన ఒక సాలెపురుగు ఇదంతాచూసింది. తనే ఆ తుపాను తెప్పించినట్లుగా అంతా అనుకోవాలని, తనే ఆ ప్రళయానికి ప్రవక్తనని అనిపించుకోవాలని దానికి కోరిక పుట్టింది. గంభీరంగా ఆమంత్రణం చేయసాగింది:

"ఆసన్నమైంది కాలం!
అదిగో మహాప్రళయం!
ఓ ధగద్ధగత్తటిత్కాంతిమాలా! రా!
ఓ ప్రళయమేఘ ఫెళఫెళార్భటీ! రా!
రాకతప్పదు రాకతప్పదు !
లోకమంతా పెనుతుపాను!!"

అని సాలెపురుగు ఎలుగెత్తి ఆహ్వానం పంపింది.

తుపాను వచ్చింది. అప్పుడు చూడాలి సాలెపురుగును. గూటితో, చెట్టుతోపాటు తనూ కంపించిపోయింది చివరికొక ఆకు పట్టుకుని ప్రాణభీతితో గజగజలాడుతూ వేలాడింది. భయంతో దానికి స్పృహ తప్పిపోయింది. తుపాను విజృంభణం అంతాతగ్గి, తూర్పుదిక్కున అద్భుతమైన ఇంద్రధనుస్సు ఉదయించి, పడమటి దిక్కున సాయంకాలపు తెల్లని మబ్బు పింజెలు ఉషారుగా షికారు బయలుదేరేసమయానికిగాని సాలెపురుగుకు తెలివి రాలేదు. అప్పుడది కళ్లుతెరిచి "ఇప్పుడెన్నిగంటలైంది?" అని భయపడుతూ అడిగింది.

"చెలికాడా! నిజంగా తుపాను వచ్చినప్పుడుకూడా నువ్వు ధైర్యంగానే నిలబడిఉంటే, నీకు కావలసిన పేరు ప్రతిష్ఠలు, ప్రవక్తబిరుదం వచ్చేవిగదా!" అని సానీడుతో అన్నది చెట్టు. ★

కానేకాదు. మామూలు ప్రకారమే ఇవ్వండి—" అని మిసెస్ గ్రంబిట్ అంటూనేఉంది. ఇంతలో జాలీబోయ్ అందుకుని—

"రెండువేల జతలు—మరిచిపోవద్దు," అని ఆమెను మాట్లాడనీయలేదు.

ఇంతలో తలుపులు బార్లాతెరుచుకుని మార్టిన్ రాట్లర్ లోపలికి వచ్చాడు. చంకలో తెల్లపిల్లి ఉంది. అతన్ని చూట్టంతోనే మిసెస్ గ్రంబిట్ కెవ్వున అరిచింది. జాలీబోయ్ చేతులోంచి కళ్లజోడు జారిపోయింది.

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా ఉన్నారు. జాలీబోయ్ ముఖంలో ఆశ్చర్యం, విసుగుదల కనిపించాయి.

"మిసెస్ గ్రంబిట్! పోట్లాట అంటే ఏవగించుకునే మీ అబ్బాయి ఇతడేనా?" అని ఆయన అడిగాడు.

"అవును వీడే మా మార్టిన్!" అన్నదామె చేతుల్తో ముఖం కప్పుకుంటూ.

"మా పెద్దమ్మ మీతో అలాచెప్పి ఉంటే అది నిజమే,"అంటూ మార్టిన్ తెల్లపిల్లిని నేలమీద దించాడు. అది వెంటనే వంటికి అంటిన నెత్తురు మరకలను వంటితడినీ నాక్కోవడం మొదలెట్టింది.

"గత్యంతరంలేక, దెబ్బలాడవలసివచ్చినప్పుడే నేను దెబ్బలాడతాను. మామూలుగా దెబ్బలాడే స్వభావం కాదు నాది. ఇవ్వాళ గత్యంతరం లేకపోయింది—"అని మార్టిన్ రాట్లర్, ఇందాక ఏ ఆవేశంతో దెబ్బలాడాడో ఆ ఆవేశంతోనే జరిగిన దంతా పూసగుచ్చినట్టు వివరించాడు. అతడు దెబ్బలాటను వర్ణిస్తుంటే మిసెస్ గ్రంబిట్ అతన్ని చేతుల్లోకి తీసుకుని, తల నిమురుతూ, తను ఏడుస్తూ అంతా విన్నది. జాలీబోయ్ కూడా చివరిదాకా విని"బలేవాడివోయ్. బలేవాడివి," అని మార్టిన్‌ను వీపుమీద తట్టి "పో, మొహం కడుక్కో ముందు"అన్నాడు. అతడు వెళ్లాక, మిసెస్ గ్రంబిట్‌తో ఏదో చెప్పాడు. ఆమె ముఖం సంతోషంతో వికసించింది. తరవాత లేచి, తను చూడకుండా ఇందాకటినుంచీ కూర్చుని నలగకొట్టిన టోపీ తీసుకుని దాన్ని సాపుచేయడానికి ప్రయత్నించి, కుదరక, దాన్నే తలమీద పెట్టుకుని, మళ్ళీ వస్తానని చెప్పి, సెలవుతీసుకుని, చిరునవ్వు నవ్వుకుంటూ జాలీబోయ్ తిరుగుదారి పట్టాడు.

(ఇంకా ఉంది)

"బిరాజ్ బహు"

శరత్ బాబు నవల ఆధారంగా హితేన్ చౌధురి నిర్మించిన "బిరాజ్ బహు" హిందీ చిత్రం బొంబాయిలో విడుదల అయిన చాల కాలానికి మద్రాసులో (స్టార్ టాకీస్) విడుదల అయినది. దీని దర్శకుడు బిమల్ రాయ్. కామినీకౌశల్, అభిభట్టాచార్య ప్రధాన పాత్రలు ధరించారు.

నీలాంబర్ భార్య బిరాజ్ అసమాన రూపవతి. ఆమెను భర్త అమితంగా ప్రేమిస్తాడు. ఎన్ని కష్టాలు వచ్చినా వారిద్దరి అన్యోన్యానురాగం చెక్కు చెదరదు. కామాంధుడైన ఒక జమీందారు బిరాజ్ పై కన్ను వేయడంతో వారిద్దరిలో కలతలు ప్రారంభమవుతాయి. ఇరుగు పొరుగువారి మాటలతో మనసు విరిగి నీలాంబర్ భార్యను అవమానిస్తాడు. ఆమె ఇల్లు విడిచి ఆత్మహత్య చేసుకోడానికి బయలుదేరుతుంది. ఆమెనెవరో రక్షిస్తారు. భర్త సన్నిధిలోనే ప్రాణం విడవాలని ఆమె తిరుగు ప్రయాణం సాగిస్తుంది. చివరికి భర్తను చేరుకొని అతని పాదాలవద్దనే మరణిస్తుంది.

సంఘవంచిత అయిన స్త్రీ నిస్సహాయతను చూపించడమే ఈ కథకు పరమార్థంగా కనబడుతుంది. ఈ కథను అతి కరుణాన్వితంగా, నిపుణంగా బిమల్ రాయ్ చిత్రించారు. దర్శకత్వంలో ప్రత్యేక శైలి అంటూ కొంతయినా ఉన్న కొద్దిమంది భారతీయ దర్శకులలో ఆయన కొకడని అనిపిస్తుంది. బొంబాయి పద్ధతులతో అక్కడక్కడ రాజీపడినట్లు కనిపించినా మొత్తంమీద నిజాయితీ కనిపిస్తుంది. సలిల్ చౌధురి సంగీత దర్శకత్వం క్రింద హేమంతకుమార్, రఫీ పాడిన భజనగీతలు శ్రావ్యంగా ఉన్నాయి.

"వదినగారి గాజులు"

గోకుల్ ఎక్స్‌ప్రెస్‌వారు కొంత కాలం క్రితం విడుదల చేసిన "వదినగారి గాజులు" చిత్రాన్ని సినీ టెక్నీషియన్ల సంఘంవారు సెప్టెంబరు 25వ తేదీన [illegible] థియేటరులో టెక్నికల్ పరిశీలనకోసం ప్రదర్శించనున్నారు. ఒక మరాఠీ చిత్రం ఆధారంగా యువకదర్శకుడు రజనీకాంత్ ఈ చిత్రం తీశారు. స్త్రీ హృదయాలను, ముఖ్యంగా మాతృహృదయాలను కరిగించే ప్రధానాశయంతో తీసిన ఈ చిత్రం ఆ ఆశయాన్ని నెరవేర్చింది. కొన్ని కొన్ని [illegible] రచన, సంగీతము హాయిగా ఉన్నాయి. రజనీకాంత్ గారికి దర్శకత్వంలో ఇది ప్రథమానుభవం. ఇది విజయవంతం అయినందున, ఆయన ఇంకా మంచి చిత్రాలు తీసి అగ్రశ్రేణి అందుకోగలరని ఆశించవచ్చును.

"రోజులు మారాయి" రజతోత్సవం

సారథి చిత్రం "రోజులు మారాయి" మూడు కేంద్రాలలో రజతోత్సవం చేసుకోబోతున్న సందర్భంలో [illegible] గడచిన 25వ తేది సాయంత్రం ఎగ్మోర్, విలింగ్డన్ భవనావరణంలో ఉత్సవ కార్యక్రమాన్ని మద్రాస్ గవర్నరు శ్రీ ప్రకాశ గారిచే ప్రారంభం చేయించారు. తారలు, దర్శకులు, టెక్నీషియన్లు, ఇంకా పలువురు అతిథులు సభకు హాజరయ్యారు. విగ్న

విక్రమ్ ప్రొడక్షన్స్ వారు తీస్తున్న "తెనాలి రామకృష్ణ"లో పాండురంగ మాహాత్మ్యం రచించిన ప్రౌఢకవి రామకృష్ణునిగా నాగేశ్వరరావు, అప్పాజీగా నాగయ్య





కవిత్వంలో అనన్య విలక్షణత చూపిన రామకృష్ణుని జీవిత చిత్రం "తెనాలి రామకృష్ణ"లో కృష్ణదేవరాయలుగా ఎన్. టి. రామారావు, మహాకవిగా నాగేశ్వరరావు

ద్వీపాలంకృతమైన ఆవరణంలో విందు జరిగింది. సారథి మేనేజింగ్ డైరెక్టరు రామకృష్ణప్రసాద్ గారు తమ చిత్రవిజయానికి ముఖ్యకారణం "జాతీయ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలలో కలిగిన నూతన చైతన్యమే"నని చెప్పారు. తెలుగు చిత్రవిజయం తమిళంలో అదే కథతో చిత్రం నిర్మించడానికి తమ్ము ప్రోత్సహించిందని అన్నారు. రజతోత్సవాన్ని, తమిళ చిత్రాన్ని ("కాలం మారిపోచ్చు") ప్రారంభిస్తూ గవర్నర్ శ్రీ ప్రకాశ గారు తాను ఈ తెలుగు చిత్రాన్ని చూడలేదనీ, చూసినా భాష తెలియని కారణంచేత అర్థమయ్యేది కాదనీ, అయినా కథ సంగ్రహంగా చదివి తెలుసుకున్నాననీ చెప్పారు. మారిపోతున్న రోజులకు ఈ కథ అనుగుణంగానే ఉన్నదని ఆయన అన్నారు. వర్తమాన పరిస్థితులను శాంతియుత విప్లవం ద్వారా మార్చడానికి భారతప్రభుత్వం కృషి చేస్తున్నదనీ, ఆ కృషికి చలనచిత్రాలు తోడ్పడాలని ఆయన కోరారు. ప్రజలకు అనేక విషయాలమీద నీతి బోధించే ఈ చిత్రం విజయం పొందడంవల్ల భయానక చిత్రాలకే ప్రజాదరణ ఉంటుందనేమాట సరియైనది కాదని తేలుతోందని ఆయన అన్నారు. "ఆంధ్రులు ఉద్వేగవంతులు. వారిలో రోజులు మారాలనే వాంఛ అధికం. అందువల్ల ఈ తెలుగు చిత్రం విజయం పొందింది. ఈ రాష్ట్రం ప్రజలంత ఆ స్వభావం తక్కువ అయినప్పటికీ మా తమిళ చిత్రం విజయం పొందాలని కాంక్షిస్తున్నాను," అని నిర్మాతలకు తెలిపారు.

తరువాత శ్రీ ప్రకాశ గారు రజతోత్సవ చిహ్నాన్ని ఆవిష్కరించారు. కుమారి సరోజ భరతనాట్య ప్రదర్శనంతో సభ జయప్రదంగా ముగిసింది.

"రోజులు మారాయి" డైరెక్టు చేసిన తాపీ చాణక్యగారికి ఆయన వృద్ధజనకులు ధర్మారావుగారు ఒక స్వర్ణాంగుళీయకం ఈ సందర్భంలో బహూకరించగా, శ్రీ ప్రకాశ గారు దానిని చాణక్యగారికి అందజేశారు.


"కనకతార"

గోకుల్ పిక్చర్స్ వారు "కనకతార" చిత్రం నిర్మిస్తున్నారు. రజనీకాంత్ గారే ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్. వరలక్ష్మి, ఎస్. వి. రంగారావు, ఘుమ్మడి వెంకటేశ్వరరావు, రమణారెడ్డి, కుటుంబరావు ప్రభృతులు నటిస్తున్నారు. ఘంటసాల సంగీత దర్శకుడు. సంభాషణలు జంపన రచిస్తున్నారు. రెండుపాటలు ఇప్పటికి రికార్డుఅయినవి. స్టూడియో శివస్.

చలన చిత్రంలో రచయిత స్థానం

"ప్రస్తుతం చలనచిత్ర నిర్మాణంలో అందరికంటె తక్కువ స్థానం రచయితది. నిర్మాత అభిరుచులకు, అభిప్రాయాలకు అనుగుణంగా తనంచి రచయిత పని చెయ్యాలి. అయినా చలనచిత్ర రచనలో ఒక ఆకర్షణ ఉన్నది. గ్రంథాలద్వారా కంటే చిత్రాలద్వారా ఎన్నో రెట్లు ఎక్కువమందికి ప్రజలకు సన్నిహితంగా రచయిత వెళ్ళవచ్చును. నిర్మాత అభిప్రాయానికి అవునంటూనే, ఎక్కడో ఒకచోట తన స్వీయభావాన్ని చొప్పించి ప్రజల హృదయాలను చూరగొనవచ్చును. అందుచేత మంచి సాహిత్యకారులు, ఉత్తమ కవులు, రచయితలు ఇతోధికంగా చిత్రాలలోకి రావాలి. పెరిగిన చిత్రాల స్థాయి పెరుగుతుంది," అని హిందీ చిత్రరచయిత రామానందసాగర్ గడచిన 26వ తేది సాయంత్రం దక్షిణ భారత ఫిలిం పత్రికా రచయితల సంఘం ఏర్పాటుచేసిన సభలో ఉపన్యసించారు.

సంఘాధ్యక్షుడు రామన్ గారు రామానందసాగర్ ను ఆహ్వానించారు. సాగర్ చలన చిత్రంలో రచయిత పాత్రను గూర్చి మాట్లాడుతూ తమ అనుభవాలను వివరించారు. "ఒక్కొక్కసారి, సినిమాలకి రాయకూడదు, వేరే విధంగా సాహిత్యసేవ చేయడం మంచిది అనిపిస్తుంది. కాని చలనచిత్ర రచనలో ఏదో ఆకర్షణ సంతృప్తి ఉన్నది. అసంఖ్యాక ప్రజలను ఎమోపంచ



చేసిన తప్పులకు క్షమాపణ చెప్పుకుని ప్రేయసిని సమాధానపరుస్తున్నాడు రాముడు.
అన్నపూర్ణావారి 'దొంగ రాముడు'లో సావిత్రి, నాగేశ్వరరావు.

దానికి చిత్రంకంటె మంచి సాధనంలేదు," అని ఆయన అన్నారు.

"కాలం మారుతున్నది. ఈ మార్పుకు మార్గం చూపించడం, మార్గదర్శి కావడం కళాకారుని ధర్మం. సినిమా కళాకారులు కూడా ఈ ధర్మాన్ని నిర్వర్తించాలి. ఏ కళా కాలానికి వెనకబడి జీవించలేదు. కాలంతో పాటు పురోగమించాలి," అని ఆయన చెప్పారు.

రామానందసాగర్ జెమినీవారి "ఇన్సానియత్" చిత్రానికి సంభాషణలు వ్రాశారు. తన మద్రాసు అనుభవాలను చెబుతూ, బొంబాయిలో ఎంత ఆడంబరం, పటాటోపం, కనిపిస్తుందో మద్రాసులో అంత నిరాడంబరం, అంత సామర్థ్యం కనిపిస్తుందనీ, జెమినీ స్టూడియోలో వాసన్‌గారితో పనిచేయడం తనకు చాలా గర్వకారణం, సంతోషప్రదం అనీ ఆయన అన్నారు.

కార్యదర్శి "పార్థ" అభినందనలతో సభ ముగిసింది. ★

బొంబాయి సినిమా లేఖ

దేశంలోని చిత్రనిర్మాతలలో ఐకమత్య భావం కలిగించడానికి ఐ ఎమ్ పి పి ఎ అధ్యక్షుడు ఎస్ కె పాటిల్ తిరిగి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం బొంబాయి నిర్మాతలు మూడు సంఘాలుగా చీలిపోయి ఉన్నారు. అన్నిటికంటె పెద్దది ఐ. ఎమ్. పి. పి. ఎ. దీనినుండి విడిపోయిన నిర్మాతలు కొందరు కలిసి స్వతంత్రచలన చిత్రనిర్మాతల సంఘాన్ని స్థాపించారు. ఈ రెండూ కాక మరొకటి ప్రొడ్యూసర్స్ గిల్డ్. ఇందులో ఎనిమిదిమంది పెద్దనిర్మాతలున్నారు. వీరందరూ స్టూడియోలు కలవారే వీరు శాంతారాం, ఎస్ ముఖర్జీ టి ఆర్ జలాన్, సొహరాబ్ మోడీ, విజయభట్, ఎ ఆర్. కర్దార్, మెహబూబ్, రాజ్ కపూర్.

అమెరికాలో నిర్మాతలకు ఒకే సంఘం ఉన్నట్లుగా, భారతదేశంలో కూడా ఒకటే సంఘం ఉండాలని, అందుచేత బొంబాయి నిర్మాతలేకాక, బెంగాలీ, దక్షిణ భారత నిర్మాతలుకూడా ఐ. ఎమ్. పి. పి. ఎ. లో చేరి దానిని పటిష్ఠంచేయాలనీ పాటిల్ గారు విజ్ఞప్తి చేశారు. ఐకమత్యం లేకపోవడం వల్లనే చిత్రపరిశ్రమ పరిశ్రమగా పరిగణింపబడడం లేదనీ, సమాచార శాఖామంత్రికి ఈపరిశ్రమపై అధికారం ఉండడానికి కూడా అదే కారణమనీ పాటిల్ గారు అన్నారు. చలనచిత్రాలు విద్యాదాయకములనికూడా పరిగణింపకపోవడంచేత, విద్యాశాఖవారు కూడా ఈ పరిశ్రమకేసి కన్నెత్తి చూడడంలేదని ఆయన అన్నారు. అందుచేత కొన్ని ముఠాలు, ప్రభుత్వవ్యక్తులు, పెట్టుబడి పెట్టేవారు 'ఎవరికివారే'గా ఉన్న నిర్మాతలను స్వార్థానికి వినియోగించుకుంటున్నారు. పాటిల్ గారి ఐకమత్య విజ్ఞప్తిని మన్నించి భారతీయనిర్మాతలు వివేకంతో వ్యవహరిస్తారని పరిశ్రమ శ్రేయోభిలాషులు ఆశిస్తున్నారు.

*　　*　　*

పాటిల్ గారి నాయకత్వం వచ్చినతర్వాత ఐ. ఎమ్. పి. పి. ఎ. స్వయంనిబంధన విధానం అమలుచేస్తున్నది. నిర్మాత రమేష్ చంద్ర సమావేశకర్తగా ఒక ప్రత్యేకసంఘాన్ని ఏర్పాటుచేసి, నిర్మాతలకు సెన్సార్ షిప్పు ఇబ్బందులు లేకుండా ఉండే రీతిగా స్క్రిప్టులను ముందే సంస్కరించడానికి, సెన్సారు అధికారులకు చూపించేముందే చిత్రాన్ని ఒకసారి సెన్సార్ చేసి చూసుకునేందుకు ఆసంఘంద్వారా ప్రయ



ఆర్. కె. ఫిలిమ్సువారి "శ్రీ 420" లో నర్గీస్, రాజ్‌కపూర్.

★ బొంబాయి సినిమా లేఖ ★

శిస్తున్నారు. నిర్మాతలకు, సెన్సార్లకు మధ్య ఈసంఘం సక్రమ సంబంధాలుండేటట్లుగా పనిచేస్తున్నది. కనీసం రెండు సందర్భాల్లో ఈసంఘం కృతకృత్యమైనది. సిప్పీ ఫిలిమ్సువారి "మెరైన్ డ్రైవ్"ను ప్రదర్శించెయ్యడానికి సెన్సార్లు నిరాకరించగా పైసంఘం కలగజేసుకుని రాజీ కుదిర్చింది. మరొకచిత్రం విషయంలోకూడా ఇదేమాదిరిగా రాజీ కుదిర్చింది.

* * *

ఫిల్మిస్తాన్‌వారి "మూడు తలల త్రాచు" సినిమాస్కోప్ చిత్రం తాలూకు స్క్రిప్టు సెన్సార్లకు సమర్పింపబడినది. ఈచిత్రానికి ఒకానొక విక్టర్ కటోనా నిర్మాత, మరొకానొక రతోని దర్శకుడు. నటులు కూడా ప్రేక్షకులకు బాగా పరిచితులైనవారు కారు. గడచిన పదేళ్ళలో ఎప్పుడూ తెరమీద కనిపించని జాన్‌లోడర్, రెండో తరగతి పాత్రలు ధరించే అలెక్సిస్ అక్సీ కాక ఈచిత్రంలో వినీతాబట్, సూర్యకుమారి, ప్రేమ్‌నాథ్ ఉన్నారు. చెప్పుకోదగ్గ పెద్ద భారతీయ నటుడల్లా అశోక్‌కుమార్ ఒక్కడే ఇందులో ఉన్నాడు.

డి అక్సీ నాయకపాత్ర ధరిస్తున్నాడు. అక్కాచెల్లెళ్ళ పాత్రలుధరించే సూర్యకుమారి, వినీతాబట్ లిరువురూ అమెరికన్ పైలట్ నొకణ్ణి ప్రేమిస్తారు. అతడు ఇద్దర్నీ ప్రేమిస్తాడు. అశోక్‌కుమార్ మంచివాడైన మహారాజా పాత్ర, ప్రేమ్‌నాథ్ ఒక యువరాజుపాత్ర, జాన్ లోడర్ విలన్ పాత్ర ధరిస్తున్నారు. భారతీయ యువతులిద్దర్నీ డీఅక్సీ హాలీవుడ్‌పద్ధతిలో, చుంబనాలింగనాదులతో సహా ప్రేమిస్తాడు. ఈ చుంబనదృశ్యాలు కొన్ని పత్రికలలో ప్రచురింపబడినవి. ఈ దృశ్యాలతో సహా ఆ చిత్రాన్ని సెన్సార్ బోర్డు ఆమోదిస్తే, అదేమాదిరికథ, సన్నివేశాలు కల మరొక భారతీయచిత్రాన్ని సెన్సారువారు నిరాకరించడానికి వీలుండదు. భారతీయ సంస్కృతికి విరుద్ధమని చుంబనాలను భారతీయచిత్రాల్లో నిషేధిస్తున్నప్పుడు, అంతర్జాతీయ ప్రదర్శనకోసం భారతదేశంలో తయారైనచిత్రానికిమాత్రం ఆ నిషేధం వర్తించదా?

* * *

కర్దార్ చిత్రం "బాప్ రే బాప్" షోరీ చిత్రం "జాల్వా" బొంబాయిలో ఇటీవల విడుదల అయినవి. కిశోర్‌కుమార్ నటన, ఓ. పి. నయ్యర్ సంగీత దర్శకత్వంతో రాణించిన 'బాప్‌రేబాప్' లిబర్టీథియేటర్‌లో విజయవంతంగా నడుస్తున్నది. ప్రతి బిశ్వాస్, జయంత్ బాగా నటించారు. నాయిక చాంద్ ఉస్మానీ పాత్రధారణం ఏమీ బాగా లేదు.

రూప్ కె. షోరీ డైరెక్ట్ చేసిన "జాల్వా" చిత్రంలో మీనాషోరీ, బేగంపారా, కరణ్ దివాన్, అమర్‌నాథ్ నటించారు. పేలవమైన కథ, ఒక మోస్తరు దర్శకత్వం, పేలవమైన సంగీతం ఈ చిత్రం లక్షణాలు

వినాయక చవితినాడు "బసంత్ బహార్" చిత్రానికి భారత్‌భూషణ్ ప్రారంభోత్సవం చేశాడు. గోపాల్ అనే గాయకుడుగా భారత్‌భూషణ్, అతడు ప్రేమించిన వేశ్యగా నిమ్మీ, ఇంకా చంద్రశేఖర్, అమర్, ఓంప్రకాష్, లీలా చిట్నీస్, కుంకుం, ఇందిర ఈ చిత్రంలో నటిస్తున్నారు. దర్శకత్వం రాజానవాతే, సంభాషణలు రాజేంద్రబేడీ, సంగీతం శంకర్ - జైకిషన్ నిర్వహిస్తారు.

(ఆంధ్ర వారపత్రిక విలేఖరి)



శాంతారాం తీసిన టెక్నికలర్ చిత్రం "ఝనక్ ఝనక్ పాయల్ బాజే" లో సంధ్య, గోపీకృష్ణ.

★ సాలభంజిక ★

(11-వ పేజీ తరువాయి)

దుర్మార్గుడయిన రాజా. అన్నట్టు ఈ రాజా పేరు తలచుకోగానే నాకూ ఒక పద్యం జ్ఞాపకం వస్తున్నాది.

భోజరాజ మహారాజా
భోజనానికి లేదయా.

ఆహా, ఎంత మంచి కవిత్వం. ఆకలి కవిత్వం. అసలు సిసలు నిజమైన కవిత్వం.

కవి: ఏమండోయి కవిత్వం నా సొమ్ము. దానిగురించి మాట్లాడడానికి మీకు అధికారం లేదు.

పచ: ఇలాంటి కవిత్వం మీ రెప్పుడేనా చెప్పారా.

కవి: అది కవిత్వమేమిటి, నా మొహం.

పచ: కవిత్వమంటే ఇదే కవిత్వం. భోజరాజా, అని చెప్పాక మహారాజా అని కవి ఎందుకు వాడాడు. ఓయీ నువ్వు సామాన్యమైన పోలంగి రాజువి కావు, గొప్పవాడివి. నీ పాలనలోనే నాకు భోజనానికి లేదయా అన్నాడు. ఇక్కడ నాకు అంటే కవికి అని అర్థం చెప్పకూడదు. సామాన్య మానవుడికి, వీధి మానిసికి.

కవి: చాలించండి - ఈ నిరక్షరాస్య వ్యాఖ్యానం.

ప్ర: అసలు కథని ఆపేశారేం అదేమిటో చెప్పనిండి.

పచ: కానీయమ్మా కథా నీ కథ.

కథ: విక్రమార్కుడి సింహాసనం భోజరాజుకి దొరికింది.

ప్ర: ఎలా దొరికింది? భూమిలో పాతేశారుగా సింహాసనాన్ని.

పచ: దశరథ మహారాజు భూమి దున్నుతుండగా సీత దొరికినట్టు -

కవి: దశరథ మహారాజు కాదయ్యా జనకుడు. రాజకీయాలవాడు పురాణగాథలు ఎత్తుకొంటే ఇలానే ఉంటుంది.

పచ: ఎవరో ఒకరు. జనకుడు భూమి దున్నుతూ ఉండగా సీత దొరికినట్టు -

కవి: భోజరాజుచేత నాగలి పట్టించి దున్నించుతారా.

పచ: నా ఉద్దేశంలో భోజరాజు దుర్మార్గుడయిన రాజు అతడి పాలనలో సామాన్య జనులకి భోజనానికి ఉండేది కాదు. బంగారు వర్షం పడుతున్నా నిరుపేదలకి లాభం ఉండేది కాదు. అలాంటి రాజు భూమి దున్నేడంటే కథ రక్తికట్టదు.

ప్ర: అసలు ఇంతకీ ఏం జరిగిందో కథనే అడగకూడదూ.

పచ: భోజరాజుకి ఈ సింహాసనం ఏలా దొరికిందమ్మా.

కథ: ఆరాజు ఒకనాడు దారంటపోతూ ఉండగా.

ప్ర: ఒంటరిగా పోతున్నాడా?

కథ: లేదు. సపరివార సమేతంగానే.

కవి: తప్పు - సపరివారసమేతంగా అని అనకూడదు. ఒకటే సపరివారంగా అనాలి. లేదా పరివారసమేతంగా అని అనాలి.

పచ: ఉండవయ్యా. నువ్వూ నీ వ్యాకరణం. సపరివార సమేతంగా అంటే ఎంతో చక్కగా ఉంది. వినసొంపుగా ఉంది. అన్నట్టు శుభలేఖల్లో...

కవి: తప్పు-శుభలేఖ అనాలి.

పచ: సరే. ఆ శుభలేఖల్లో సకుటుంబ సపరివారసమేతంగా అని రాస్తారుగా.

కవి: రాయరు-అది తప్పు.

ప్ర: మీరు అనవసరపు వాదనలు ఆపి కథని సాగనిస్తారా?

కథ: భోజరాజు పరివారంతో పాటు పోతూ ఉండగా ఒక పొలం వచ్చింది.

కవి: పొలం వాళ్లదగ్గరికొచ్చిందా? వాళ్లే పొలందగ్గరికొచ్చారా?

ప్ర: ఏదైనా ఒకటేగా కథ కానియ్యండి

కథ: ఆ పొలంలో మంచె మీద ఒక ఆసామీ ఉన్నాడు. అతడు రాజుని చూసి రాజా నువ్వు ఆకలితో పోతున్నావు. నా పొలం బాగా పండింది. నువ్వూ సపరివార సమేతంగా పొలంలో పడి...

కవి: అదుగో మళ్లా సపరివారసమేతంగా అంటావు.

కథ: అలవాట్లో పొరపాటు పరివారసమేతంగా పడి కంకులు కడుపునిండా తిను అన్నాడు ఆ ఆసామీ. రాజు తినడం మొదలెట్టాడు. ఆసామీ మంచె దిగి అయ్యో రాజా. నిరుపేదవాణ్ణి. ఏటి కేడాది కష్టపడి పండించుకొన్న పంటని సైనికులతో పాటు

వచ్చి దోచుకొంటావా. రక్షించవలసిన వాడివి నువ్వే నా పంటని భక్షించి వేస్తావా? అని వాపోయాడు.

వచ: ఆహా. ఆధునిక పరిస్థితులకి బాగా ఉపకరించే కథ. రాజులు రైతుల్ని ఎలా దోచుకొంటారో దీనితో నిరూపించవచ్చు. అయితే మంచెమీద నించున్న ఆసామీ రాజుని ఆహ్వానించినట్టు కథలో ఉంది. అది మార్చేద్దాం.

ప్ర: ఉండవయ్యా నువ్వూ నీమార్పులూను
కథ ఏమిటో కడాకా విను.

కథ: ఆ ఆసామీ అలా మొరపెట్టుకొంటే రాజు సిగ్గుపడి వెళ్లిపోయాడు. ఆసామీ మళ్ళా మంచె ఎక్కాడు. ఎక్కి పోతున్న రాజుని పిలిచి అయ్యో రాజా, అర్థాకలి తిండి ఆరగించి పోతున్నావా - కడుపు నింపుకొని మరీ కదులు అన్నాడు. భోజరాజు తిరిగివచ్చి ఆశ్చర్యపడ్డాడు. ఈ ఆసామీ మంచె ఎక్కినపుడు మంచివాడుగా ఉన్నాడు. మంచె దిగగానే కొంచెపుతనంగలవాడిగా ఉన్నాడు ఈ మంచెమీదో, మంచెకిందో మంచితనం ఉండాలని అనుకొన్నాడు. ఆ పొలం అప్పుడే తవ్వించాడు.

వచ: అన్యాయం - నిరుపేదల భూమిని రాజు ఆక్రమించుకొన్నాడా అరపండిన పొలం అలా తవ్విపారేశాడా భోజరాజు నిజంగా నియంత నిరంకుశుడు, దుర్మార్గుడు భయంకర పైశాచిక పాశవిక నరహంతకుడు.

కవి: ఇది నేను సహించను. భోజుడెంత గొప్పవాడు అతడి హయాంలో కాళిదాసు భవభూతి ఎందరు కవులు ఎన్ని కావ్యాలు ఎంత స్వర్ణయుగం అది ఆ రాజుని న్యూనత పరిస్తే సహించను.

ప్ర: ఇదుగో మీ వ్యాఖ్యానాలూ విమర్శలూ అకతల పెడతారా పెట్టరా? నే నేదో కథ విందామనుకొంటూ ఉంటే - ఇదేమిటి రాజకీయ సొద. ఏవమ్మా - కథా భోజరాజుకి విక్రమార్కుడి సింహాసనం అలా దొరికిందా?

కథ. అవును. ఆ సింహాసనాన్ని చూడగానే భోజరాజు...

కవి : ఏమన్నాడంటే - ఇక్కడ నేనో రెండు పద్యాలు చెప్తా.

ఏ రాజు ఎక్కెనో ఈ సింహపీఠిపై
వసుధ భాగ్యాలతో వరలుచుండ
ఏ రాజు ఏలెనో ఈ గద్దెపైనెక్కి
ప్రజలు హాయిగ తాము బ్రతుకుచుండ

వచ: ఆపండి. ఈ సన్నివేశంలో పద్యం అనవసరం.

కవి: మొదలెట్టిన పద్యం పూర్తి చేయనియ్యండి. సీసంలో రెండు పాదాలూ ఎత్తుగీతి మిగిలిపోయాయి అవి చెప్పేస్తా.

వచ: సరేనండి. ఆ రెండు పాదాలలో పూర్తిచేసేండి.

కవి: అదెలాగ అంతా చెప్పాలి. ఛందస్సు —లక్షణం—ఏదీ తప్పకూడదు. సీసాలకి ఇంద్రగణము లారు ఇనగణమ్ములు రెండు పాద పాదమ్మున వరలుచుండు అతరవాత ఆటవెలదో తేటగీతో రాయాలి. అలా అయితే నేగాని సీసాలు పూర్తికావు.

వచ: పోనీవయ్యా - ఇవి విరిగిపోయిన సీసాలను కొందాం ఇంతతో ఆపు.

ప్ర: అవునయ్యా కవిగారూ ఆపు కథ విందాం.

కథ. ఆ విక్రమార్కుని సింహాసనాన్ని భోజరాజు తన కోటకి తీసుకెళ్లాడు.

ప్ర: అతడొక్కడే మోసుకెళ్ళాడా?

కథ. లేదు. కూలివాళ్ళచేత మోయించాడు.

వచ: ఓహో - ఇందులో కష్టజీవుల సమస్యని కూడా మనం కలపవచ్చు. రాజెక్కే పీఠం కాదు అది మోసిన కూలీల కథ మా పసందుగా ఉంటుంది. ఇక్కడ నాలుగు మార్పులు చేద్దాం. భోజరాజు భూమి తవ్వించాడు. ఆరునిలువులు అన్నపానాలు లేక కూలీలు తవ్వారు. వాళ్లు ముచ్చెమటలు కక్కుతూ ఉంటే రాజు మురుస్తూ కూర్చున్నాడు. వాళ్ళు ఎండలో తవ్వుతూ ఉంటే రాజు నీడపట్టున ముత్యాల గొడుగుకింద రత్నాలకంబళీమీద కూర్చున్నాడు. కూలీలు తవ్వడం పూర్తిచేసి సింహాసనాన్ని కనుగొనగానే రాజు దిగ్గునలేచి అంతవరకూ కష్టించిన ఆ కూలీలచేతే దానిని మోయించాడు - తన కోటకి తీసుకెళ్లమన్నాడు. అందులో ఒక కూలీ ఏమన్నాడంటే రాజా నాభార్యకి జబ్బుగా ఉంది. మందుకోసం వైద్యుడి దగ్గరకి వెళితే ముందు డబ్బు తెమ్మన్నాడు. అందుకోసం - ఆలిమందుకోసం తవ్వడానికొచ్చాను గాని - నువ్వేదో తవ్వి తలకెత్తుతావని రాలేదు. అన్నాడు. ఆ దురహంకారంగల రాజు కొరడా ఝుళిపించి వాణ్ణి జడిపించి...

ప్ర: భోజరాజు చేతిలో కత్తి కాక కొరడా ఉండేదా ఏమిటి?

వచ: కొవ్వెక్కిన రాజు
కొరడాతో కొరడాతో
కూలివాణ్ణి పేదవాణ్ణి
కొట్టాడని చెప్తే
జనుల కనులు చెమ్మగిల్లు
జాలి విధిగ జనించు

కూలివాడు సింహాసనాన్ని రాజుగారికోటకు చేరవేస్తే - అంతపనీ చేయించుకొని ఆ రాజు పావలా చేతిలో పెట్టాడు. అది పట్టుకొని మందుకొని కూలివాడు ఇంటికెడితే అప్పటికే భార్య మరణించింది. అయ్యో - ఎంత గుండెలు తరుక్కుపోయే విషాదగాథ ఎంత హృదయ విదారకమైన బాధ.

కథ: అదికాదు నా కథ అదికాదు నా కథ.

ప్ర: అసలు కథ మానేసి
పడ్డికథ వలదు -
అసలు కథ ఏమిటో
అది విని చెప్పు.

వచ: ఆఁ, సరే ఆ తరవాత ఏమైంది.

కథ: విక్రమార్కుని సింహాసనంపై ఎక్కి భోజరాజు కూర్చోవాలనుకొన్నాడు. ఎక్కబోయి - మొదటిమెట్టుమీద కాలు పెట్టగానే......

కవి: భూమి కంపించింది
నభము వర్షించింది
కడలి ఉప్పొంగింది
బొమ్మ మాట్లాడింది.
ఆగు మాగుము రాజ
ఆగుమోయీ భోజ

బృందగానం:
భోజరాజుని చూసి
బొమ్మ పలికింది.
భోజరాజుని అచట
బొమ్మ ఆపింది.

కవి. శౌర్యవంతుడు కడుంగడు
ధైర్యశాలి అతనికిలలో
ఎవ్వడు సాటి? అట్టి
విక్రమార్కునికి
దేవేంద్రదత్తమా
సింహపీఠిక ఇద్ది.
ఇద్దానిపై - ఈ సింగంపు
గద్దెపై కూరుచుండగ
నీకు అర్హత గలదా?

బృందగానం:
భోజరాజుని చూసి
బొమ్మ పలికింది
భోజరాజుని బొమ్మ
నిలిపివేసింది.

కవి: సాహసౌదార్యాలు
సద్గుణశ్రీలు
విక్రమార్కునికి
వెన్నతో చదువులు
దానధర్మాదులు
దయ కరుణ, జాలి
విక్రమార్కునికి
పుట్టుతో తోడుగులు
అట్టాని గద్దెపై
అధిష్ఠించంగ
అధిపభోజా నీకు
అర్హత గలదె.

బృందగానం:
భోజరాజుని చూసి
బొమ్మ పలికింది.
భోజరాజుని బొమ్మ
నిలిపివేసింది.

★ సాలభంజిక ★

ప్రశ్న: అప్పుడు భోజరాజు ఏమన్నాడు?

కథ: ఏమిటి విక్రమార్కుని గొప్ప అని అడిగాడు. ముప్పయిరెండు బొమ్మలూ ముప్పయిరెండు కథలు చెప్పాయి. అది విని మాన్యుడైన విక్రమార్కుని సింహాసనం మీద మరొకడు కూర్చోవడానికి తాహతు చాలదని భోజుడు తల వంచుకున్నాడు. నే నంతట కంచికి పోతాను. మీ రింక ఇంటికి పోవచ్చు.

పద: అచ్చే ఈ కథ మామూలుగా చెప్తే ఎలాగ? ఇది ఆధునిక దినాలకి అనువుగా మారుద్దాం భోజరాజుతో బొమ్మ చెప్పిం దేమంటే:

రాచరికానికి రోజులు పోయాయ్,
దోచుకొనేందుకు రోజులు కావోయ్,
అంతటి వీరుడు అంతటి ధీరుడు
విక్రమార్కుడే పోయాడు
ఆయన గద్దె ఆయన గొప్ప
పాతాళంలో పాతేశాం
కారే రాజులు
రాజ్యము చేయరె
ఏరీ వారంతా?
ఏడీ మాంధాత?
ఏడీ ఇక్ష్వాకుం
ఏడీ రాముండు.
పరిపాలించగ
ప్రభువును కేవని
పట్టంగట్టుకు వచ్చావు
గిట్టేవాడా నీతో జనని
పట్టుకుపోతావా, భూమిని
కట్టుకు పోతావా

కవి మాంధాతా చ మహీపతిః కృతయుగా
లంకార భూతోగతః
సేతుర్యేన మహోదధౌ విరచితః
క్వాసౌ దశాస్యాంతకః
అన్యేచాపి యుధిష్ఠిరప్రభృతయో -
యాతా దివం భూపతే
నైకే నాపి సమంగతా వసుమతీ,
మానం త్వయా యాస్యతి.

ప్ర పచరించే ఆయన పసందుగా
చెప్తూ ఉంటే
కవిగారూ ఎందుకీ
కఠోర శ్లోకం.
ఏమిటి దానికి అర్థం.

కవి: ఈయన ... భోజరాజు తనతో భూమిని పటుకుపోతాడా అని అడిగాడుగా - దానికి జవాబు

ప్ర: ఏమిటా జవాబు?

జ: జవాబు ఏమిటంటే...
మాంధాత పోయాడు
మరోడు పోయాడు
అంతా పోయారు వాళ్లు
భూమిని వదిలేపోయారు
భోజా, రవి సమతేజా
పోయేటప్పుడు భూమిని నీతో
పట్టుకుపోతావు. ఏమో
కట్టుకుపోతావు.

కవి: అని ఒక కవి చెప్పాడు.

పద: అది అబద్ధం అని తేలిపోయిందిగా. భోజరాజు పోయాడు భూమి మిగిలింది. అందుకే బొమ్మ హితోపదేశం చెయ్యగానే భోజరాజు పశ్చాత్తాపం చెంది, సర్వసంగ పరిత్యాగంచేసి రాజ్యాన్ని ప్రజల కప్పజెప్పి వెళ్లిపోతాడు ఇలా కథని అంతం చేస్తే ఇందులో ఎంతో ప్రగతి ఉంటుంది. ఎంతో నీతుంటుంది.

కథ ఇది కాదే నా కథ
ఇది కాదే నా సొద
ఎంతో నన్ను ప్రజలలో
ఎన్నదగ్గ దానిగా
చేస్తావని పిలిస్తే మార్చేస్తావా?

పద: నేను చెప్పిన మార్పులు చేస్తే
ప్రజలు నిన్ను మెచ్చుకొంటారు.
ఈరోజుల్లో నువ్వు
ఇమిడిపోతావు చక్కగా.
రా - నాతో రా
కథా ప్రబోధ గాథా
నిన్ను కథలరాజ్యానికి
ప్రధానిగా ఎన్నిక చేయిస్తాను.

కథ మీరు చెప్పిన మార్పులైతే
నేను నే నే కాను
ఏమీ మిగులబోను.
నన్ను నా దోషాలతో
నన్ను నా లోపాలతో
ఎన్నిక చేయించండి

పద: మార్పులు లేకపోతే నేనొప్పుకోను.
మార్చుకో నిన్ను.

కథ మార్చుకోను

పద మార్చుకోవాలి

కథ మార్చుకోలేను.

పద. మార్చుకోకపోతే వీల్లేదు.
ముమ్మారడుగుతా చెప్పు.
మార్చుకొంటావా?

కథ ఊహూ

పద రెండోసారి.

కథ. లేదు.

పద మూడోసారి.

కథ ఒప్పుకోను.

పద: అయితే అఘోరించు.
నే పోతున్నా

కథ. అయ్యో ఆయన వెళ్ళిపోయాడే, కవిగారూ, కవిగారూ, నన్ను నలుగురికీ చెప్పరూ?

కవి చెప్తా - అష్టాదశ వర్ణనలూ
చిత్ర కవిత్వం బంధ కవిత్వం
ప్రౌఢ ప్రయోగాల్ అన్నీ వాడి
చేతికీ కాలికీ మెడలో జడలో
అలంకారములు తొడిగి.

కథ అయ్యో అయ్యో
అట్లాటయితే
నన్నేం పోల్చరు ప్రజలు.
కవిగారూ? కవిగారూ,
తేటమాటల్లో
సూటిగా చెప్పండి.

కవి: నా చిత్తం వచ్చిన తీరులో
నా ఇష్టంవచ్చిన రీతిలో చెప్తా -

కథ: శైలి కఠినం
వృథా పఠనం
శైలి కఠినం
వృథా పఠనం
యోచించండి కవిగారూ,
నన్ను ప్రజలలో పడెయ్యండి.

కవి నా విధానం
సంవిధానం
నేను వదలను
ఎంతమాత్రం
గొట్టు మాటలు
క్లిష్ట ప్రాసలు
చూపుతా విద్వత్తుని
చ్ఛాపిదా వైగప్యగా,

కథ అయితే మీకో దండం
మీ రచనలో
మిగిలేది ఏమిటి
నేనుమాత్రం కాదు కాదు
పాండిత్య మొకటే నిలుచును.

కవి అయితే సెలవు
చేరుకొంటూ నా సెలవు

కథ అయ్యో ప్రజాహృదయం తెలిసిన ప్రచారకుడలా పోయాడు పాండిత్యంగల కవి విడిపోయాడు ఇక నన్ను విముక్తిచేసే దెవ్వరా.

విముక్తిచేసే దెవ్వడు?
విముక్తి లేదా?
విముక్తి లేదా?
విముక్తి లేదా?

మహోపద్రవం తరవాత నిశ్శబ్దంలో సన్నగా మెల్లగా బృందగానం

అగాధమైన గతమ్ములో
వల గాఢమైన తమస్సులు
తమస్సులందున కథలు దిగబడి
చేయుచుండు తపస్సులు.

★

శ్రీ వత్స వారి
శ్రీ కాఫ్
దగ్గు, ఉబ్బసములకు దివ్యౌషధము

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S Radha krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1 Editor S Sambhu Prasad



"మదుపు"

కృష్ణారావు—శ్రీకాకుళం.

పుష్టినిచ్చే ఔషధం యెవరికి కావాలి?

- ఆరోగ్యము కలిగి, ఎల్లప్పుడు ఉల్లాసముగా ఉండాలని నిర్ణయించుకున్నవారికి
- కాయిలాపడి తేరుకుంటూ, పూర్ణారోగ్యం, బలము, శక్తి సంపూర్ణంగా పొందలేనివారికి

మానవ శరీరము యంత్రము వంటిది

యంత్రము సరిగా పనిచేయుటకు

ఆవిరి, వేడి, చమురు ఆవశ్యం కావాలి. అదేమాదిరిగా, శరీరారోగ్యానికి

వాత, పిత్త, కఫములు అవసరం.

సమపాళ్ళలో అవన్నీ ఉండటమే జీవితము

ఇవి సరిగా లేకుండుటయే క్రమ విరుద్ధం - రోగము.

వీని తరువాత ఫలితాలు వ్యస్తము, రోగము—ఎవరు ఊహించగలరు?

★ నవరత్న - కల్ప ★

వజ్రములు, మాణిక్యములు, ముత్యములు, పగడములు, పచ్చలు, గోమేధికములు, నీలములు వగైరా తొమ్మిది విలువగల రాళ్ళు కలసినది.

అన్ని విధములైన జబ్బులకు ఉపయోగపడునది పుష్టినిచ్చుటలో పాటిలేనిది ఆదర్శమైన ఔషధము.

- చెదరిపోయిన ఆరోగ్యాన్ని చక్కపరుచుటకు
- కోల్పోయిన జవసత్త్వములను తిరిగిపొందుటకు

మరియు

యౌవనాన్ని తిరిగి యథాస్థితికి తెచ్చుటకు



కనుగొన్నవారు:

కవిరాజ్ పండిత్ **దుర్గాదత్ శర్మ**, వైద్య వాచస్పతి

ఉచిత లిటరేచర్ కు వ్రాయండి

నవరత్న కల్ప ఫార్మసీ

జలందర్ సిటీ, (ఇండియా).

టెలిగ్రాం: "Navratna"